అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 15-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 73 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

మహారాష్ట్రలో ఉద్యోగుల నిరవధిక సమ్మె

- స్తంభించిన కార్యకలాపాలు



ముంబయి : పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలో ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. క్లాస్ 3, 4 ఉద్యోగులు, బోధనా, బోధనేతర సిబ్బందిలో చాలామంది విధులకు హాజరు కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య రంగ సేవలు, పాఠశాలలు, కాలేజీలు ...5లో

బిల్లులు ఆమోదించేలా ఆదేశించాలి



తెలంగాణ ప్రభుత్వం... గవర్నర్ పై పిటిషన్ 20న విచారణ

న్యూఢిల్లీ : బిల్లులు ఆమోదించాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆదేశించాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్నది. శాసనసభ ఆమోదించిన పది కీలక బిల్లులను ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు తీసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే మంగళవారం ప్రస్తావించారు. ధర్మాసనం ఎదుట ఇప్పటికే కేసులు ...5లో

డిమాండ్ల సాధన కోసం పోరాటం

కదం తొక్కిన రైతులు, గిరిజనులు

నాసిక్ నుంచి ముంబయికి మార్చ్

- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ
- పాల్గొన్న వేలాది మంది నిరసనకారులు
- చర్చలు జరపాలన్న ప్రతిపక్ష నాయకులు
- నేడు రైతు ప్రతినిధులతో 'మహా' సర్కారు భేటీ

వివరాలు 6లో..



బీజేపీలో చేరితే... కేసులు ఎత్తేస్తారా!



ప్రతిపక్ష నాయకులే టార్గెట్...ఈడీ, సీబీఐ కేసుల పేరుతో వేధింపులు..

- ప్రతిపక్ష నాయకుల్ని ఒంటరి చేయాలన్నదే ఎజెండా : సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : ప్రతిపక్ష నాయకులను వేధించటమే లక్ష్యంగా ఈడీ, సీబీఐలను కేంద్రం ప్రయోగిస్తోందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఆయా కేసుల్లో ఇరుక్కున్నవారికి బీజేపీలో చేరగానే..కేసుల నుండి విముక్తి ఎలా కలుగుతోందని ప్రశ్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కార్ దుర్వినియోగం చేస్తోందన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత 9ఏండ్లుగా ప్రతిపక్ష నాయకులపై నమోదైన కేసుల్లో నేర నిరూపణ రేటు ఎంతుందో బయటపెట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. "కేంద్ర దర్యాప్తు సంస్థలకు మేం వ్యతిరేకంగా కాదు. కానీ గత 9ఏండ్లుగా ఈడీ నమోదుచేసిన కేసుల్లో నేర నిరూపణ రేటు ఎంతుందో ? గమనించాలి. ఇది 0.5శాతం మాత్రమే. చట్టాన్ని అతిక్రమించారని కేంద్ర దర్యాప్తు సంస్థలు భావిస్తే, న్యాయస్థానాల్లో ఎందుకు నిరూపించటం లేదు?"అని ప్రశ్నించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బీజేపీలో చేరితే కేసులుండవు..

ఇప్పుడు ఈడీ దాడులు, సీబీఐ కేసులు..అంటే ప్రతిపక్ష నాయకులని వేధించటం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షాల ...5లో

గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చెందొద్దు

షెడ్యూల్ ప్రకారమే మెయిన్స్ పరీక్షలు

- విచారణలో లీకైనట్టు తేలితే 'ప్రిలిమ్స్' రద్దు
- ప్రవీణ్‌కు 103 మార్కులు వాస్తవమే
- ఓఎంఆర్‌లో డబుల్ బబ్లింగ్‌తో అనర్హత
- ఏఈ పరీక్షపై నేడు నిర్ణయం
- రూ.10 లక్షలకు ప్రశ్నాపత్రం అమ్ముకున్నారు
- నమ్మిన వారే గొంతుకోశారు
- ఆ ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోతారు
- భవిష్యత్తులో జరిగే పరీక్షలకు కొత్త ప్రశ్నాపత్రాలు : టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్ బి జనార్ధన్‌రెడ్డి చెప్పారు. షెడ్యూల్ ప్రకారమే మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లీకేజీకి సంబంధించి పోలీసులు విచారణ చేస్తున్నారనీ, గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రశ్నాపత్రం లీకైనట్టు తేలితే ఆ పరీక్షను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. జూన్ ఐదు నుంచి 12వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ ...6లో

రిజర్వేషన్లకు మోడీ ఎసరు

ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రభుత్వాల వివక్ష

- ప్రజాసంఘాలు, కేవీపీఎస్ మహాధర్నాలో బీవీ రాఘవులు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత, గిరిజనులపై ప్రభుత్వాల వివక్ష దుర్మార్గంగా ఉందని దళిత్ సోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ నాయకులు బీవీ రాఘవులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ప్రజాసంఘాలు, కేవీపీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ తొమ్మిదేండ్ల పాలనలో దళితులపై జరిగిన దాడులను నిరసిస్తూ..'రాజ్యాంగం, రిజర్వేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ' అనే అంశంపై మహాధర్నా నిర్వహించాయి. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ దర్నాలో రాఘవులు మాట్లాడుతూ దళిత, గిరిజనులను దొరలు, భూస్వాములు, అగ్రకుల పెత్తందార్లనుంచే కాకుండా..పాలకుల నుంచి కూడా వివక్షకు గురవుతున్నారని చెప్పారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన పాలకులు వీరి అభివృద్ధి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటం వివక్ష కాకపోతే మరేంటని ప్రశ్నించారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, ప్రణాళికాబద్ధంగా వారి అభివృద్ధికి కృషి చేయడం లేదని చెప్పారు. 16శాతంగా ఉన్న ఎస్సీ జనాభాకు ఏడు శాతం నిధులు కేటాయించి, అందులో మూడు శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని వివరించారు. ఫ్లైఓవర్లు, స్టేడియాలు తదితర నిర్మాణాల్లో దళితుల వాటా ఉందని చెప్పడం విడ్డూరంగా ...5లో

సాగునీటికి సాయం సున్నా

ప్రాజెక్టులపై కేంద్రం వివక్ష

కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష ప్రభుత్వాలు ఉన్నరాష్ట్రాల్లో ప్రాజెక్టులు, పథకాలకు నిధులు ఇవ్వకుండా ఎండబెడుతున్నది. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని పదే పదే సీఎం కేసీఆర్ గొంతు చించుకున్నా, మోడీ మనస్సు కరగ లేదు. ప్రణాళిక సంఘం స్థానే ఏర్పాటైన నిటిఅయోగ్ సైతం తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక తోడ్పాటును అందించాలని సూచించినా, మోడీ ప్రభుత్వం ససేమిరా అంటున్నది. కేంద్ర ప్రభుత్వ వైఖరితో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నది. తెలంగాణ నుంచి పోయే పన్నులెక్కువ కాగా, ఢిల్లీ నుంచి తిరిగి వచ్చే నిధులు మాత్రం చాలా తక్కువగా ఉంటున్నాయి. రాష్ట్రానికి సాధారణ కేటాయింపులు సైతం అత్తెసరే. గత కేంద్ర బడ్జెట్టే ఇందు సాక్ష్యం. సాగునీటి రంగానికి చేసిన కేటాయింపుల్లో కర్నాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు చూపలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా నిధులు రాకపోవడం గమనార్హం.



బి.బసవపున్నయ్య

మేమే కేంద్రానికి ఇస్తున్నాం రాష్ట్ర ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తున్నది. గత ఏనిమిదేండ్ల కాలంలో దాదాపు రూ. 3. 5 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో ఇస్తే, తిరిగి వచ్చింది. రూ. 1.5 లక్షల కోట్లు కూడా లేవు. అలాగే ఆయా పథకాల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ. 45 వేల కోట్లను కేంద్రం ఆపేసింది. బోరుబావులకు మీటర్లు పెట్టడం లేదని ఏడాదికి రూ.6 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలోపు రూ. 30 వేల కోట్లు ఇవ్వలేదని ఇటీవల సంగారెడ్డిలో వ్యాఖ్యానించారు.

ఈ ప్రాజెక్టులకు ఉత్తచెయ్యి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులతో పాటు మిషన్ భగీరథ, ఇతర పథకాలకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలంటూ పలు మార్లు స్వయంగా సీఎం, మంత్రులు ప్రధాని మోడీతోపాటు ఇతర కేంద్ర మంత్రులనూ కలిశారు. పదే పదే వినతులూ ఇచ్చారు. అయినా కేంద్రం కనికరించలేదు. ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి రాష్ట్రాల ఆదాయాన్ని తన నియంత్రణలోకి తీసుకుని సమాఖ్య స్వభావాన్ని దెబ్బతిసింది. కేంద్రం ఇవ్వక పోగా, అప్పులు చేయడానికి సైతం ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల పేర ఆటంకాలు సృష్టిస్తున్నది. గత మూడేండ్లుగా కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని కోరుతున్నా మొండిచెయ్యే చూపుతున్నది. నీటిఅయోగ్ సైతం మిషన్ కాకతీయకు రూ.5000 కోట్లు, మిషన్ భగీరథకు రూ. 19000 కోట్లు ఇవ్వాలని సిఫారసు చేసినా చెత్తబుట్టలో పడేసింది.

కేంద్రం సహాయ నిరాకరణతోనే అప్పులు

రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిదేండ్లుగా సాగునీటి పథకాలకు భారీగా నిధుల కేటాయింపులు చేస్తూ వస్తున్నది. అయితే కేంద్రం వివరాలు 6లో..



సంక్షోభాలకు పరిష్కార మార్గం

మార్క్సిజమే

- కారల్ మార్క్స్ 140 వర్ధంతిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

5లో..

బీజేపీ-ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను ఎండగడతాం

- సీపీఐ(ఎం) 'జనచైతన్య యాత్ర' పోస్టర్ ఆవిష్కరణలో తమ్మినేని



5లో..

వాహనం లేని పోలీస్‌స్టేషన్లు 63

- టెలిఫోన్ లేనివి 628 : కేంద్రం వెల్లడి

వివరాలు 5లో..

అవినీతి ఎమ్మెల్యేకు షాక్

హైకోర్టు బెయిల్ మంజూరుపై సుప్రీంకు కర్నాటక లోకాయుక్త

- విచారణకు సర్వోన్నత న్యాయస్థానం ఓకే



న్యూఢిల్లీ : కర్నాటక సబ్బులు, డిటర్జెంట్లు (కేఎస్‌డీఎల్) ఒప్పందం కుంభకోణంలో రాష్ట్ర హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన బీజేపీ ఎమ్మెల్యే మడల్ విరూపాక్షప్పకు షాక్ తగిలింది. హైకోర్టు బెయిల్‌ను సవాలు చేస్తూ కర్నాటక లోకాయుక్త వేసిన పిటిషన్‌ను విచారించడానికి భారత సర్వోన్నత న్యాయస్థానం ఆమోదం తెలిపింది. ఈ పిటిషన్‌పై తక్షణమే విచారణ జరపాల్సిందిగా కర్నాటక లోకాయుక్త సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరింది. అయితే, దీనిపై విచారించడానికి కుదరదనీ, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు దీని గురించి ప్రస్తావించాలని సీజేఐ సూచించారు. దీంతో వెంటనే జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ధర్మాసనం వద్దకు వెళ్లిన లోకాయుక్త న్యాయవాది.. పిటిషన్‌పై తక్షణమే విచారణ జరపాలని కోరారు. ఇది బెయిల్ రద్దుకు సంబంధించిన అంశమనీ, సాధ్యమైనంత త్వరగా విచారిస్తామని జస్టిస్ సంజయ్ కౌల్ తెలిపారు.

కుమారుడి అరెస్టుతో అప్రమత్తమై..

కేఎస్‌డీఎల్ కార్యాలయంలో తన తండ్రి తరపున రూ. 40 లక్షల ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు ప్రశాంత్ మడల్‌ను లోకాయుక్త పోలీసులు ఈనెల 2న అరెస్టు చేసిన ...5లో

బండితో బేజారు...

ఒంటెత్తు పోకడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

- చేరికల కమిటీకీ ఈటల రాజీనామా?
- ఎడమొహం పెడమొహంగానే ఇతర నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆట్..ఊట్.. అంటూ హడావిడి చేస్తున్న బీజేపీలో లుకలుకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. బండి ఒంటెత్తు పోకడ ఆ పార్టీలోని నేతలకు దూరం పెంచుతున్నది. అది ఆయనపై మూకుమ్మడిగా దాడిచేసేందుకు ఊతమవుతున్నది. అమిత్‌షా, నడ్డా జోక్యం చేసుకున్నా పంచాయితీ తెగకుండా చిక్కుముడిగా మారుతుందనే ప్రచారం జరుగుతున్నది. బండి సంజయ్ అంతా నాయిష్టం.. తాను చెప్పిందే వేదం అన్నట్టుగా వ్యవహరించడం, ఎక్కడికెళ్లినా మీడియాలో తానే హైలెట్ కావాలనే ఆయన ధోరణితో మిగతా నేతలు తలలు పట్టుకుంటున్నారు. మీడియా సమావేశాల్లో బండితో పాటు కొందరే కూర్చోవటం దానికి ఊతమిస్తున్నది. కనీసం తమ హోదాకు తగ్గట్టు పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లు కూడా పెట్టలేని పరిస్థితి నెలకొందని నెత్తీనోరూ బాదుకుంటున్నారు. బండి ఇతర నేతలెవ్వరూ హైలెట్ కాకుండా తొక్కిపెడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో క్షేత్రస్థాయి బలోపేతం దేవుడెరుగు రాష్ట్ర కేంద్రంలోనే ఒక నేతకు మరో నేతకు అస్సలు పొసగని పరిస్థితి నెలకొంది. అతిగా ఊహించుకుని బీజేపీలో చేరిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూసి ఎందుకు చేరానురయ్యా? అని పశ్చాత్తాపపడుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పెద్దగా కలిసిపోవడం లేదు. పార్టీ అధిష్టానం అప్పగించిన చేరికల కమిటీ చైర్మెన్ పదవీ నాకొద్దంటూ అధిష్టానానికి ఖరాకండిగా తేల్చిచెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తన వాగ్ధాటితో అసెంబ్లీలో అధికార పార్టీలను ఇరుకున పెట్టిన ఈటల రాజేందర్‌ను ...6లో

ప్రమోషన్ లేదు.. ఉద్యోగ భద్రతా లేదు



హోంగార్డులకు గుర్తింపేది..?

- 30 ఏండ్ల సర్వీస్ ఉన్నా అక్కడే..
- హెల్త్‌కార్డు, బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వర్తించవు
- చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న వైనం

(ఇ.రత్నాకర్)

'ఏ పోలీస్‌స్టేషన్‌కెళ్లినా గుమ్మం ముందు వారే ఉంటారు. పొద్దస్తమానం ఎండలో నిలబడతారు. పెద్దసార్ల నుంచి కానిస్టేబుళ్ల దాకా ఆఫీసులో ఏ అవసరమొచ్చినా తక్కున గుర్తొచ్చేది వారే. 'ఏయ్ ఇటురా? చాయ్ తేపో... టిఫిన్ తేపో.. కోర్టుకెళ్లి ఈ కాఫీలు ఇచ్చిరా.. సమన్లు అందించి రాపో...' అని వచ్చే ఆదేశాలకు "ఎస్ సార్" అంటూ తలొగ్గాల్సిందే. ఇలా గొడ్డుచాకిరీ చేసినా ఛీత్కారాలు తప్పవు. పేరుకే ఒంటిపై యూనిఫామ్‌గానీ దక్కే గౌరవం అంతంతే. ఏండ్లుగా పర్మినెంట్ చేస్తారనే ఆశగా ఎదురుచూసినా చివరకు నిరాశే ఎదురవుతోంది. రిటైర్ అయితే ఒట్టి చేతులతో ఇంటికెళ్లాల్సిందే. ఇదీ రాష్ట్రంలోని హోంగార్డుల దుస్థితి.

రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల మంది హోంగార్డులు ఉన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇలా ఉన్నత చదువు చదివినవారే. వీరు సివిల్, ట్రాఫిక్, క్లూస్‌టీమ్, తదితర విభాగాల్లో తమ సేవలను అందిస్తున్నారు. ఖాకీ యూనిఫామ్ వేసుకుని కానిస్టేబుళ్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్లుగా, ఆపరేటర్లుగా, బందోబస్తులు, నైట్ డ్యూటీలు, డ్రంకెన్ డ్రైవ్ చెకింగ్‌లు, రికార్డుల మేయింటనెన్స్‌లలో కీలక పాత్రపోషిస్తున్నారు. టీ అందించడం దగ్గరి నుంచి టప్పాలు, సమన్లతోపాటు అన్ని సేవలూ చేస్తున్నారు. హోంగార్డు ఇచ్చిన కీలక సమాచారం తో ఎన్నో సంచలనమైన కేసులు ఛేదించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇంత చేసినా వీరి శ్రమకు తగ్గ గుర్తింపు దక్కట్లేదు. కానిస్టేబుళ్లకు వర్తించేవి ఏవీ వారికి దక్కట్లేదు. 2006కు ముందు.. రోజుకు రూ.75 చొప్పున నెలకు రూ.2,200 వేతనం ఇచ్చేవారు. అనేకసార్లు వినతులు ఇవ్వగా 2009 నాటికి రూ.6 వేలకు పెంచారు. 2014లో రూ.12వేలకు, 2018లో రూ.18వేలకు పెంచారు. ఏడాదికి వెయ్యి రూపాయల వేతనం పెంచు తామనీ రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చి అమలు చేస్తున్నది. పీఆర్సీ అందరిలాగా కాకుండా కేవలం రూ.20 వేలకే లెక్కగట్టి పెంచింది. దీంతో వారికి రూ.27,500 వేతనం దక్కుతున్నది. ఈ వేతనం విషయం ఒక్కటే కొంత సానుకూల అంశం. వీరికి సెలవులు ఇవ్వడం లేదు. ఒక్కరోజు హాజరు కాకపోయినా వేతనంలో కోత విధిస్తున్నారు. దీంతో పెండ్లి, శుభకార్యాలకు, చావులకు, వ్యక్తిగత అవసరాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

రిటైర్డ్ అయితే ఒట్టి చేతుల్తోనే ఇంటికి..

డిపార్టుమెంట్‌లో హోంగార్డులుగా 30, 35 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా ప్రమోషన్లు ఎరుగరు. సెక్యూరిటీ గార్డులకు కూడా రిటైర్‌మెంట్ సొమ్ము అందుతున్న తరుణమిది. హోంగార్డులు మాత్రం ఉట్టి చేతులతో ఇంటికి వెళ్తున్నారు. హెల్త్ కార్డులులేవు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సదుపాయం అందట్లేదు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో మృతిచెందితే మాత్రమే ఆ సమయంలో బీమా సంస్థ నుంచి రూ.5లక్షలు బాధిత కుటుంబానికి చెల్లిస్తున్నారు. గుండెజబ్బులు, క్యాన్సర్ లేదా వివిధ దీర్ఘకాలిక రోగాలు, వివిధ కారణాలతో మృతిచెందితే అంతే సంగతులు. బాధిత కుటుంబం రోడ్డున పడాల్సిందే. డిపార్టుమెంట్ నుంచిగానీ, ప్రభుత్వం నుంచిగానీ ఒక్క రూపాయి చెల్లించరు. తోటి హోంగార్డులే చందాలు వేసుకుని బాధిత కుటుంబానికి ఎంతోకొంత ఆర్థిక సహాయం చేస్తున్నారు.

హామీలు బుట్టదాఖలు..

పోలీస్ శాఖలో హోంగార్డులకు మంచి గుర్తింపు ఇస్తామని, పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం మాటలు నీటబుడగలయ్యాయి. ఆరోగ్య భద్రత కల్పిస్తామన్న హామీలు మరుగునపడ్డాయి. ఐదేండ్లు పూర్తి చేసిన హోంగార్డులకు వయస్సుతో సంబంధం లేకుండా(ఎస్‌పీఓ) స్పెషల్ పోలీస్ అసిస్టెంట్‌గా లేదా సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా, పీటీఓ డ్రైవర్లుగా, ఏఆర్‌గాగానీ, తెలంగాణ స్పెషల్ పోలీస్‌గా గుర్తించాలని, లేదా ఎస్‌పీఎఫ్‌లో విలీనం చేయాలని గతంలో హోంగార్డు నాయకులు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. న్యాయమైన డిమాండ్లను పరిశీలిస్తామన్న ప్రభుత్వం ఆ తర్వాత పట్టించుకోలేదు. ఎన్నో సార్లు మంత్రులను, ఎమ్మెల్యేలను, అధికారులతోపాటు తెలిసిన వారికల్లా మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. రాబోయే ఎన్నికల్లోపైనా తమకు మంచి రోజులొస్తాయని హోంగార్డులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వంపై ఎన్నోఆశలు పెట్టుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కానిస్టేబుళ్లతో సమానంగా డ్యూటీలు చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని హోంగార్డులు మనవి చేస్తున్నారు. తమ సహచరులు చనిపోతే ఎంతో కొంత వేసుకుని బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారు లు, ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రతతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్యబీమా, హెల్త్‌కార్డు సదుపాయాన్ని కల్పించాలని పలువురు హోంగార్డులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

హోంగార్డుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా హోంగార్డులకు సరైన గుర్తింపు లేదు, అవమానాలు ఎదుర్కొంటున్నారు. రేయనకా పగలనకా రోడ్లమీద గొడ్డుసాకిరీ చేస్తున్నారు.

ప్రభుత్వ సేవల్లో, అధికారిక కార్యక్రమాల్లో హోంగార్డులు సేవలందిస్తున్నారు. అయినా వారికి ఉద్యోగ భద్రత లేదు. వారి సేవలను గుర్తించి ప్రమోషన్లు కూడా వర్తింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వేలాది మంది కుటుంబాలు ఆధారపడిన హోంగార్డుల సమస్యలను గుర్తించి, వారితో చర్చించాలి. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ఉద్యోగ భద్రతను, పీఎఫ్, ఈఎస్ఐతోపాటు తదితర సౌకర్యాలు కల్పించాలి.

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్

విజయరామారావుకు సీఎం నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మాజీ మంత్రి కె.విజయ రామారావు భౌతిక కాయానికి సీఎం కేసీఆర్ పుష్పాంజలి ఘటించి, ఘన నివాళు లర్పించారు. మంగళ వారం ఆయన నివాసానికి వెళ్లిన సీఎం... విజయరామారావు కుమారుడు, కూతురు, అల్లుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంటి పెద్దను కోల్పోయిన వారిని ఓదార్చారు. అంత్యక్రియలకు సంబంధిం చిన ఏర్పాట్ల గురించి సీఎం ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు మధుసూధనా చారి, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రవణ్ కుమార్ రెడ్డి, డీజీపీ అంజనీ కుమార్, కమిషనర్ సి.వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

- 15వేల మెగావాట్లకు చేరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. మంగళవారం ఉదయం 10.03 గంటలకు పీక్ అవర్ డిమాండ్ రికార్డు స్థాయిలో 15,254 మెగావాట్లకు చేరింది. అయితే ఈ డిమాండ్‌ను విద్యుత్ పంపిణీ సంస్థలు ముందే ఊహించడంతో ఎక్కడా ఎలాంటి అవాంతరాలు ఏర్పడలేదు. ఇప్పటి వరకు రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధిక విద్యుత్ వినియోగం. రాష్ట్రంలో సాగు విస్తీర్ణంతో పాటు పారిశ్రామిక అవసరాలు కూడా పెరగడంతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నట్టు టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు. మొత్తం విద్యుత్ వినియోగంలో 37 శాతం వ్యవసాయ రంగానిదేనని ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగంలో దక్షిణ భారతదేశంలో తమిళనాడు మొదటి స్థానంలోఉండగా, తెలంగాణ రెండో స్థానంలో ఉన్నదని ఆయన వివరించారు. ఈ ఏడాది వేసవికాలంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉన్నదని అంచనా వేశామని ఆయన తెలిపారు. డిమాండ్ ఎంత పెరిగినా ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

వైద్య పరికరాల పరిశ్రమ సమస్యలను తీర్చాలి

కేంద్రానికి మంత్రి కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో వైద్య పరికరాల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. జీఎస్టీ, దిగుమతి పన్నుల విధింపుతో మేక్ ఇన్ ఇండియాపై ప్రభావం పడుతున్నదని తెలిపారు. వైద్యపరికరాల విడిభాగాలపై విధిస్తున్న పన్ను సామాన్యులకు చవకగా ఆరోగ్యసంరక్షణ అందించడానికి ఇబ్బందిగా మారుతున్నదని చెప్పారు. ఆరోగ్యరంగంపై జీఎస్టీ తిరిగి చెల్లించే పన్ను కాదని తెలిపారు. వైద్య పరికరాలు విలాసవస్తువులు కాదంటూ, ఆరోగ్యసంరక్షణను అందరికీ చేరువ చేసేవని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైద్య, రోగ నిర్ధారణ పరికరాలపై ఉన్న 18 శాతం పన్నును 12 శాతం, ఐదు శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలో ఈ రంగంలో అగ్రగామి 20 దేశాల్లో ఒకటిగా, ఆసియా ఖండంలో నాలుగో స్థానంలో నిలిచిన భారతదేశానికి ఈ తగ్గింపు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైద్య పరికరాల దిగుమతితో ఖర్చు పెరగడమే కాకుండా, అవి వచ్చేందుకు ఆరు నెలల నుంచి 12 నెలల సమయం పడుతున్నదనీ, దీన్ని నివారించేందుకు దేశీయంగా తయారీకి ప్రోత్సాహకాలివ్వాలని సూచించారు. హైదరాబాద్ మెడికల్ డివైజెస్ పార్కులో మెడికల్ ఇమేజింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్రంలో భాగస్వామి కావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని స్పష్టం చేశారు. టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటులోనూ భాగస్వాములు కావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

లైన్‌మెన్‌లకు సిఈఏ అవార్డులు

- అభినందించిన టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్పీడీసీఎల్) కు చెందిన ముగ్గురు లైన్‌మెన్‌లకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఈఏ)ఉత్తమ సర్వీస్ అవార్డులు లభించాయి. లైన్‌మేన్ దినోత్సవం సందర్భముగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వీరు అవార్డుల్ని స్వీకరించారు. సిద్దిపేట సర్కిల్ లైన్‌మెన్ కే ఈశ్వర్‌రెడ్డి, హబ్సిగూడ లైన్‌మెన్ డి మల్లారెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ లైన్‌మెన్ కొండూరు యాదయ్య ఈ అవార్డుల్ని అందుకున్నారు. వీరి ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రం, మెడల్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి వారికి అభినందనలు తెలిపారు. ఈ అవార్డులు ఇతర ఉద్యోగులు, సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయని చెప్పారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో లైన్‌మెన్లతో పాటు (గ్రీన్‌ల్యాండ్స్), కంటోన్మెంట్ డివిజనల్ ఇంజినీర్లు సుధీర్‌కుమార్, ఈఎస్ సుచేంద్రనాథ్ కూడా పాల్గొన్నారు. లైన్‌మెన్లను సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) జే శ్రీనివాసరెడ్డి కూడా అభినందించారు.

కాళేశ్వరం అవినీతిపై విచారణ జరపాలి

- జంతర్ మంతర్‌లో వైఎస్ షర్మిల ఆందోళన
- పార్లమెంట్ ముట్టడికి యత్నం...అరెస్టు



న్యూఢిల్లీ : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరపాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జంతర్ మంతర్ వద్ద వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పార్లమెంట్ ముట్టడికి షర్మిల యత్నించగా, ఢిల్లీ పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఆమెతో పాటు వైఎస్ఆర్‌టీపీ నేతల ను కూడా అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతి దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని అన్నారు. 2జీ, కోల్ గేట్ కుంభకోణాల కంటే ఇదే పెద్దదని పేర్కొన్నారు. రూ.1.20లక్షల కోట్ల ప్రజాధనం కాళేశ్వరంలో పోశారని, ఇందులో వేలాది కోట్లు కెసిఆర్ దోచుకున్నారని విమర్శించారు. 18 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి, 1.5లక్షల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. 1.5 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని స్వయాన మంత్రే అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుకు చేసిన వ్యయం కోసం కేంద్ర సంస్థలైన పవర్ కార్పొరేషన్ రూ.38వేల కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ రూ.30వేల కోట్లు, పీఎన్బీ రూ.11వేల కోట్లు, నాబార్డ్, ఇతర సంస్థలు కలిపి రూ.20వేల కోట్ల వరకు రుణాలు ఇచ్చాయని తెలిపారు. ఈ సొమ్మంతా దేశ ప్రజలదేనని,అందుకే ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిబంధనలన్నీ గాలికి వదిలేశారని, కేసీఆర్ ఈ ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి, ప్రాజెక్టు వ్యయాన్ని మూడు రెట్లు పెంచి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రూ.1600 కోట్లతో కొను గోలు చేసిన మోటార్లకు రూ.7వేల కోట్ల లెక్కచూపారని, రూ.38వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు, రూ.1.20లక్షల కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. దీనిపై కేసీఆర్ సమాధానం చెప్పాలనీ, ప్రతి ప్యాకేజీలో అవినీతి జరిగిందని అన్నారు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీళ్లు ఎత్తిపోస్తామని చెప్పి, అర టీఎంసీ కూడా లిఫ్ట్ చేయడం లేదని ఆరోపించారు.

ఎల్ఐసీ జోనల్ మేనేజర్‌గా శామ్‌సుందర్



హైదరాబాద్: ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ హెడ్‌గా ఎల్‌కె శామ్‌సుందర్ మంగళ వారం బాధ్యతలను స్వీకరించారు. ఇకపై ఆయన ఈ జోనల్ మేనేజర్‌గా కొనసాగనున్నారు. ఇంతక్రితం ఆయన సికింద్రాబాద్ జోర్హాత్ డివిజన్లకు డివిజనల్ మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉంది. జోనల్ ట్రెయినింగ్ సెంటర్, హైదరాబాద్‌కు డైరెక్టర్‌గా, ముంబయి కార్యాలయంలో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేశారు. దాదాపు 35 ఏండ్లుగా బీమా రంగంలో వివిధ హోదాల్లో సేవలందిస్తూ ఉన్నారు. సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. వైద్య బీమాలో ఆయన డిప్లమా చేశారు.

నేడు చలో రాజ్‌భవన్

కాంగ్రెస్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వ హించాలని టీపీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈనెల 13న చలో రాజ్‌భవన్ నిర్వహించాల్సి ఉందనీ, అదే రోజు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉండటంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఉదయం 10 గంటలలోపు గాంధీ భవన్‌కు పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

అదానీ తప్పిదాలను కప్పిపుచ్చేందుకే... : మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మోడీని ఉపయోగించుకుని అదానీ చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే...రాహుల్‌గాంధీని బీజేపీ క్షమాపణ కోరుతున్నదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజాస్వామ్యానికి ఎక్కడా వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. దేశంలో మోడీ నియంతృత్వ పాలన, అణచివేత ధోరణిపై ఆయన లండన్‌లో ప్రసంగించారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మల్లురవి మాట్లాడారు. పార్టీ సీనియర్లు సీఎం కేసీఆర్‌కు అమ్ముడు పోయారంటూ రేవంత్‌రెడ్డి అన్నట్టు ప్రచారం జరుగుతున్నదనీ, గతంలో పార్టీ మారిన కొంత మంది నాయకులనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారని వివరణ ఇచ్చారు. రేవంత్ మాట్లాడిన విషయాలను జర్నలిస్టు సరిగ్గా అవగాహన చేసుకోకుండా కథనాలు రాశారని గుర్తు చేశారు. ఈనెల 16 నుంచి రాష్ట్రంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, విక్రమార్క మధ్య అవగాహనతోనే ఈ యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు.

పేపర్‌లీక్‌లో బీఆర్ఎస్ నాయకులు పాత్ర : చామల కిరణ్‌కుమార్ రెడ్డి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌లో బీఆర్ఎస్ నాయకుల పాత్ర ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

లిక్కర్ స్కామ్‌లో అమిత్‌షాను విచారించాలి : టీపీసీసీ

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో పెద్ద చేప అమిత్‌షాను విచారించాలని టీపీసీసీ నేత అద్దంకి దయాకర్, బెల్లయ్యనాయక్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ అమ్మకాలను అమిత్‌షా కుమారుడు పర్యవేక్షిస్తున్నారని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్, ఆప్, వైసీపీ త్రయం లిక్కర్ స్కామ్ కథను నడిపాయని ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి పాత్ర కూడా ఇందులో ఉందన్నారు. ఎక్సైజ్ పాలసీని ఆమోదించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఈ కేసులో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. అసలు దోషులను పక్కన పెట్టి కొంతమంది మామూలు వ్యక్తులను అరెస్టులు చేసి విచారిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, ఆప్ కలిసి కర్నాటకలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

ధైర్యంగా పరీక్షలు రాయాలి : విద్యార్థులకు మంత్రి నిరంజన్‌రెడ్డి సూచన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పరీక్షలంటే భయపడవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ధైర్యంగా వాటిని రాయాలని ఒక ప్రకటనలో ఆయన సూచించారు. ప్రశ్నాపత్రం చూడగానే భయపడకూడదనీ, సహచర విద్యార్థులతో పోల్చుకోవద్దని తెలిపారు. అల్పాహారం తీసుకున్న తర్వాతనే చదవాలనీ, పాఠాలను బట్టీ పట్టడం కాకుండా కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలని సూచించారు. చదువుకునేటప్పుడు సెల్‌ఫోన్లు, టీవీలు స్విచ్ ఆఫ్ చేయాలని పేర్కొన్నారు. పరీక్షకు కావాల్సిన పెన్నులు, ప్యాడ్, పెన్సిల్, రబ్బర్ ముందురోజు సిద్ధం చేసుకోవాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా అందరూ ఉదయం పూటనే టిఫిన్ తిని, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, డిజిటల్ వాచీలను తీసుకెళ్లకూడదనీ, ఓఎంఆర్ షీట్‌ను, ప్రశ్నాపత్రాలను ముందుగానే సరిచూసుకున్న తర్వాత హాల్ టికెట్ నంబరు రాసి ఆ తర్వాత పరీక్ష రాయడం మొదలు పెట్టాలని పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మంత్రి విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్' చెప్పారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India — కాప్రా సైనిక్‌పురి బ్రాంచ్, నార్త్ కమలానగర్, ఇసిఐఎల్ క్రాస్ రోడ్డు, హైదరాబాద్-500068.

డిమాండు నోటీసు

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్,2002లోని సెక్షన్13(2) ఆఫ్ యాక్ట్54 ప్రకారం ప్రకటన రుణగ్రహీత& తనఖాపెట్టినవారు: 1)రుణగ్రహీత(లు): మెసర్స్ శ్రీస్ డిజైన్ ఇంజనీర్స్& ఆర్కిటెక్ట్స్, యజమాని:కె.కిషోర్ కుమార్,తండ్రి:కె.ఆగయ్య,1.ప్లాట్ నెం.1/ఎ,ఎస్‌వి నగర్,రోడ్ నెం.6,నాగారం,కీసర మండలం,నాగారం-500083. 2) హామీదారుడు/తనఖాపెట్టినవారు:గుమ్మడి ప్రగతి, తండ్రి:జి.వెంకటేశ్వర్లు,ప్లాట్ నెం.1/ఎ,ఎస్‌వి నగర్,రోడ్ నెం.6, నాగారం, కీసర మండలం, నాగారం -500083. డిమాండ్ నోటీసు తేది:08-02-2023

విషయం: గతంలో ఆంధ్రాబ్యాంక్, ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి దిగువ రుణ సదుపాయాలను మీరు పొందియున్నారని దయచేసి గమనించి నోటీసు తీసుకోగలరు.

క్ర. సం.	పరిమితి స్వభావం/ అకౌంట్ నెం.	లిమిట్స్	కాలవ్యవధి	08-02-2023 నాటికి బకాయి మొత్తం
1.	SODGN/ 032731100000575	Rs:35.00 Lakhs	2014-23	Rs:3549574.97

తనఖాపెట్టిన ఆస్తికి సంబంధించిన వివరాలు: ఆస్తికి సంబంధించి ప్లాట్ నెం.1/ఎ(పార్ట్)లోని నివాసం, సర్వే నెం.302 మరియు 303పార్ట్, విస్తీర్ణం 215చ.గ.,నాగారం గ్రామం,కీసర మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, సదరు ఆస్తి గుమ్మడి ప్రగతి పేరిట ఉన్నది, దీని యొక్క హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.1/ఎ పార్ట్, దక్షిణం: ప్లాట్ నెం.4, పడమర: ప్లాట్ నెం.2ఎ, ఉత్తరం: 25'వెడల్పు రోడ్డు.

మీరు అసలు రుణం/ సదుపాయం మరియు/ లేదా వాయిదాలలో/ వడ్డీ లేదా రెండింటిని చెల్లించుటలో డిఫాల్ట్ గావింపబడినారు మరియు/ లేదా ఆర్‌బిఐ నియమాలకు మించిన కాలవ్యవధి కొరకు ఖాతా బెల్ ఆఫ్ ఆర్డర్ అయినందున, మీ ఖాతా 07-02-2023 తేదీన ఎన్‌పిఎగా వర్గీకరించబడినది మరియు మీరు ఒప్పందం(ల) ప్రకారం తదుపరి వడ్డీతో 08-02-2023 తేదీ నాటికి బకాయి ఉన్న రూ.3549574.97 (రూపాయలు ముప్పై ఐదు లక్షల నలభై తొమ్మిది వేల ఐదు వందల డెబ్బై నాలుగు మరియు తొంభై ఏడు పైసలు మాత్రమే) మొత్తాన్ని మీరందరు ఉమ్మడిగా లేదా విడివిడిగా తదుపరి వడ్డీతో పాటుగా చెల్లించి ఒప్పందానికి అనుగుణంగా చెల్లించవలసి ఉంటుంది.

... అవసరమైన ఇతర ఏదేని చర్యను మీ పై తీసుకోబడుతుంది, వాటి అన్ని ఖర్చులు మరియు పరిణామాలకు బాధ్యత వహిస్తూ మీరందరిపై ఉమ్మడిగా మరియు విడివిడిగా అన్ని విధాలా చర్యలు తీసుకోబడుతాయి.

సెక్యూర్డ్ ఆస్తుల యొక్క లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ కొరకు పబ్లిక్ లేదా ప్రైవేట్ ట్రీటీ నుండి బహిరంగ వేలం లేదా కొటేషన్లు లేదా టెండర్లు ఆహ్వానించుట కొరకు నోటీసు ప్రచురణ తేదికి ముందు ఏదేని సమయానికి బ్యాంకుచే వెచ్చించిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతోసహా బ్యాంకు యొక్క బకాయిలను చెల్లించుట ద్వారా చట్టం యొక్క సెక్షన్ 13(8) యొక్క నియమాల క్రింద మీకు విమోచన హక్కు అందుబాటులో ఉంటుందని దయచేసి గమనించగలరు. ఈనోటీసు ఏదేని ఇతర చట్టం క్రింద బ్యాంకుకు అందుబాటులోగల హక్కులకు దురభిప్రాయం లేకుండా జారీచేయబడినది.

ప్రదేశం: హైదరాబాద్ — చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ Union Bank of India — సంజీవ రెడ్డి నగర్ బ్రాంచి, 246/3వ మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్-8(1))

ఏదైతే, క్రింది సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సంజీవ రెడ్డి నగర్ బ్రాంచ్ (గతంలో ఆంధ్రా బ్యాంక్), హైదరాబాద్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది 27.12.2022 నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/హామీదారులను

రుణగ్రహీత/ హామీదారు	పేరు	చిరునామా
రుణగ్రహీత	శ్రీ తాప్పెట్ల శ్రీనివాసులు	ఫ్లాట్ నం.103, 1వ అంతస్తు, ప్లాట్ నం.81, 82, శ్రీబాలాజీ రెసిడెన్సీ, నిజాంపేట్, ఖుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ, ఇండియా-500090.
రుణగ్రహీత	శ్రీమతి టి. లీలా	ఫ్లాట్ నం.103, 1వ అంతస్తు, ప్లాట్ నం.81, 82, శ్రీబాలాజీ రెసిడెన్సీ, నిజాంపేట్, ఖుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ, ఇండియా-500090.

అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా 21.12.2022 నుండి కాంట్రాక్చువల్ రేటున వడ్డీతోపాటు నోటీసుల్లో పేర్కొనిన మొత్తాలు రూ.14,96,670.85 (రూపాయలు పద్నాలుగు లక్షల తొంభై ఆరు వేల ఆరు వందల డెబ్బై మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మొత్తంను తిరిగి చెల్లించుటలో విఫలంచెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని 10 మార్చి 2023న స్వాధీనంచేసుకున్నారు.

ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, యూనియన్ బ్యాంక్ ఇండియా, సంజీవ రెడ్డి నగర్ బ్రాంచ్‌కురూ.14,96,670.85 (రూపాయలు పద్నాలుగు లక్షల తొంభై ఆరు వేల ఆరు వందల డెబ్బై మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)లను మరియు 21.12.2022 నుండి దానిపై కాంట్రాక్చువల్ వడ్డీతో చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డు అసెట్స్ విడిపించుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తి వివరణ

సెక్యూరిటీస్ స్వభావం: కొల్లేటరల్

రంగారెడ్డి జిల్లా, ఖుత్బుల్లాపూర్ మండలం, నిజాంపేట్ గ్రామం వద్ద గల శ్రీ బాలాజీ రెసిడెన్సీ యొక్క సర్వే నం.లు 313, 314, 315 లో ప్లాట్ నం.81 & 2 పై 699.99చ.గ.లకుగాను 30చ.గ.ల విస్తీర్ణంతో విడదీయలేని స్థలభాగంతోపాటు, 80చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా మరియు (ఉమ్మడి ఏరియాతో కలిపి) 1275చ.అ. నిర్మాణ ఏరియాతో 1వ అంతస్తు, లో నివాసిత ఫ్లాట్ 103 యొక్క ఈఎం. సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: కారిడార్, పడమర: కారిడార్.

తేది: 10.03.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యూనియన్ బ్యాంక్ Union Bank of India — తుర్కపల్లి బ్రాంచ్ (24831), ఇంటి నెం.2-10-27, శివం బావి బిసిసి బస్తీ, మచ్చబొల్లారం, హైదరాబాద్-500010.

బంగారు ఆభరణాల బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన బంగారు ఆభరణాల గోల్డ్ లోన్ అకౌంట్‌కు సంబంధించి యూనియన్ బ్యాంక్, తుర్కపల్లి బ్రాంచ్ వారు బంగారు ఆభరణాలను బహిరంగ వేలం నిర్వహించి విక్రయించనున్నారు. బ్యాంక్ ఆవరణలో 31-03-2023 తేదీన మధ్యాహ్నం గం.3-00కు వేలం నిర్వహించబడును.

గోల్డ్ లోన్ అకౌంట్ నెంబర్	రుణగ్రహీత పేరు & చిరునామా	స్థూల బరువు
248330100008939	బింగి కుమారి, 2-16/5, హరిజన్ బస్తీ, మచ్చ బొల్లారం, సికింద్రాబాద్-10	25.00 గ్రాములు

బహిరంగ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి కల్గివున్నవారంతా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తుర్కపల్లి బ్రాంచ్ పేరిట రూ.10,000/- డీడీ/నగదు రూపంలో చెల్లించి (తిరిగి ఇవ్వబడదు) అందజేయాలి. ఎలాంటి కారణం చూపకుండానే బ్రాంచ్ మేనేజర్ వేలాన్ని అంగీకరించవచ్చును/తిరస్కరించవచ్చును/ వాయిదా వేయవచ్చును/ రద్దు చేయవచ్చును.

సం/- బ్రాంచ్ మేనేజర్

IDBI BANK ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ — రాజేంద్రనగర్ శాఖ, మాధవ రత్న టవర్స్, ఇ.నం.4-6-68/1, పిల్లర్ నం.139 దగ్గర, అత్తాపూర్ రింగ్ రోడ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500048, తెలంగాణ రాష్ట్రం. ఫోన్: 040-24011034 / 36.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు గడువు తీరినను తిరిగి చెల్లించలేదు. సదరు వ్యక్తికి ఇదివరకే నోటీసులు పంపినాము. కానీ వారు ఋణాలు చెల్లించనందున వారి బకాయిలను రాబట్టుకొనుటకు బ్యాంక్ నిబంధనలను అనుసరించి తేది: 21-03-2023 మంగళవారం మధ్యాహ్నం 3.00 గం॥లకు బ్యాంక్ ఆవరణములో బహిరంగంగా వేలము వేయబడును.

షరతులు: 1) నోటీసులు చేరనివారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2) ఈ ప్రకటన ఖర్చు అప్పుదారే భరించవలెను. 3) వేలములో పాల్గొనువారు బ్యాంకు నిబంధనల ప్రకారం ఆధార్/ఓటరు/పాన్ కార్డులతో పాటు వచ్చి వేలము తేది మ॥ 3.00 గంటలలోపు పేర్లను నమోదు చేసుకొని ధరావతు సొమ్ము రూ.10,000/- చెల్లించవలెను. 4) వేలము పొందినవారు మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి నగలు స్వాధీనం చేసుకోవలెను. లేనిచో ధరావతు సొమ్ము కోల్పోవుదురు. 5) ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు పూర్తిగా/ పాక్షికంగా రద్దుచేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు.

వ. సం.	ఖాతా సం. ఋణగ్రహీత పేరు & చిరునామా	తాకట్టు పెట్టిన బంగారు ఆభరణముల వివరములు	స్థూల బరువు గ్రాములలో	రిజర్వు ధర
1	ఖాతా సం.1048671100023922 రామావతు బాలు నాయక్, తండ్రి (లేటు) రామావతు పెద్ద బుజ్జ నాయక్, 3-1-166/1, 2వ అంతస్తు, గాంధీ విగ్రహం దగ్గర, హైదర్‌గూడ, రాజేంద్రనగర్, కె.వి.రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్రం-500048.	1 ఓపెన్ చెయిన్	23.600	రూ. 1,54,000/-
		2 టాప్స్ మరియు 2 రింగ్స్	10.000	

ప్రదేశం: హైదరాబాద్, తేది: 15-03-2023 — సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్

యూనియన్ బ్యాంక్ Union Bank of India — సంజీవ రెడ్డి నగర్ బ్రాంచి, 246/3వ మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్-8(1))

ఏదైతే, క్రింది సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సంజీవ రెడ్డి నగర్ బ్రాంచ్ (గతంలో ఆంధ్రా బ్యాంక్), హైదరాబాద్ యొక్క అధీకృత అధికారిగా, ... తేది 27.12.2022 నాటి డిమాండ్ నోటీసు జారీచేసి ... రూ.11,29,940.39 ... [illegible]

తేది: 10.03.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యూనియన్ బ్యాంక్ Union Bank of India — సంజీవ రెడ్డి నగర్ బ్రాంచి, 246/3వ మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్-8(1))

... రూ.10,41,140.80 ... [illegible]

స్థిరాస్తి వివరణ

సెక్యూరిటీస్ స్వభావం: కొల్లేటరల్

రంగారెడ్డి జిల్లా, ఖుత్బుల్లాపూర్ మండలం, ప్రగతి నగర్ గ్రామపంచాయతీ, బాచుపల్లి గ్రామం వద్ద గల సర్వే నం.లు167/పార్ట్, 168, 169/పార్ట్, 177 & 178/పార్ట్ లో బ్లాక్ నం.48, ప్లాట్ నం.353 & 339 పై ప్రగతిస్ ద్వారకామయి, 3వ అంతస్తు, నివాసిత ఫ్లాట్ నం.303 యొక్క ఈఎం. సరిహద్దులు: ఉత్తరం: మెట్లు, లిఫ్ట్ మరియు కారిడార్, దక్షిణం: ఫ్లాట్ నం.304, తూర్పు: కారిడార్ & ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై.

తేది: 10.03.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ SHRIRAM Finance

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, దక్షిణ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600 032. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: 6వ అంతస్తు(లెవెల్2), బిల్డింగ్ నెం.క్యూ2. అరం క్యూ పార్క్, జెన్ 4/1, టిటిసి, థానే బేలాపూర్ రోడ్డు, ఘన్సోలి, నవి ముంబయి-400710.

డిమాండ్ నోటీసు

ఏదైతే, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/హామీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇంతకుముందు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ వారు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో అమాల్గమేట్ అయ్యారు. దీని తదనంతరం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ లిమిటెడ్‌ను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చడం జరిగింది. రుణ సదుపాయాన్ని పొందినప్పటికీ రుణగ్రహీతలు/హామీదారులు బకాయి ఉన్న తేదీల నాటికి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. బకాయిలను సకాలానికి చెల్లించని కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క నిర్దేశాలు/మార్గదర్శకాల ప్రకారం వారి యొక్క అకౌంట్‌ను నాన్ పెర్ఫామింగ్ అస్సెట్‌గా వర్గీకరించడం జరిగింది. దీనికి అనుగుణంగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం మరియు సెక్షన్ 13(2)తో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్3కు ... [illegible]

తేది: 14-03-2023, ప్రదేశం: బోరబండ — సం/- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ SHRIRAM Finance

డిమాండ్ నోటీసు

[illegible]

తేది: 14-03-2023 — ప్రదేశం: కొంపల్లి

యూనియన్ బ్యాంక్ Union Bank of India — సంజీవ రెడ్డి నగర్ బ్రాంచి, 246/3వ మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్-8(1))

... రూ.28,56,640.48 ... 10 మార్చి 2023న స్వాధీనంచేసుకున్నారు. ... [illegible]

స్థిరాస్తి వివరణ

సెక్యూరిటీస్ స్వభావం: కొల్లేటరల్

రంగారెడ్డి జిల్లా, ఉప్పల్ మండలం, జి.హెచ్.ఎం.సి, ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధి, మోహన్ నగర్, నాగోల్, బ్లాక్ నం.1 వద్దగల 171.85 చ.గ.లు లేదా 143.66చ.మీ.లకు సమానమైన విస్తీర్ణంతో సర్వే నం. 128 పార్ట్ మరియు 129/2 లో ప్లాట్ పై నివాసిత ఇంటి యొక్క ఈఎం. సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి ఆస్తి, దక్షిణం: ప్లాట్ నం.5, తూర్పు: రిందా రెసిడెన్సీ అపార్టుమెంట్, పడమర: 30' వెడల్పు రోడ్డు.

తేది: 10.03.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

GOLDEN TOWER INFRATECH PRIVATE LIMITED

CIN: U45200TG2007PTC055909

Registered Office: NSL Icon, 4th Floor, Door No. 8-2-648/2/A, Road No. 12, Banjara Hills, Hyderabad, Telangana - 500034, India. Contact No: 040 – 40514444; Email Id: cs.nslgroup@nslgroup.in

31, డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికానికి ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాల సారాంశం (రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం (ఆడిట్ చేయనివి)			ముగిసిన తొమ్మిది నెలలు (ఆడిట్ చేయనివి)		ముగిసిన సంవత్సరానికి (ఆడిట్‌చేసినవి)
	డిసెంబర్ 31, 2022	సెప్టెంబర్ 30, 2022	డిసెంబర్ 31, 2021	డిసెంబర్ 31, 2022	డిసెంబర్ 31, 2021	మార్చి 31st, 2022
ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	808.61	856.67	702.16	2,492.04	2,452.72	3,142.58
మినహాయింపుగల ఐటంలు మరియు పన్నుకు ముందు నికర లాభం/ (నష్టం)	(1,719.23)	(1,607.08)	(2,097.71)	(4,906.33)	(4,808.57)	(6,499.83)
మినహాయింపుగల ఐటంల తరువాత మరియు పన్నుకు ముందు నికర లాభం/(నష్టం)	(4,317.87)	(1,641.61)	(1,615.17)	(7,476.38)	(3,844.77)	(5,205.89)
కాలపరిమితి కోసం సమగ్ర ఆదాయం (కంప్రైజింగ్ లాభం/నష్టం) మరియు పన్ను తర్వాత సమగ్ర ఆదాయం	(4,317.87)	(1,641.61)	(1,615.17)	(7,476.38)	(3,844.77)	(5,202.32)
చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం	10.00	10.00	10.00	10.00	10.00	10.00
ఆడిట్‌చేయని బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి)	769.19	(17,028.90)	(12,512.84)	769.19	(12,512.84)	(13,870.39)
వాటా ఒక్కింటికి రాబడులు/(నష్టం) (బేసిక్ & డైల్యూటెడ్) (వాస్తవంగా రూ.లలో) (ముఖ విలువ రూ.10/- వాటాకు)	(4,317.87)	(1,641.61)	(1,615.17)	(7,476.38)	(3,844.77)	(5,205.89)

ముఖ్యాంశాలు:

1. పై పేర్కొన్న ఫలితాలు 14, మార్చి,2023 తేదీన నిర్వహించిన వారి సమావేశంలోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
2. భారతదేశంలో సాధారణంగా ఆమోదించిన ఇతర అకౌంటింగ్ ప్రిన్సిపుల్స్ మరియు అందులో జారీచేసిన సంబంధిత రూల్స్‌తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద నిర్దేశించిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ ("ఐఎన్‌డి ఏఎస్")ను అనుసరించి ఈ ఆర్థిక ఫలితాలు సిద్ధం చేయబడినవి.
3. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 52 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీలతో దాఖలుచేసిన ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్: (www.bseindia.com)లో అందుబాటులో ఉంటాయి.

బోర్డు వారి ఆదేశాల మేరకు
For Golden Tower Infratech Private Limited
సం/-
ఎ.వి.వి. శివ ప్రసాద్
డైరెక్టర్
DIN: 00227591

ప్రదేశం : హైదరాబాద్
తేది: 14-03-2023

---

homefirst We'll take you home

హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

CIN:L65990MH2010PLC240703, Website: homefirstindia.com

Phone No.: 180030008425 Email ID: loanfirst@homefirstindia.com

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి)

స్థిరాసుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలకు ప్రకటన ఇవ్వడమేమనగా, కాలం (2) ప్రకారం దిగువ వివరించిన స్థిరాస్తులు కాలం (3) ప్రకారం తాకట్టుపెట్టబడినవి అందు దిగువ వివరించినట్లుగా బకాయి మొత్తాలను ఫ్లస్ వడ్డీతో రియలైజ్‌చేయుట కొరకు హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచేత స్వాధీనంచేసుకోబడినవి. బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలంచెందినందున, క్రింది సంతకందారు బకాయిలను రాబట్టుట కొరకు ఇందు దిగువ వివరించిన సదరు ఆస్తి/లను "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలాగే ఉంటుంది" అనే ప్రాతిపదికన సదరు చట్టం క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, విక్రయించబడుతాయి. రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు నుండి హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా తలిమిగిడ్‌కుగల బకాయి మొత్తాలను రియలైజ్‌చేయుట కొరకు "ఆన్ లైన్" నిర్వహించుటద్వారా విక్రయించబడుతాయి.

క్ర. సం	రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతల పేరు	ఆస్తి చిరునామా	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు మొత్తాలు	స్వాధీనతా తేది	మార్కెట్ విలువ	ధరావత్తు మొత్తాలు	వేలం తేది& సమయం	ధరావత్తు మరియు పత్రం దాఖలుచేయుటకు చివరి తేది& సమయం	అధీకృత అధికారి నంబరు
1.	బోశెట్టి అంజన్ కుమార్, బోశెట్టి సంగీత్	ప్లాట్ నం.23, ప్లాట్ నం23 యొక్క పడమర భాగం (ఉత్తరం భాగం), సర్వే నం.253, వార్డు నం.4, బ్లాక్ నం.11, అన్మోల్‌గల్, హయత్‌నగర్ గ్రామం, రెవెన్యూ మండలం, జిహెచ్‌ఎంసి హయత్‌నగర్ సర్కిల్-3 పరిధిలో, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్,తెలంగాణ. 500070.	05-01-2023	14,52,918	13-03-2023	31,10,000	3,11,000	15-04-2023 (11 am-2 pm)	13-04-2023 (upto 5 pm)	7043288889

నియమాలు & నిబంధనలు:

ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్	ఇ-వేలం వెబ్‌సైట్/ వివరాల కొరకు, ఇతర నియమాలు& నిబంధనలు	ధరావత్తు/ఇతర మొత్తాల డిపాజిటింగ్ కొరకు: ఖాతా నం.	బ్రాంచి ఐఎఫ్‌ఎస్‌సి కోడ్	బెనిఫిషరీ పేరు
కంపెనీ పేరు: ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ – యాక్షన్ టైగర్, Help Line No : 079-35022160/149/182 Contact Person:Ram Sharma-8000023297 E-mail id:ramprasad@auctiontiger.net and Support@auctiontiger.net	http://www.homefirstindia.com https://homefirst.auctiontiger.net	912020036268117- హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్- యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, ఎంఐడిసి, అంధేరి ఈస్ట్.	UTIB0000395	అధీకృత అధికారి, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్.

బిడ్ పెంపుదల మొత్తం- రూ.10,000/-. క్రింది సంతకందారుచేత వెబ్ పోర్టల్ (https://momefirst.auctiontiger.net) వద్ద ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా అమ్మకం జరుపబడుతుంది. ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, ఆన్‌లైన్ అమ్మకం యొక్క సాధారణ ... [illegible]

తేది: 15.03.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

సంపాదకీయం

గురివింద సూక్తి ముక్తావళి!

ఎదుటివారి నలుపు గురించి గురివిందలు మాట్లాడటం ఆశ్చర్యమే! అదీ తల్లి గొబ్బెమ్మలాంటి పెద్ద గురివింద నీతులు చెప్పడం ఒకింత అసహ్యం కూడా కలుగుతోంది. తన 'శుద్ధపూసత్వా'న్ని వెలుగులోకి తేవడానికి, నిలువునా నిలబెట్టడానికి ఇతర పార్టీలన్నింటినీ అవినీతిపరమైనవన్న వాఖ్యానం, చేస్తున్న ఆర్భాటం 'భక్తుల' కెలావున్నా మిగిలిన దేశ ప్రజలకు జుగుప్స కలిగిస్తున్నాయి.

> మోడీ పాలన మొదట్లోనే లలిత్ మోడీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యాలు కొన్ని నమూనా దిష్టిబొమ్మలే! ఆ సామ్రాజ్య గృహప్రవేశం చేస్తే లోపలి గదుల్లోని బీరువాల నుండి దొర్లి పడుతున్న అస్తిపంజరాలు ఎన్నో! బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి గబ్బు లేస్తున్నాయి. మధ్యప్రదేశ్ వ్యాపమ్ స్కాం స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ కనీవినీ ఎరగం. గుజరాత్, యూపీల్లో ఆక్సిజెన్ సిలెండర్ల స్కాం జనం ప్రాణాలే తీసింది కదా! ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచింది కాబట్టి 'బారా ఖూన్ మాఫ్' అందామా? కర్నాటకే అవినీతి పుట్ట అని ఆ రాష్ట్రం కోడై కూస్తోంది కదా!

అన్ని పత్రికల్లో, లేదా చాలా పత్రికల్లో బీజేపీ అస్మదీయులు దిగబడి ఉన్నారు. మోడీ మీద వాలే 'ఈగల్ని' తోలడం వారి తక్షణ కర్తవ్యం. ఇది మరీ 'నాటు'గా ఉంటే, మోడీపై ఈగలు వాలకుండా చూడటం వారి వృత్తి ధర్మం! ఢిల్లీ వీధుల్లో పోయే తెలుగువారి పరువు గురించీ, అది మోరీల్లో కలుస్తున్న తీరు గురించీ ఒక 'సత్య'వంతుడు తెగ బాధపడ్డాడు. బీఆర్ఎస్ నేతలు ఈడీ, సిబిఐల దెబ్బకి భయపడి కోట్ల రూకలు ప్రచారంపై ఖర్చు చేశారని 'బాధ'పడ్డాడు. అవినీతి సామ్రాట్టుల భరతం పట్టేందుకే ఈడీ, సిబిఐలున్నాయట! "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు!" అంటే ఇదే కదా! మీపై కాలుదువ్వినవారిని ఒకరకంగాను, మీకు లొంగిపోయిన వారిపై మరొక రకంగా పైరెండు సంస్థల్నీ వినియోగించడం దేశం గమనిస్తూనే ఉంది కమలనాథులారా!



2జి స్పెక్ట్రమ్ కుంభకోణమో, 'కోల్‌గేట్' కుంభకోణం గురించో మోడీ పదే పదే చెపుతూ ఉంటారు. ఇలాంటి కుంభకోణాలు వ్యక్తులకో, పార్టీలకో సంబంధించినవి కావు. ఇవి విధానాలకు సంబంధించినవి. 2జి స్పెక్ట్రమ్ జరిగింది రాజా కోసమో, కనిమోళి కోసమో కాదు, అసలు ప్రయోజనం కలిగింది టాటాలకు, అంబానీలకు. బొగ్గు కుంభ కోణంలో ప్రధాన బెనిఫీషియరీలు జిందాల్ పైప్స్, టాటా స్టీల్స్ వంటివారు. ఉత్పత్తి చేసి, సరుకులు అమ్ముకుని లాభపడ్డ పెట్టుబడిదార్లు కాదు వీరు. ఆశ్రిత పెట్టుబడిదార్లు. వీరి దారేవేరు. పాలకులకు అంటకాగడం. భూలోకంలోనే కాదు, పాతాళంలో ఉండే బొగ్గు, ఆకాశంలో ఉండే స్పెక్ట్రమ్ వరకు అన్నింటినీ చేజిక్కించు కోవడం వీరి ఆనవాయితీ. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అదానీ, అంబానీ, టాటాల వంటి వారిని పోషించిన తీరు ప్రొఫెసర్ రామ్‌కుమార్ ఒక మాసపత్రికలో అద్భుతంగా వివరించారు.

కేసీఆర్ చంద్రబాబుని తిట్టి, బీజేపీ కేసీఆర్‌ని శాపనార్థాలు పెట్టి, కొందరే అవినీతిపరులైనట్టు ప్రచారం చేసుకోవడం నిత్యకృత్యం. ఆ వ్యక్తులు పోతే అవినీతి పోతుందన్నట్లు ప్రచారం జరుగుతోంది. పివి కాలంలో నయా ఉదారవాద విధానాలు ప్రారంభ మైనాయి. యూరియా కుంభ కోణం, హర్షద్ మెహతా కుంభకోణం, కేతన్ పరేఖ్ కుంభకోణంతో ప్రారంభమైన పరంపర యెస్ బ్యాంకు కుంభకోణం, డీహెచ్ఎఫ్ఎల్. కుంభకోణం, చందాకొచార్ నడిపిన కుంభకోణం వంటివి మోడీ కాలంలో కూడా నడుస్తూనే ఉన్నాయి కదా! ఇవేమైనా ఆగినాయా? మోడీవైపు వేలెత్తి చూపడానికి నియంత్రించబడ్డ మీడియా వెనకా ముందూ ఆడుతోంది గాని లేకుంటే అదానీ కుంభకోణం సామాన్యమైందా? కొన్ని పశ్చిమ దేశాల్లో అయితే ఈపాటికి ప్రభుత్వం రాజీనామా చేసి పోయేది. నోట్ల రద్దు ఒక భారీ కుంభకోణం, సహకార బ్యాంకుల కుంభకోణం అమిత్‌షా కోసమే నడిచింది.

మోడీకి కుటుంబం లేకపోయుండచ్చు. ఆయనకు రహస్య బ్యాంకు అకౌంట్లు కూడా లేవేమో! ఆయన ఇప్పటిదాకా ఏ అవినీతి కేసుల్లో ఇరుక్కోలేదు కావచ్చు. "నీ మిత్రుల గురించి చెప్పు, నేను నీ గురించి చెప్తాన"నే నానుడి మనకు తెల్సిందే. మోడీ పాలన మొదట్లోనే లలిత్ మోడీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యాలు కొన్ని నమూనా దిష్టిబొమ్మలే! ఆ సామ్రాజ్య గృహప్రవేశం చేస్తే లోపలి గదుల్లోని బీరువాల నుండి దొర్లి పడుతున్న అస్తిపంజరాలు ఎన్నో! బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి గబ్బు లేస్తున్నాయి. మధ్యప్రదేశ్ వ్యాపమ్ స్కాం స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ కనీవినీ ఎరగం. గుజరాత్, యూపీల్లో ఆక్సిజెన్ సిలెండర్ల స్కాం జనం ప్రాణాలే తీసింది కదా! ఆ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచింది కాబట్టి 'బారా ఖూన్ మాఫ్' అందామా? కర్నాటకే అవినీతి పుట్ట అని ఆ రాష్ట్రం కోడై కూస్తోంది కదా!

అవినీతి శిక్షించబడాల్సిందే. ప్రస్తుత వ్యవస్థలో అవినీతి రాచపుండు. వ్యవస్థని సమూలంగా పెకలించి వేయకుండా దాన్ని గోశాయి చిట్కాలతో మాన్పలేము.

ఇరాన్ - సౌదీ ఒప్పందం: అమెరికా కుట్రలకు ఎదురుదెబ్బ!

మధ్య ప్రాచ్యంలో ఉప్పు నిప్పు మాదిరి ఉన్న ఇరాన్-సౌదీ అరేబియా మార్చి నెల పదవ తేదీన కుదుర్చుకున్న ఒప్పందం కొన్ని దేశాలను కంపింప చేస్తే, అనేక మందికి నిజమా అన్న ఆశ్చర్యానికి గురి చేసిందనే వర్ణనలు వెలువడ్డాయి. ఈజిప్టులోని సూయజ్ కాలువ 1956 వివాదం తరువాత బ్రిటిష్ ప్రపంచ ఆధిపత్యానికి తెరపడినట్లే ఈ ఒప్పందం అమెరికా పెత్తనానికి తెరదించేందుకు నాంది అన్నట్లుగా కొందరు వర్ణించారు. దీని కంటే ఆ ఒప్పందం చైనా రాజధాని బీజింగ్‌లో కుదరటం అనేక మందికి మింగుడు పడటం లేదు. ఇరాన్-సౌదీ ప్రత్యక్ష పోరుకు తలపడనప్పటికీ అనేక చోట్ల ఏదో ఒక పక్షానికి మద్దతు ఇస్తూ గడచిన నాలుగు దశాబ్దాలుగా పరోక్షంగా శత్రుదేశాలుగా మారాయి. గత ఏడు సంవత్సరాలుగా దౌత్య సంబంధాలు కూడా లేవు. బీజింగ్ మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందం మేరకు రెండు నెలల్లోగా రాయబార కార్యాలయాలను తెరవాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో దేశాలు ఏదో ఒక పక్షాన చేరటం లేదా తటస్థంగా ఉండటాన్ని ముఖ్యంగా ఉక్రెయిన్ సంక్షోభం స్పష్టం చేసింది. అమెరికా, పశ్చిమ దేశాలకు తాన తందాన అనేందుకు పేద, వర్ధమాన దేశాలు సిద్ధంగా లేవు అనే సందేశాన్ని కూడా ఇచ్చాయి. ఇప్పుడు ఇరాన్-సౌదీ ఒప్పందం ఈ కూటమికి మింగుడుపడక పోయినా అమెరికా హర్షం ప్రకటించాల్సి వచ్చింది. సోమవారం నాటి వరకు మన దేశం దీని గురించి ఎలాంటి స్పందన వెల్లడించలేదు.

> ఇరాన్‌లో అత్యధికులు షియా తెగ ముస్లింలు కాగా సౌదీలో సున్నీలు ఉన్నారు. ఇరాక్, బహరెయిన్‌లో, చివరికి సౌదీలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఉన్న సున్నీ-షియా వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందంతో అవి క్రమంగా తగ్గుతాయి తప్ప పెరగవు అన్నది అందరూ చెబుతున్నారు. ఇంతకాలం సౌదీ-ఇరాన్ వివాదాలతో లాభపడిన అమెరికాకు ఈ పరిణామం సుతరామూ అంగీకారం కాదు. దానికి నిరంతరం ఉద్రిక్తతలు, ఘర్షణలు ఉండాల్సిందే. ప్రపంచంలో అస్థిరతకు అమెరికా చూస్తుంటే సుస్థిరతకు చైనా చేయూత నందిస్తోంది. అమెరికా ఎక్కడ కాలుపెట్టినా తన ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకొనే ఉద్రిక్తతల సృష్టి తప్ప అభివృద్ధికి చేసిందేమీ లేదు.

రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినటానికి దారితీసిన కారణాలేమిటి? షియా మతపెద్ద నిమిర్ అల్ నిమిర్‌తో సహా 50మందిని సౌదీ అరేబియా 2016 జనవరి రెండున ఉరితీసింది. దీనికి నిరసనగా టెహరాన్‌లోని సౌదీ రాయబార కార్యాలయం మీద ఇరానియన్లు దాడి చేశారు. ఇరాన్ అధిపతి అయాతుల్లా అలీ ఖమేనీ కక్ష తీర్చుకోవాలని పిలుపునిచ్చాడు. జనవరి మూడవ తేదీన సంబంధాలను తెగతెంపులు చేసుకుంటున్నట్లు సౌదీ ప్రకటించింది. ఎమెన్‌లోని తమ రాయబార కార్యాలయం మీద సౌదీ వైమానిక దాడులు చేసినట్లు ఏడవ తేదీన ఇరాన్ ఆరోపించింది. వాస్తవం కాదని సౌదీ ఖండించింది. వార్షిక హాజ్ యాత్రకు వెళితే రక్షణకు హామీ లేదని, సౌదీ కుట్రకు పాల్పడవచ్చంటూ తన యాత్రీకుల మీద ఇరాన్ మేనెల 29న నిషేధం విధించింది. తమ చమురు కేంద్రాలపై జరిగిన దాడికి ఇరాన్ కారకురాలని, దాని వలన తమ దేశంలో సగం సరఫరా నిలిచిందని సౌదీ చేసిన ఆరోపణను ఇరాన్ ఖండించింది. ఎమెన్‌లో ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ గ్రూపు తామే దాడి చేసినట్లు ప్రకటించింది. ఇరాన్ మిలిటరీ అధికారి ఖాశిం సొలిమనీ బాగ్దాద్‌లో 2020జనవరి మూడున అమెరికా డ్రోన్‌దాడిలో మరణించారు. అతను ఇరాన్-సౌదీ మధ్య సంబంధాల పునరుద్దరణకు కృషి చేసినట్లు వార్తలు వచ్చాయి. తరువాత 2021 ఏప్రిల్ తొమ్మిదిన బాగ్దాద్‌లో సౌదీ- ఇరాన్ తొలి చర్చలు జరిగాయి. ఐదవ దఫా చర్చలు జరగనుండగా 41మంది షియా ముస్లింలను సౌదీలో ఉరితీశారు. దాంతో ఎలాంటి కారణం చూపకుండా 2022 మార్చి 13న చర్చల నుంచి వైదొలుగుతున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఏప్రిల్ 21న ఐదవ దఫా చర్చలు జరిగాయి. అక్టోబరు 19న రాయబార కార్యాల యాలను రెండు దేశాలూ తెరవాలని ఇరాన్ అధిపతి ఖమేనీ సలహాదారు ఒక ప్రకటన చేశాడు. డిసెంబరు తొమ్మిన చైనా అధినేత షీ జింపింగ్ సౌదీ సందర్శన జరిపి రాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో చర్చలు జరిపాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ బీజింగ్‌ను సందర్శించి షీ జింపింగ్‌తో చర్చలు జరిపాడు. మార్చి పదవ తేదీన ఒప్పందం కుదిరింది.



ఎం. కోటేశ్వరరావు

ఒప్పందం కుదరటమే గొప్ప ముందడుగు. సంవత్సరాల తరబడి తెరవెనుక చైనా మంత్రాంగంతో రెండు దేశాలనూ ఒక దగ్గరకు తేవటం ప్రపంచ రాజకీయాల్లో పెరుగుతున్న చైనా ప్రభావం అని చెప్పటం కంటే తరుగుతున్న అమెరికా, పశ్చిమ దేశాల పలుకుబడి అనటం సముచితంగా ఉంటుంది. ఈ ఒప్పందం ఇరాన్-సౌదీ అరేబియా, మధ్యప్రాచ్యం, చైనా విజయంగా కొందరు చూస్తున్నారు. ప్రపంచం అమెరికా చెప్పినట్లు నడిచే రోజులు గతించాయనే సందేశాన్ని కూడా ఇచ్చింది. పశ్చిమాసియాలో ఉన్న చమురు సంపదలు, భౌగోళికంగా ఉన్న ప్రాధాన్యత రీత్యా గతంలో బ్రిటన్, తరువాత అమెరికా ఆప్రాంతంపై పట్టుకోసం చూశాయి. దానిలో భాగంగా చిచ్చు రేపాయి.ఏదో ఒక పక్షం వహించి రెండోదాన్ని దెబ్బతీసి తన అదుపులో పెట్టుకోవటం, చివరకు నాటో తరహా కూటమిని ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తన పట్టులో బిగించుకోవాలన్నది అమెరికా ఎత్తుగడ. సాధారణ సంబంధాల ఏర్పాటుకు అంగీకరించినప్పటికీ ఇరాన్-సౌదీ మధ్య తలెత్తిన వివాదాలు, పరస్పర అనుమానాలు కూడా పరిష్కారం కావాల్సి ఉంది. ఈ ఒప్పందానికి హామీదారుగా ఉన్న చైనా ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో ఉన్న వివాదాల్లో ఏదో ఒక పక్షంవైపు మొగ్గుచూపిన దాఖలాల్లేని కారణంగానే రెండు దేశాలూ దాన్ని నమ్మి ముందడుగువేశాయి. ఇది మిగతా వివాదాలకూ విస్తరిస్తే అమెరికాను పట్టించుకొనే వారే ఉండరు గనుక దీన్ని ముందుకు పోకుండా చూసేందుకు చేసేందుకు అది చూస్తుందని వేరే చెప్పనవసరం లేదు. 1979లో అమెరికా మద్దతు ఉన్న ఇరాన్ షా ప్రభుత్వం పతనమైన తరువాత అమెరికా ఆ ప్రాంతంలో తలెత్తిన వివాదాల్లో ఇరాన్-సౌదీ ఘర్షణ పెరిగింది. ఇరాన్‌ను శత్రువుగా, సౌదీని మిత్రదేశంగా అమెరికా పరిగణించింది.


సయోధ్య అవసరమని రెండు దేశాలూ గుర్తించినందువల్లనే ఈ ఒప్పందానికి దారి తీసింది తప్ప చైనా ఒత్తిడేమీ దీనిలో లేదు. దీనిలో చైనా ప్రయోజనాలు లేవా అంటే దాని కంటే ఆ రెండు దేశాల, ప్రాంత ప్రయోజనాలు ఎక్కువ అన్నది స్పష్టం. ప్రస్తుతం ఉన్న కొన్ని వివాదాలను చూద్దాం. లెబనాన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధంలో హిజబుల్లా సంస్థకు ఇరాన్, ప్రత్యర్థి పక్షాలకు సౌదీ మద్దతు ఉంది. సిరియాలో దశాబ్దకాలానికి పైగా సాగుతున్న పోరులో సౌదీ మద్దతు ఉన్న జీహాదీలకు, ఇరాన్ మద్దతు ఇస్తున్న హిజబుల్లా, ఇతర మిలిటెంట్లకు వైరం ఉంది. ఎమెన్‌లో అమెరికా మద్దతుతో సౌదీ దాడులకు దిగుతున్నది. అక్కడ హౌతీ మిలిటెంట్లకు ఇరాన్ మద్దతు ఉంది. వారు కొన్ని సందర్భాలలో సౌదీ చమురు టాంకర్ల మీద కూడా దాడులు జరిపారు. ఇరాన్‌లో అత్యధికులు షియా తెగ ముస్లింలు కాగా సౌదీలో సున్నీలు ఉన్నారు. ఇరాక్, బహరెయిన్‌లో, చివరికి సౌదీలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఉన్న సున్నీ-షియా వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందంతో అవి క్రమంగా తగ్గుతాయి తప్ప పెరగవు అన్నది అందరూ చెబుతున్నారు. ఇంతకాలం సౌదీ-ఇరాన్ వివాదాలతో లాభపడిన అమెరికాకు ఈ పరిణామం సుతరామూ అంగీకారం కాదు. దానికి నిరంతరం ఉద్రిక్తతలు, ఘర్షణలు ఉండాల్సిందే. ప్రపంచంలో అస్థిరతకు అమెరికా చూస్తుంటే సుస్థిరతకు చైనా చేయూత నందిస్తోంది. అమెరికా ఎక్కడ కాలుపెట్టినా తన ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకొనే ఉద్రిక్తతల సృష్టి తప్ప అభివృద్ధికి చేసిందేమీ లేదు.



ఎందుకు సౌదీ అరేబియా అమెరికా నుంచి దూరంగా జరుగుతోంది? పెట్రో డాలరు బదులు పెట్రో యువాన్‌కు సౌదీ మొగ్గు చూపుతున్నదన్న వార్తలు అమెరికా నేతలకు రక్తపోటును పెంచుతున్నాయి. దీనికి తోడు బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన బ్రిక్స్ కూటమిలో చేరేందుకు, తద్వారా రష్యా, చైనాలకు దగ్గర కావాలని సౌదీ చూడటం కూడా దానికి ఆందోళన కలిగిస్తోంది. అందుకే ఒప్పందాన్ని వ్యతిరేకిస్తే మరింత నష్టమని కావచ్చు, మంచిదేగా అన్నట్లు తడిపొడిగా స్పందించింది. నిజానికి ఒప్పందం కుదరకుండా తెరవెనుక ఎంత చేసినా సాధ్యం కాలేదు. " దీని గురించి మాకు ఎప్పటికప్పుడు సౌదీ చెబుతూనే ఉంది. మేము చేసేది మేము చేస్తున్నాం గానీ నేరుగా ప్రమేయం పెట్టుకోలేదు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గటానికి చేసే యత్నాలకు మేము మద్దతు ఇస్తాం, అది మాకూ అవసరమే, మా పద్ధతిలో మేమూ చేశాం" అని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ కిర్బీ అన్నాడు. ఇరాన్ పట్ల అమెరికా, ఇజ్రాయెల్ బలహీనత కారణంగానే సౌదీ తన దారులు తాను వెతుక్కొంటోందని ఒప్పంద ప్రకటన వార్త వెలువడగానే ఇజ్రాయెల్ స్పందించింది. అమెరికా పథకాల ప్రకారం ఇరాన్ అణుకేంద్రాల మీద దాడులు జరపాలన్న తమ కలనెరవేరదనే దుగ్గదానికి ఉంది. పాతిక సంవత్సరాల పాటు అమెరికా విదేశాంగశాఖలో మధ్య ప్రాచ్య విధాన సలహాదారుగా పనిచేసిన అరోన్ డేవిడ్ మిల్లర్ ఎన్‌బిసి టీవీతో మాట్లాడుతూ... "ఆ ప్రాంతంలో అమెరికా పలుకుబడి, విశ్వసనీయత తగ్గుతున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. కొత్త అంతర్జాతీయ ప్రాంతీయ పొందికలు చోటు చేసుకుంటున్నాయి, అవి చైనా, రష్యాలకు సాధికారతను, వాటి స్థాయిని పెంచినట్లుగా ఉంది" అన్నాడు. ఉక్రెయిన్ వివాదం పేరుతో రష్యామీద ప్రకటించిన ఆంక్షలను అనేక దేశాలు తిరస్కరించిన నేపథ్యంలో అమెరికా పలుకుబడి గురించి ఏ దేశమైనా ఒకటికి రెండు సార్లు తన విధానాలను సమీక్షించుకుంటుంది. దానికి సౌదీ అరేబియా మినహాయింపు కాదని ఈ ఉదంతం వెల్లడిస్తున్నది.


మధ్య ప్రాచ్యపరిణామాల్లో అమెరికా వైఖరిని చూసిన తరువాత ఇరాన్-సౌదీ రెండూ పునరాలోచనలో పడటంతో పాటు, సర్దుబాట్లకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దశాబ్దాల తరబడి అమెరికా విధించిన ఆంక్షలతో ఆ ప్రాంత దేశాల నుంచి ఇరాన్ ఒంటరితనాన్ని ఎదుర్కొంటోంది. సౌదీదీ అదే పరిస్థితి, అమెరికాను నమ్ముకొని దాని పథకంలో భాగంగా పని చేస్తే సాధించేదేమీ ఉండదని తేలింది. ఇరాన్‌తో చైనా, రష్యాల సంబంధాలు మరింతగా బలపడటంతో అమెరికాతో వైరం కారణంగా ఇరాన్ మరింత బలపడుతుందనేది సౌదీకి అర్థమైంది. దీనికి తోడు ఈ ప్రాంత దేశాలతో చైనా సంబంధాలు, పెట్టుబడులు పెరుగుతున్నాయి. అమెరికా మాదిరి ఏ ఒక్క దేశంతోనూ అది ఘర్షణాత్మకవైఖరిని ప్రదర్శించటం లేదు. తన ఎత్తుగడలు, భావజాలాన్ని రుద్దటం లేదు. ఒకదానితో మరొకదానికి తంపులు పెట్టి పబ్బంగడుపుకోవటం లేదు. పరస్పర లబ్ధి పొందే పెట్టుబడులు పెడుతున్నది. అందువల్లనే దానితో ప్రతి దేశమూ సంబంధాలు పెట్టుకొనేందుకు చూస్తున్నది. ఇరాన్-సౌదీ ఒప్పందం గురించి తొలుత ఇరాక్, ఒమన్ వంటి ప్రాంతీయ తటస్థ దేశాల్లో ఐదు దఫాలు ప్రాథమిక చర్చలు జరిగాయి. 2030నాటికి ప్రపంచంలో అగ్రశ్రేణి పది దేశాల్లో స్థానం సంపాదించాలంటే అమెరికా ఆధారిత విధానాలతో లాభం లేదని సౌదీకి అర్థమైంది. అన్నింటి కంటే ఇరుగు పొరుగుదేశాల్లో అస్థిరత్వం, ఘర్షణల వాతావరణం ఉంటే అది ప్రారంభించిన హరిత చొరవ ముందుకు వెళ్లే అవకాశం లేదు. సౌదీతో సర్దుబాటు చేసుకుంటే ఇతర అరబ్బుదేశాలు తమ మీద దాడికి వచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయని ఇరాన్‌కు అర్థమైంది. ఒంటరి తనం నుంచి అభివృద్ధి వైపు వెళ్లాలంటే మరొక దగ్గరదారి లేదు. తనను బూచిగా చూపి మధ్య ప్రాచ్య నాటో ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న అమెరికాను అడ్డుకొనేందుకు మరొక మార్గం లేదు. ఒప్పందాలకు చైనా హామీదారుగా ఉన్నందున రెండు దేశాలకు పెద్ద భరోసా అన్నది స్పష్టం. చైనాకు తెరవెనుక అజండా లేదు. బిఆర్ఐ పేరుతో అది రూపొందించిన పథకంలో భాగంగా పెట్టుబడులు పెడుతున్నది. తమ మీద వాణిజ్య, సాంకేతిక పరిజ్ఞాన పోరుకు దిగిన అమెరికాను ఎదుర్కొనేందుకు అంతర్గతంగా మార్కెట్‌ను సృష్టించుకోవటంతో పాటు తన ఎగుమతులకు ఇతర మార్కెట్లను వెతుక్కోవలసిన అవసరాన్ని పశ్చిమ దేశాలు ముందుకు నెట్టాయి. ఇరాన్-సౌదీ ఒప్పందం మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియా దేశాల్లో అమెరికా కుట్రలకు పెద్ద ఎదురుదెబ్బ!

సెల్: 8331013288



'పరీక్షా' కాలం!

ప్రభుత్వాలకు పరీక్షా కాలం ఇంకో ఆరు నెలలో, ఏడాదో ఉంది. కానీ ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా కాలం చేరువైంది. ఈ సంక్షిష్ట సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. అన్ని తరగతులకు వార్షిక పరీక్షలు అయితే, పదో తరగతికి, ఇంటర్ విద్యార్థులకు బోర్డు పరీక్షలు. ఆ తర్వాత ఉన్నత, వృత్తి విద్యా చదువులకు ప్రవేశ పరీక్షలు ఉంటాయి. నేటి విద్యార్థులకు రేపటి భవిష్యత్తును నిర్ణయించేవి కాబట్టి వారు ఒత్తిడికి లోనవడం సహజం. పరీక్షా కాలం దగ్గర పడుతున్న కొద్దీ టెన్షన్ భరించలేకపోతున్నారు. చదివింది గుర్తుకు రావటం లేదనీ, మర్చిపోతున్నాం అంటూ టెలీ మానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఇంటర్ విద్యార్థుల ఫోన్ల వెల్లువ పెరిగిపోతోంది. మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తున్నది. గత అక్టోబర్ నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 60వేల ఫోన్లు వచ్చినట్టు సమాచారం. అందులో అత్యధికులకు పరీక్షలకు సంబంధించిన సమస్యలే ఉన్నాయి. ఆ తర్వాత మానవ సంబంధాలు (హ్యూమన్ రిలేషన్షిప్), ఆర్థిక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రంలో మార్చి 15వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలున్నాయి. ఈ పరీక్షల్లో మొత్తం 9.51లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే పదవ తరగతి పరీక్షల కోసం కూడా విద్యార్థులు సిద్ధమవుతున్నారు. టెన్షన్ నివారణకు టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తున్న వారిలో 90శాతం పైగా ఎంపీసీ, బైపిసి విద్యార్థులే ఉన్నారు. పరీక్షల ఒత్తిడి ఒక వైపైతే, ఆ తర్వాత ఉండే జేఈఈ మెయిన్, అడ్వాన్స్, నీట్, ఎంసెట్లలో అర్హత సాధిస్తామా! మంచి ర్యాంకు వస్తుందా లేదా! అనే ఒత్తిడి ఈ రెండు గ్రూపుల విద్యార్థుల్లో ఉంటుందని నిపుణులు అంటున్నారు. దీంతోపాటు తల్లిదండ్రులు.. విద్యార్థుల స్థాయిని తెలుసుకోకుండానే వారికి భారీ ఫీజులు చెల్లించి కార్పొరేట్, ప్రయివేట్ కాలేజీల్లో చేర్పించడంతో విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని తెలుస్తున్నది. ఈ టెన్షన్ అతిగా పెంచుకుంటూ పోతే, ప్రభావం మన శరీరం, మెదడు మీద పడుతుంది. కాళ్ల వణుకుతాయి. ప్రశ్న పత్రంలో ప్రశ్నలు ఎన్నడూ కనీ, విననివిగా కనిపిస్తాయి. ఏదీ గుర్తుకు రాదు. ఇక్కడ మనం చేయాల్సింది దాన్ని ఎలా అధిగమించాలి అనే మార్గాలను వెతకడం. చాలామంది మానసిక నిపుణుల సూచనలను. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాలకులు తెలుసుకోవాలి. నిజానికి వీరు భయపడి విపరీతమైన ఒత్తిడికి లోనయ్యేంత తీవ్ర పరిస్థితి పరీక్షల్లో, పత్రాల్లో ఉండదు. అన్నీ చదువుకున్న పాఠ్యాంశాలేనని గుర్తించాలి. ఇతరులతో పోల్చుకోవద్దు, అర్ధరాత్రి వరకు చదవొద్దు. ఇలా చదివితే బుర్రకి ఎక్కదు గుర్తుకు రాదు. ప్రతి గంటకు సుమారు 15 నిమిషాలు విరామం తీసుకోవాలి. మధ్య మధ్యలో వ్యాయామం, యోగా లాంటివి చేయాలి. చదివిన అంశాలపై ముఖ్యమైన పాయింట్లు నోట్ చేసుకొని తరచూ గుర్తు చేసుకోవాలి. పరీక్షా కేంద్ర మేమీ యుద్ధభూమి కాదు! పరీక్షలంటే యుద్ధం చేయడం కాదు? ప్రశాంతంగా ఏకాగ్రత కోల్పోకుండా చదువుకున్న అంశాలు గుర్తు చేసుకుని రాయాలి. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఏకాగ్రత చదువుల్లో ఎంతో అవసరం ఉందంటున్నారు. అది లేకుండా ఎన్ని గంటలు చదివినా బుర్రకెక్కదని చెప్తున్నారు. మనసుని చదువుల మీద కేంద్రీకృతం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అంటున్నారు. ఎప్పటి పాఠం అప్పుడే చదివే వారికి పరీక్షల సమయంలో ఏ టెన్షన్ ఉండదని పెద్దలు, పిల్లలు గుర్తుపెట్టుకోవాలి. ఏకాగ్రత కోల్పోకుండా ఉండటం తరచూ నీళ్లు, జావ, మజ్జిగ తాగడం, పోషకాహారం, డ్రై ఫ్రూట్స్, నట్స్ తరచూ తీసుకోవడం, రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్ర పోవడం చేయాలి. ప్రభుత్వాలు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా చూడాలి. పరీక్షలు రాయడం అంటే? తరగతి గదిలో నేర్చుకున్న వాటిని మనసుతో ఆలోచించి, స్మరణకు తెచ్చుకోవడం. విద్యార్థులకు ఫ్యాన్లు, రాయడానికి వీలుగా బెంచీలు, కుర్చీలు, గాలి, వెలుతురు, నీరు, టాయిలెట్లు, రవాణా, విద్యుత్తు సౌకర్యాల కొరత రాకుండా చూడాలి. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా కేంద్రాలు విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వడంలో రుసుముల పేరుతో ఆలస్యం చేయడం లాంటి సంఘటనలు లేకుండా వారికి ముందే హాల్ టికెట్ పంపిణీ చేసేలా చూడాలి. పరీక్షలు సమీపంలో ఉన్నందున విదార్థులు ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాలకులపై ఉందని గమనించాలి. ఈ పరీక్షలు విద్యార్థులకు మాత్రమే కాదు? అవి నిర్వహించే యాజమాన్యాలకు, అధికారులకు, బోధించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాలకులకు కూడా పరీక్ష కాలమేనని గ్రహించాలి. రోజూ కాలేజీకో, బడికో వెళ్లినట్లే సహజంగా కొంచెం ప్రణాళికతో పరీక్షా కేంద్రాలకు వెళ్లాలి. అంతకు మించిన ఒత్తిడి అనవసరం. పరీక్షల్లో చక్కగా చదివేసిన వాటినే అలవోకగా రాసేయవచ్చు. విద్యార్థులకు ఇంకో అతి విలువైన మాట.. మార్కులు ర్యాంకులే ప్రతిభకు కొలమానం కాదు. పరీక్షలు రాయబోయే ఏ ఒక్క విద్యార్థి నిరాశ, నిస్పృహలకు లోను కావద్దు. ఆత్మ విశ్వాసం కన్న గొప్ప ఆస్తి లేదు. ఆల్ ది బెస్ట్..



మేకిరి దామోదర్
9573666650

త్రిపురలో బీజేపీ హింసాకాండ

మార్చి రెండవ తేదీన వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాలలో బాగా తక్కువ తేడాతో అయినా బీజేపీ త్రిపురలో అధికారానికి వచ్చింది. ఆ ప్రకటన వెలువడింది మొదలు త్రిపురలో భయానక హింసాకాండ సాగుతోంది. పరిస్థితి ఇలా ఉంటుందని ముందుగా ఊహించిందే. మార్చి 6 నాటికి, రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ మూకలు పాల్పడిన దాడులు, హింసాత్మక సంఘటనలు దాదాపు వెయ్యివరకు ఉన్నాయి. సీపీఐ(ఎం), వామపక్ష సంఘటన, కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులపై భౌతిక దాడులు జరిగాయి. వారి ఇండ్లను తగలబెట్టారు. పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేశారు. అన్నింటికంటే అత్యంత హేయమైన, విషపూరితమైన దాడి ఏమిటంటే ప్రజల జీవనోపాధులను దెబ్బ తీయడం. రబ్బరు తోటలు, పంటలను తగల బెట్టడం, వారి ఇ-రిక్షాలను, వాహనాలను తిరగడానికి వీల్లేకుండా ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు.

2018 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ మొదటిసారిగా అధికారంలోకి వచ్చిన తర్వాత సరిగ్గా ఇదే తరహాలో హింస, భయోత్పాతం చోటుచేసుకుంది. వామపక్షాల కార్యకర్తల కుటుంబా లను బెదిరించడం, బలవంతంగా వసూళ్ళకు పాల్పడడం వంటి చర్యలతో ఐదేండ్లూ పాలకపార్టీ ఇదే తరహా అణచివేతను కొనసాగించింది. ఈ కాలంలో సీపీఐ(ఎం) సభ్యులు, మద్దతుదారులు 25మంది హత్యకు గురయ్యారు. ఈసారి, ప్రతిపక్షాలను అణచి వేయడానికి అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, వామపక్షాలు, కాంగ్రెస్‌కు కలిపి 35శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. మరోవైపు బీజేపీ సీట్లు, ఓట్లు రెండూ కూడా గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో తీవ్ర ఆగ్రహం, నిరాశా నిస్పృహలతో బీజేపీ ఇంత విచ్చలవిడిగా ఈ దాడులకు పాల్పడినట్లు కనిపిస్తోంది. ఎన్నికల్లో పాలకపార్టీ గెలిచినప్పటికీ ప్రతి పక్షంపై ఎందుకింత తీవ్రంగా, ఉధృతంగా దాడులకు తెగబడుతోందని త్రిపుర వెలుపల ప్రజలు ప్రశ్నించవచ్చు. ఇక్కడే వర్గ కోణం ముందుకు వస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగానే, త్రిపురలో కూడా దశాబ్దాల తరబడి సాగించిన ప్రజా ఉద్యమాలు, పోరాటాల ఫలితంగానే కమ్యూనిస్టు ఉద్యమం నిర్మితమైంది. సీపీఐ(ఎం) నిర్మాణాన్ని ధ్వంసం చేయడం, ఆ పార్టీకి మద్దతుగా ఉన్న ప్రజలను భయకంపితులను చేయడమే లక్ష్యంగా త్రిపురలో అణచివేత, హింస కొనసాగించా లన్నది బీజేపీ ప్రణాళికగా ఉంది. ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా... కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమంపై ఈ వర్గ దాడి కొనసాగుతోంది. కమ్యూనిస్టు ఉద్యమాన్ని నాశనం చేయాలన్నదే దాని లక్ష్యం.

ఈ నెల 8వ తేదీన రెండవసారి ముఖ్య మంత్రిగా ప్రమాణం చేసిన మాణిక్ సాహా ఈ సంఘటనలపై స్పందించిన తీరును బట్టే ఈ మొత్తం హింసాకాండ వెనుక పాలక పార్టీగా బీజేపీ హస్తం ఉందనేది స్పష్టమవు తోంది. కొన్ని బాధిత ప్రాంతాల్లో పర్యటించిన తర్వాత, సాహా మాట్లా డుతూ... ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు, స్వార్థ ప్రయోజనాలు కలిగిన కొంతమంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో హింసను ప్రేరేపిస్తున్నారని అన్నారు. అంటే ఇక్కడ బీజేపీని అప్రతిష్ట పాల్జేయడానికి సీపీఐ(ఎం), ఇతర ప్రతి పక్షాల కార్యకర్తలు తమ స్వంత ఇళ్ళకు, దుకాణా లకు, కార్యాలయాలకు తామే నిప్పంటించు కుంటున్నారన్నమాట! 2018కి ముందు తమ హయాంలో సీపీఐ(ఎం), వామపక్ష సంఘటన కలిసి ప్రతి పక్షాన్ని అణచివేయడానికి ప్రయత్నించాయని దూషణలకు దిగడం మరోఎత్తుగడ. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ తరహా అసత్యపు ప్రచారానికి పాల్పడ్డారు. త్రిపుర ఎన్నికల ప్రచార సభల్లో ఏవైతే మాట్లాడారో, అవే మాటలు మార్చి 2వ తేదీ సాయంత్రం న్యూఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో విజయోత్సవాల్లో కూడా ప్రతిధ్వనించాయి. గతంలో ఒక పార్టీ జెండా మాత్రమే అగర్తలా, ఇతర చోట్ల ఎగరడానికి ఎలా అనుమతించబడిందనేది మోడీ పదే పదే చెప్పారు. మరే ఇతర పార్టీ పతాకమైనా ఎగరేయాలని అనుకునేవారు హింసాత్మక దాడులను ఎదుర్కొనాల్సి ఉండేదన్నారు. అలా పాలక పార్టీగా సీపీఐ(ఎం) నియంతృత్వం గురించి బీజేపీ పదే పదే మాట్లాడుతున్నదంతా ప్రస్తుత వాస్తవిక పరిస్థితుల ముందు పూర్తిగా తేలిపోయింది.



ఉదాహరణకు వామపక్ష సంఘటన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా, రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ జెండాలు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం అనేకమంది పరిశీలకులను విస్మయపరిచింది. అంతకు ముందు కూడా, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉన్నపుడు, అగర్తలా చుట్టుపక్కల కాంగ్రెస్ జెండాలు ప్రధానంగా ఎగిరేవి. బీజేపీ పాలనలో 2021 నవంబరులో అగర్తలా మున్సిపల్ ఎన్నికలు జరిగినపుడు రిగ్గింగ్ దారుణంగా జరిగింది. 51 సీట్లకు 51 సీట్లూ బీజేపీనే గెలుచుకుంది. కానీ 1995 డిసెంబరులో, లెఫ్ట్ ఫ్రంట్ హయాంలో ఎన్నికలు జరిగినప్పుడు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ సంపాదించింది. ఆ తర్వాత కూడా, కార్పొరేషన్ లో కాంగ్రెస్ గణనీయమైన సంఖ్యలోనే సీట్లు గెలుచుకుంటూ వచ్చింది. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ 40శాతానికి పైగా ఓట్లు దక్కించుకుంది.

గత ఐదేండ్లలో బీజేపీ పాలనలో ప్రతిపక్ష పార్టీల హక్కులు పూర్తిగా తిరస్కరించబడ్డాయి. ప్రజాస్వామ్యం, ప్రజాతంత్ర హక్కులు దారుణ అణచివేతకు గురయ్యాయి. ఈ ఐదేండ్లలో 16మంది సీపీఐ(ఎం) ఎంఎల్ఏలు తాము ఎన్నికైన చోట సాధారణ కార్యకలాపాలు సైతం నిర్వహించ లేకపోయారు. ప్రజాప్రతినిధులుగా తమ నియోజక వర్గాల్లో స్వేచ్ఛగా తిరగలేకపోయా రంటేనే నిరంకుశ-ఫాసిస్ట్ వ్యవస్థ త్రిపురలో ఎంతలా పాతుకుపోయిందో అంచనా వేయవచ్చు. 2021 సెప్టెంబరులో తన నియోజకవర్గంలో బ్లాక్ స్థాయిలో ప్రజా ప్రదర్శనలో పాల్గొనేందుకు ప్రతిపక్ష నేత మాణిక్ సర్కార్ పట్టుబట్టినపుడు బీజేపీ గూండాలు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంపై దారుణమైన రీతిలో దాడి కూడా జరిగింది.

> అణచివేత, బెదిరింపుల పాలన ద్వారా సీపీఐ(ఎం)ను, వామపక్ష సంఘటనను ఐదేండ్ల పాటు నిరంతరాయంగా నిర్వీర్యం చేసేందుకు, బలహీనపరిచేందుకు బీజేపీ ప్రయత్నించింది. ఎన్నికలలో తాము పేలవమైన విజయం పొంద డానికి ఇదొక ముఖ్యమైన కారణమని బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమికి బాగా తెలుసు. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి వచ్చిన వామపక్షాలు ఎన్నికల ప్రచారంలో ధైర్యంగా పనిచేశాయి. వామపక్షాలు, ప్రతిపక్షంపై ఇప్పటికీ బీజేపీ హింసాకాండ కొనసాగుతున్నదంటే అందుకు ఆ పార్టీలో నెలకొన్న భయాలు, అభద్రతా భావాలే కారణమని చెప్పవచ్చు.

అణచివేత, బెదిరింపుల పాలన ద్వారా సీపీఐ(ఎం)ను, వామపక్ష సంఘటనను ఐదేండ్ల పాటు నిరంతరాయంగా నిర్వీర్యం చేసేందుకు, బలహీనపరిచేందుకు బీజేపీ ప్రయత్నించింది. ఎన్నికలలో తాము పేలవమైన విజయం పొంద డానికి ఇదొక ముఖ్యమైన కారణమని బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమికి బాగా తెలుసు. రెట్టించిన ఉత్సాహంతో తిరిగి వచ్చిన వామపక్షాలు ఎన్నికల ప్రచారంలో ధైర్యంగా పనిచేశాయి. వామపక్షాలు, ప్రతిపక్షంపై ఇప్పటికీ బీజేపీ హింసాకాండ కొనసాగుతున్నదంటే అందుకు ఆ పార్టీలో నెలకొన్న భయాలు, అభద్రతా భావాలే కారణమని చెప్పవచ్చు. తమపై సాగుతున్న హింసాకాండ నుండి తప్పించుకోవడం, ప్రజలతో సంబంధాలను కొనసాగించడమనే బృహత్తర కర్తవ్యాన్ని సీపీఐ(ఎం), వామపక్ష సంఘటన చేపట్టాయి. ఈ ప్రయత్నంలో, వాటికి ప్రజాతంత్ర, ప్రగతిశీల, లౌకిక శక్తులన్నిటి మద్దతు, తోడ్పాటు కావాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సాధికారతే లక్ష్యంగా...



షైఖా జవహర్ అల్ ఖలీఫా... మహిళా సాధికారత కోసం తన వంతు కృషి చేస్తున్న వ్యక్తి. రాజకుటుంబంలో పుట్టినా తనకంటూ ఓ సొంత గుర్తింపు తెచ్చుకునేందుకు నిత్యం తపిస్తున్నారు. ఓ వ్యాపారవేత్తగా మారి భారతదేశంలోని వివిధ ప్రాజెక్టులలో మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో 50 బిలియన్ల నిధిని ప్రకటించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

ఖలీఫా బ్రహెయిన్ రాజకుటుంబ సభ్యురాలు. యూఏఇలో పెరిగారు. ఈ-కామర్స్‌తో పాటు రియల్ ఎస్టేట్, కమోడిటీ ట్రేడింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఫుట్‌వేర్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, స్టార్టప్ సపోర్ట్, మార్కెటింగ్, అడ్వర్టైజింగ్, ట్రేడ్, ప్రొడక్ట్ డిస్ట్రిబ్యూషన్‌లలో ఆసక్తి ఉన్న దుబాయ్ ఆధారిత గ్రీన్ అవెంచురైన్ హోల్డింగ్ వ్యవస్థాపకురాలు. అలాగే వాటి చైర్‌పర్సన్ కూడా.

పేరున్నా అంత సులభమేమీ కాదు

"నాకు విలువనిచ్చే కుటుంబంలో పుట్టడం నాకు దక్కిన మంచి అవకాశం. అయితే ఇతరులకు సహాయం చేయడానికి ఈ పేరును ఉపయోగించడం కూడా నా కర్తవ్యం" అంటారామె. రాయల్‌గా ఆమెకున్న ప్రత్యేకాధికారం తన వ్యాపారాలకు అంత సులభమైన మార్గమేమీ కాలేదు. ఖలీఫా ఎప్పుడూ ఒక సాధారణమైన వ్యక్తిగా ఉండేందుకు ఇష్టపడ్డారు. "సంప్రదాయవాద అరబ్ కుటుంబం నుండి వచ్చిన నేను అనుసరించడానికి ముందే ఒక మార్గం రూపొందించబడింది. యూనివర్సిటీలో మెడిసిన్, ఆర్కిటెక్చర్ లేదా లా ఎంచుకోవాలి. అయితే నేను ఆ మూడింటిని వ్యతిరేకించాను. దౌత్యవేత్తగా నా కెరీర్‌ను ప్రారంభించాలని రాజకీయ శాస్త్రాన్ని ఎంచుకున్నాను" అన్నారు. అయితే ఆమె చివరకు విభిన్న మార్గాలను నడపవలసి వచ్చింది. అంతర్జాతీయ సంబంధాలకు, తర్వాత ప్రజా సంబంధాలకు, చివరకు వ్యాపార నిర్వహణ తన ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు.

సాధికారతవైపు మళ్లించారు

"నేను ఎప్పుడూ నా సొంతంగా ఉండాలనుకుంటున్నాను. దాన్ని నిరూపించుకోవడానికి పోరాడుతున్నాను" అంటూ ఆమె జతచేస్తున్నారు. అందుకే ఆమె వివిధ స్థానిక కార్యక్రమాలలో స్వచ్ఛందంగా పాల్గొని మహిళలు, యువత సాధికారత వైపు తన అభిరుచిని మళ్లించారు. తన వ్యాపార ప్రయోజనాలతో పాటు, మహిళలకు సాధికారత కల్పించడం వల్ల మొత్తం కుటుంబాలు విజయవంతం కావడానికి సాధికారత లభిస్తుందని ఖలీఫా అభిప్రాయపడ్డారు.

యువతకు సహకరిస్తాము

యువత కోసం వ్యాపారాలలోకి కొత్త ఆలోచనలను అనువదించడానికి ఆమె అబుదాబిలో ఒక ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. "మేము వారి ఆలోచనలను వింటాము. నిధులను సేకరించడంలో వారికి సహాయం చేస్తాము. వారికి కావల్సిన మార్గదర్శకత్వం, నైపుణ్యం అందిస్తాము. యువ పారిశ్రామికవేత్తలను, వారి వ్యాపారాలను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేసే గ్లోబల్ యూత్ బిజినెస్ క్లబ్‌లో నేను కూడా భాగం" అని ఆమె చెప్పారు. ఖలీఫా ప్రకారం ప్రారంభంలో ఆమె పేరు, పరిచయాలు యువత విజయవంతం కావడానికి తలుపులు తెరిచేందుకు సహాయపడ్డాయి. పరిచయాలు ఏర్పడే వరకు, వ్యాపార భాగస్వామ్యం ఏర్పడే వరకు యువ వ్యాపారవేత్తలతో కలిసి ఉండటమే ఆమె పని. దాని తర్వాత ఆమె పాత్ర ముగిసిపోతుంది. యూఏఇలో ఆమె దుబాయ్ ఎలక్ట్రిసిటీ అండ్ వాటర్ అథారిటీ (DEWA), దుబాయ్ టూరిజం అథారిటీ వంటి సంస్థలతో కలిసి పనిచేయడానికి యువ ఆవిష్కర్తలకు సహాయం చేశారు.

వివిధ ప్రాజెక్టుల ద్వారా...

"తమ కుటుంబ వారసత్వా నికి మించి అడుగులు వేసి మహిళల జీవితాల్లో మార్పును సృష్టించాలని కోరుకునే దృఢమైన, భావసారూప్యత కలిగిన మహిళా వ్యాపారవేత్తలతో భాగస్వామ్యం కావాలని నేను భావిస్తున్నాను" అని ఆమె అంటున్నారు. వారిలో పటేల్ కుటుండానికి చెందిన దీపికా పటేల్ కూడా ఉన్నారు. దీపికా వివిధ మహిళల కార్యక్రమాలకు మద్దతిస్తు న్నారు. మహిళల కోసం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని దేశం నాకు పెట్టుబడి పెట్టడానికి సరైన తలుపులు తెరుస్తుందని నమ్ముతున్నాను" అని ఖలీఫా ఆశావాహంతో ఉన్నారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, విద్య, నీటి సంర క్షణ, పర్యావరణ సంబంధిత వెంచర్ల లో పెట్టుబడులు పెట్టేటప్పుడు వివిధ ప్రాజెక్టుల ద్వారా భారత దేశంలోని మహిళలు, కుటుంబాల అభివృద్ధి మాత్రమే తన దృష్టిలో ఉంటుందని ఆమె నొక్కి చెబుతున్నారు.

ప్రాణాళిక రూపొందించుకుని

ఫిబ్రవరిలో ఆమె మొదటిసారి భారతదేశాన్ని సందర్శించారు. తర్వాత మేలో మళ్లీ భారతదేశాన్ని సందర్శించి మహిళలకు ఏమి అవసరమో, తన ఫండ్ వారికి ఎంతవరకు సహాయం చేయ గలదో ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి వివిధ నగరాలకు వెళ్లాలని ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసిసి)లో మహిళలకు అవకాశాలు కల్పించినందుకు కూడా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సామర్థ్యమున్న ప్రతి మహిళను

"మేము ఈ ప్రాంతంలో చాలా మంది మహిళా సాధకులను చూస్తున్నాం. ఎందుకంటే వారికి అనేక అవకాశాలు, మద్దతు, సరైన సాధనాలు ఉన్నాయి. సామర్థ్య మున్న ప్రతి మహి ళను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం, ఆమె విజయం సాధించడాన్ని చూడడం, అన్ని ప్రాంతాల నుండి మహిళా పారిశ్రామికవేత్తలు విజయవంతంగా ఎదిగేందుకు అవసరమైన దారులను అన్వేషించడం నా లక్ష్యం. నా నైపుణ్యం ప్రజలను కనెక్ట్ చేయడంలో ఉంది. నేను దీన్ని కొనసాగిస్తాను" అంటూ ఖలీఫా తన మాటలు ముగించారు.

బిజినెస్ ఫర్ గుడ్

వ్యాపారం, సామాజిక మార్పు ఒకదానితో ఒకటి కలిసిపోవాలని విశ్వసిస్తున్న ఖలీఫా ఇటీవల ఫిలిప్పీన్స్‌లో పెట్టుబడులు పెట్టమని వైస్ ప్రెసిడెంట్ సారా డ్యూటెర్టే ఆహ్వానించారు. దేశంలోని జైళ్లలో ఉన్న మహిళలకు బట్టలు, బ్యాగులు తయారు చేయడంలో ఆమె సహాయం చేస్తున్నారు. "మహిళలు ఏం తయారు చేసినా మేము అమ్ముతాము. వారి కుటుంబాలను పోషించడానికి ఆర్థికంగా వారికి చేయూతనిస్తాయి' ఆమె జతచేస్తున్నారు. ఇప్పుడు ఆమె తన "బిజినెస్ ఫర్ గుడ్" ఫిలాసఫీని భారతదేశానికి విస్తరింపజేస్తున్నారు. వివిధ ప్రాజెక్ట్‌లు, కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడానికి 50 బిలియన్ల నిధిని ప్రకటించారు.



ఇలా బ్యాలన్స్ చేసుకోండి



జీవితం అంటే పూలపాన్పు కాదు.. సుఖదుఖాల సంగమం. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకుని ముందుకు సాగితేనే సక్సెస్ మన సొంతమవుతుంది. అంతేకానీ ఆ బాధల్నే తలుచుకుంటూ కూర్చుంటే వాటి ప్రభావం కెరీర్‌పై కూడా పడుతుంది. ఉద్యోగం విషయంలోనూ అంతే.. మనకు వ్యక్తిగతంగా ఎన్ని సమస్యలైనా ఉండొచ్చు.. ఆఫీసుకి కూడా వాటిని మోసుకొస్తే అవన్నీ పనిపై ప్రభావం చూపచ్చు. కాబట్టి ఎన్ని వ్యక్తిగత సమస్యలున్నా సరే.. వాటిని ఇంటికే పరిమితం చేసి ఆఫీసుకి వచ్చేటప్పుడు ప్రశాంతమైన మనసుతో వచ్చి మీ పని మీరు సక్రమంగా చేస్తే జీవితంలో పైచేయి మీదే... కాబట్టి వ్యక్తిగత, వృత్తిగత జీవితాలను బ్యాలన్స్ చేసుకోవడానికి పాటించాల్సిన నియమాలేంటో తెలుసుకుందాం...

- కెరీర్‌లో మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను అనుకున్న సమయంలో చేరుకోవాలంటే ప్రణాళిక అనేది చాలా ముఖ్యం. కాబట్టి వ్యక్తిగతంగా ఎన్ని సమస్యలెదురైనా సరే వాటిని పక్కనపెట్టి ప్రణాళిక ప్రకారం ఫాలో అయితే విజయం మీదే అవుతుంది.
- వ్యక్తిగత సమస్యలున్నప్పుడు కోపం రావడం సహజం.. కానీ ఈ కోపాన్ని అదుపులో ఉంచుకుని పని చేస్తేనే కెరీర్‌కి ఎలాంటి ముప్పూ రాదు. అంతేకానీ మీ కోపాన్ని సహోద్యోగులపై చూపిస్తే ఆ ప్రభావం మీ జాబ్‌పై.. కెరీర్‌పై.. పడే అవకాశం ఉంటుంది. కాబట్టి కోపాన్ని నియంత్రించుకుని ముందుకు సాగితే మీ వ్యక్తిత్వంపై అందరికీ మంచి అభిప్రాయం కలుగుతుంది.
- మన చుట్టూ మనల్ని ప్రోత్సహించే వారికంటే నిరుత్సాహపరిచే వాళ్లే ఎక్కువగా ఉంటారని మనకు తెలుసు. అలాగే మనకేవైనా వ్యక్తిగత సమస్యలుంటే వాటిని పంచుకునే వారికంటే వాటిని చూసి దెప్పి పొడిచేవాళ్లే మన చుట్టూ ఎక్కువగా ఉంటారు. కాబట్టి మనకు చాలా దగ్గరగా అనిపించిన సహోద్యోగులకు తప్ప వేరే వాళ్లందరికీ ఈ విషయాలన్నీ చెప్పకపోవడం మంచిది. ఎవరైనా మీ విషయాలన్నీ తెలిసి మిమ్మల్ని హేళన చేస్తే మీరు వారితో గొడవకు దిగకుండా నిశ్శబ్దంగా ఉండండి. దీంతో మీ వ్యక్తిత్వం దెబ్బతినకుండా ఉంటుంది. అలాగే కొన్నాళ్లకు వాళ్లే మీ దారిలోకి వచ్చే అవకాశం కూడా ఉంటుంది.
- బతికినంత కాలం ప్రతిఒక్కరి జీవితంలో వ్యక్తిగతంగా ఏదో ఒక సమస్య ఎదురవడం సహజం. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవడమా? లేక వెనక్కి తగ్గడమా? అనేది మీ చేతుల్లోనే ఉంది. ఒకవేళ ఎన్ని కష్టాలైనా ఓర్చుకుని ధైర్యంగా ఎదుర్కొంటే జీవితంలో మంచి సక్సెస్ వస్తుంది. లేదంటే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. దీని ప్రభావం మనం చేసే ఉద్యోగంపై పడే అవకాశమూ ఉంది.
- ఒక్కోసారి బాస్ ఇచ్చిన వర్క్ మనకు నచ్చకపోయినా, లేదా సరైన సమయంలో పూర్తికాకపోయినా ఒత్తిడికి గురవడం సహజం. ఇక దీనికి వ్యక్తిగత సమస్యలు కూడా తోడవుతాయి. ఇలాంటప్పుడు చిరాకు, అసహనం కలుగుతాయి. పనిపై శ్రద్ధ పెట్టలేం. దీని ప్రభావం కెరీర్ పైనా పడుతుంది. అందుకే అన్ని విషయాల్లోనూ ఓర్పు అనేది చాలా అవసరం.
- సమస్యలకు తగిన పరిష్కారాలు మనకు తట్టకపోవచ్చు. మీకు సన్నిహితంగా ఉండే స్నేహితులతో, కొలీగ్స్‌తో మీ సమస్యల్ని చెప్పి తగిన సలహా అడగండి.. మీ సమస్య పరిష్కారానికి వాళ్లిచ్చే సలహాలూ ట్రై చేయండి.
- పని చేసే చోట తోటివారితో కలుపుగోలుగా ఉండాలి. ఆఫీసులో ఉన్నంతసేపు సహోద్యోగులతో కలిసిపోయి కాసేపు ఆనందంగా నవ్వుతూ ఎంజాయ్ చేయాలి. దీంతో సమస్యలన్నీ మరిచిపోయి సులభంగా పనిపై దృష్టి సారించొచ్చు.

వేసవి తాపానికి..?

వేసవిలో బయటికి వెళ్లాలంటేనే భయమేస్తుంది. చిన్న పిల్లల్ని, పెద్దవాళ్లని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. బయటికెళ్లొచ్చిన వెంటనే రీహైడ్రేట్ అవ్వాలంటే కొన్ని చిట్కాలను పాటిస్తే సరి... అవేంటంటే...

- శరీరాన్ని హైడ్రేట్ చేసే నీటితో కొంత వరకు ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.
- మితమైన మోతాదులో కాఫీ, టీలతో శరీరానికి శక్తి వస్తుంది. అలాగే బాదంపాలు, టీలో దాల్చినచెక్క, లెమన్‌గ్రాస్, జాజికాయ వంటివి చేర్చడం ద్వారా హైడ్రేట్ అవొచ్చు.
- పాలల్లో అధిక ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. ఇవి శరీరంలోని నీటినిల్వలను సమతుల్యం చేయడానికి ఉపయోగపడతాయి.
- కొన్ని పండ్లు, కూరగాయల్లో 80-90 శాతం నీరు ఉంటుంది. డీహైడ్రేట్ అయ్యేటప్పుడు పండ్ల రసాలవల్ల ఉపశమనం పొందొచ్చు. విటమిన్ సి ఉన్న పండ్లు, కూరగాయలకు ప్రాధాన్యతనిస్తే సత్వర ఫలితాన్ని పొందొచ్చు.



- సమస్య ఎక్కువై వాంతులు, విరేచనాలు వంటివి వస్తే... ఓరల్ హైడ్రేషన్ సొల్యూ షన్స్ వినియోగించాలి. ఇందులో ఎక్కువ శాతం సోడియం, క్లోరైడ్, ఎలక్ట్రోలైట్స్ ఉండటం వల్ల అలసట, నీరసం తగ్గుతాయి.
- ఇవి అందుబాటులో లేనప్పుడు లీటర్ నీళ్లలో, 6చెంచాల చక్కెర, అర చెంచా ఉప్పు కలిపి తాగితే ఎండదెబ్బ నుంచి బయటపడొచ్చు.

సంక్షోభాలకు పరిష్కార మార్గం
మార్క్సిజమే



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభాలు, వర్గ సంఘర్షణలు తీవ్రమయ్యాయని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. వాటికి పరిష్కార మార్గం చూపెట్టడం మార్క్సిజం వల్లనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్క్స్ రచనలను మరింత అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో కారల్ మార్క్స్ 140వ వర్థంతి సభను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి రాఘవులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో వర్గ సంఘర్షణలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. అయితే, అవి యుద్ధం, వ్యాపారం, ఆర్థికం, తదితర రూపాల్లో ఉంటాయని చెప్పారు. ప్రపంచంపై మరింత పట్టు సాధించేందుకు పెట్టుబడిదారీ దేశమైన అమెరికా యత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే విపరీత సహజవనరులున్న రష్యాను నాటో దళాల ద్వారా దెబ్బతీసేందుకు యత్నిస్తున్న తీరును వివరించారు. అన్ని అంశాల్లో మెరుగ్గా ఉన్న చైనాను సాంకేతికంగా దెబ్బకొట్టేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. అయితే, చాలా దేశాలు అమెరికా మాట వినట్లేదనీ, కొన్ని ఎదురు తిరుగుతున్నాయని చెప్పారు. డాలర్‌తో కాకుండా తమ దేశాల కరెన్సీలతో వ్యాపారాలు చేసేందుకు ఆయాదేశాలు మొగ్గుచూపుతున్నాయన్నారు. ప్రపంచాన్ని శాసించే శక్తి ఫైనాన్స్ క్యాపిటల్‌కు ఉన్నప్పటికీ అది ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లలేదని తెలిపారు. కార్మికవర్గం, విప్లవశక్తులు దాన్ని అందిపుచ్చుకునే స్థాయిలో లేవన్నారు. అయితే, దాన్ని సాధించేందుకు వందేండ్లయినా పట్టొచ్చు...వంద నిమిషాల్లోనైనా అయిపోవచ్చని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రభుత్వాలు సంక్షోభాలను అరికట్టే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు భావిస్తున్నప్పటికీ ఫైనాన్స్ పెట్టుబడి దానికి అంగీకరించబోదన్నారు. ఊహాజనిత వ్యాపారం నీటిబుడగ లాంటిదనీ, అది ఎప్పుడైనా పగిలిపోవచ్చునని చెబుతూ అదానీ, యూఎస్‌లో రెండు బ్యాంకులు దివాళా తీసిన తీరును వివరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నర్సింహారావు, చుక్కరాములు, పాలడుగు భాస్కర్, టి.సాగర్, అబ్బాస్, పలువురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

స్తంభించాయి. ఉద్యోగుల డిమాండ్‌ను పరిశీలిస్తామని చెబుతూనే సమ్మె చేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. దీనిపై తక్షణమే ప్రకటన చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఇందులోని ఆర్థికపరమైన అంశాలను అధ్యయనం చేయకుండా ఎలాంటి హామీలు ఇవ్వలేమని ప్రభుత్వం చెబుతున్నది. మెజారిటీ ఉద్యోగులు సమ్మెలో వున్నారని వార్తలందుతున్నాయి. 17లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఇంకా స్పష్టమైన సమాచారం రావాల్సి వుంది. తమ డిమాండ్లు నెరవేరేవరకు నిరసన, ఆందోళనలు కొనసాగుతాయని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సాధర్య కమిటీ కన్వీనర్ విశ్వాస్ కట్కార్ చెప్పారు. సమ్మె కారణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలు స్తంభిం చిపోయాయి. ఈ నిరవధిక సమ్మెలో జిల్లా పరిషత్, మున్సిపల్ కౌన్సిల్ ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. దీనికి తోడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంఘీభావంగా మంగళవారం మధ్యాహ్నం అజాద్ మైదాన్‌లో బీఎంసీ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. కాగా, ఉద్యోగులు సమ్మెను ఉపసంహరించగలరని ఆశిస్తున్నట్టు చీఫ్ సెక్రటరీ మనుకుమార్ శ్రీవాస్తవ తెలిపారు. పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్ అమలుపై అధ్యయనం చేయడానికి అధికారులతో కూడిన పాలనాపరమైన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రిజర్వేషన్లకు మోడీ ఎసరు

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. ఇవి వారి అభివృద్ధికి ఎలా ఉపయోగపడతాయో చెప్పాలని ప్రశ్నించారు. గిరిజనుల అభివృద్ధి పట్ల ప్రభుత్వాలు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్థాయిలోనే దళిత, గిరిజనుల అభివృద్ధికి తోడ్పడే విధంగా సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అందుకు తగిన పోరాట కార్యాచరణ జాతీయ స్థాయిలో రావాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరిస్తున్నదని చెప్పారు. మూతపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించకపోగా.. ఉన్న పరిశ్రమలను తెగనమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగమంతా నాశనమైతే..ఇక రిజర్వేషన్ల అమలు సంగతేంటని ప్రశ్నించారు. రిజర్వేషన్లను చంపడానికే దొడ్డిదారిన ప్రయివేటీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. పరిశ్రమలు వస్తే..ఉద్యోగాలు రావచ్చుగానీ..అందులో రిజర్వేషన్లు అమలుకానప్పుడు దళిత, గిరిజనులకు ఉద్యోగాలెలా వస్తాయో చెప్పాలన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయటమంటే..నాణ్యతను దెబ్బతీయటమనే చర్చ చేయటం దుర్మార్గమన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కుల వ్యవస్థను యథాతథంగా కాపాడలని భావించే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించారు. అందుకే పోరాడడం ద్వారానే వాటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థ దేశాన్ని పట్టిపీడిస్తున్నదనీ, దాన్ని నాశనం చేయలన్నారు. యూనివర్సిటీల్లో సైతం ర్యాగింగ్ ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. అంబేద్కర్‌కు దండంపెట్టి దండేస్తే సరిపోదనీ, ఆయన పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ దళితుల్ని భూమికి దూరంగా ఉంచితే..వారిలో అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. భూస్వాములు, కార్పొరేట్ల దగ్గర భూమంతా కేంద్రీకరించబడి ఉందని చెప్పారు. బీజేపీ విధానాల ఫలితంగా దేశంలో కొద్దిమంది చేతుల్లో సంపదంతా పోగుబడి ఉందని చెప్పారు. ఎక్కువ మంది ప్రజలు పేదలుగా, నిరుపేదలుగా ఉన్నారన్నారు. అయినా కార్పొరేట్లకే ఈ ప్రభుత్వం రాయితీలిచ్చి ఆదుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో దానికి భారీ కోతలు విధించిదని గుర్తుచేశారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య మాట్లాడుతూ సేవా వృత్తులపై వివక్ష కొనసాగుతున్నదని చెప్పారు. దళితులు, గిరిజనులతోపాటు వృత్తిదారులపైనా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు.వీటికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్ మాట్లాడుతూ గిరిజనులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో గత తొమ్మిదేండ్లుగా బీజేపీ పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై రెట్టింపు స్థాయిలో దాడులు పెరిగాయని చెప్పారు. మహాధర్నా సందర్భంగా 12 డిమాండ్లతో కూడిన పత్రాన్ని విడుదల చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్‌లో ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు ఏగొండ స్వామి, లక్ష్మి, డీబీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేశ్, జైభీమ్ మహాసేన అధ్యక్షులు మంచింటి అంజన్న, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సామేలు, ఏ మాణిక్యం, జి రాజు, పల్లేర్ల లలిత, సహాయ కార్యదర్శి కోట గోపి, బొట్ల శేఖర్, సోమారపు రవితోపాటు రాష్ట్ర కమిటి సభ్యులు పాల్గొన్నారు.

వాహనం లేని పోలీస్‌స్టేషన్లు 63

న్యూఢిల్లీ : దేశంలో వాహనం లేని పోలీస్‌స్టేషన్లు 63 ఉన్నాయని, మొబైల్ ఫోన్లు లేనివి 285 ఉన్నాయని మంగళవారం లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది. సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ ఈ వివరాలు లిఖితపూర్వకంగా అందజేశారు. దేశంలో మొత్తం 17,535 పోలీస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. ఇందులో వైర్‌లెస్ సెట్, మొబైల్ ఫోన్లు లేని పోలీస్‌స్టేషన్లు 285 వరకు ఉన్నాయి. టెలిఫోన్ కనెక్షన్ లేనివి 628 ఉన్నాయని కేంద్రం తెలిపింది.

రేవంత్ రెడ్డికి పెద్ద మొత్తంలో ఆస్తులెక్కడివి?

- ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెయింటర్‌గా జీవితాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డికి పెద్ద మొత్తంలో ఆస్తులెక్కడి నుంచి వచ్చాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్లాక్ మెయిలింగ్‌ను వృత్తిగా చేసుకున్న రేవంత్ రెడ్డి సచివాలయం, అమర వీరుల స్మారక కేంద్రం, బీ.ఆర్.అంబెద్కర్ విగ్రహ నిర్మాణాల్లో అవినీతి జరిగిందంటూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారని విమర్శించారు.

టాప్ 50 కాలుష్య నగరాల్లో 39 మనవే

- అత్యంత కాలుష్య రాజధానిగా రెండో స్థానంలో ఢిల్లీ
- ప్రపంచంలో భారత్‌ది ఎనిమిదో స్థానం
- 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ' నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో కాలుష్య పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ రాజధాని మొదలుకొని ఇతర మెట్రో నగరాలు, ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. గతేడాది ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత 50 కాలుష్య నగరాల్లో 39 నగరాలు భారత్ నుంచే ఉన్నాయి. అలాగే భారత్ ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య దేశాల్లో ఎనిమిదో స్థానంలో ఉన్నది. 2021లో ఈ సూచిలో భారత్ ఐదో స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. స్విస్‌కి చెందిన సంస్థ ఐక్యూఎయిర్ 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ' నివేదిక పేరుతో ఈ జాబితాను విడుదల చేసింది.

ప్రపంచవ్యాప్తంగా 131 దేశాల నుంచి 30 వేలకు పైగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మానిటర్‌ల నుంచి ఈ సమాచారాన్ని సేకరించింది. ఆరోగ్య నిపుణులు, శాస్త్రవేత్తలు సూచించిన పీఎం 2.5 స్థాయిపై ఆధారపడి ఈ నివేదికను రూపొందించింది. 7,300 కంటే ఎక్కువ నగరాలను కలిగి ఉన్న ఈ జాబితాలో భారత్‌లోని పలు నగరాలు కాలుష్యంలో ముందు వరుసలో ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

చాద్ రాజధాని ఫస్ట్.. ఢిల్లీకి రెండో స్థానం

ఢిల్లీ ఇప్పటివరకు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధానిగా ఉన్నది. అయితే ఈ ఏడాది నివేదికలో గ్రేటర్ ఢిల్లీ, న్యూఢిల్లీల మధ్య తేడాను చూపించింది. అయితే రెండూ కూడా టాప్ 10లోనే ఉండటం గమనార్హం. న్యూఢిల్లీ 2వ స్థానంలో నిలవగా, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధానిగా చాద్ రాజధాని ఎన్‌డ్జమెనా నిలిచింది. ఎన్‌డ్జమెనా జనాభా పది లక్షల కంటే తక్కువగా ఉండగా.. న్యూఢిల్లీ జనాభా 40 లక్షల మంది కంటే ఎక్కువగానే ఉండటం గమనించాల్సిన అంశం. 31 నగరాలు కాలుష్య స్థాయిలలో రెండెంకల శాతం క్షీణతను నమోదు చేశాయి. వీటిలో పది యూపీలో ఉండగా, ఏడు హర్యానాలో ఉన్నాయి.

జాబితాలో మెట్రో నగరాలు..
హైదరాబాద్ ర్యాంకు199

దేశంలోని ఆరు మెట్రో నగరాలో ఢిల్లీ ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానంలో ఉండగా.. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా 99వ ర్యాంకులో ఉన్నది.

ఈ మెట్రో నగరాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) భద్రతా ప్రమాణాలతో పోల్చి చూస్తే తమిళనాడు రాజధాని చెన్నై తక్కువ కాలుష్యాన్ని కలిగి ఉన్నది. ముంబయి (137), హైదరాబాద్ (199), బెంగళూరు (440), చెన్నై (682) ల స్థానాలు వంద మీదనే నమోదు కావడం గమనార్హం.

బీజేపీలో చేరితే... కేసులు ఎత్తేస్తారా!

(మొదటిపేజీ తరువాయి)

ఐక్యతను దెబ్బతీయటం, ప్రతిపక్ష నాయకుల్ని ఒంటరి చేయటం మోడీ సర్కార్ ఎజెండా. ఈ ఎజెండా కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా అమలవుతోంది. కేసులు నమోదైన తర్వాత కొంతమందిబీజేపీలో చేరటంతో, వారిపై కేసులు కనిపించకుండా పోతున్నాయి.

రాజకీయ పొత్తులపై...

ఎన్నికల ఫలితాలు వెలువడ్డాకే పొత్తులు, రాజకీయ కూటములు ఉంటాయని ఏచూరి అన్నారు. యూపీఏ-1 సర్కార్ అలాగే ఏర్పాటైందన్నారు. గత 9ఏండ్లుగా దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతింటోందన్నారు. మన ప్రజాస్వామ్యం ఎన్నికలు, ఓట్లకు మాత్రమే పరిమితం అయ్యింది. ఈ పాలనలో ప్రజలకు జవాబుదారీతనం లేదు. అదానీ-హిండెన్‌బర్గ్ అంశమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయకపోవటం కేంద్రం తన బాధ్యతను విస్మరించటమే. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడల్లా ప్రతిపక్షాలు ఒక్కటవుతాయి. ఇప్పుడు కూడా అదే జరుగుతోందని అన్నారు.

బీజేపీ-ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను ఎండగడతాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో మూడు బృందాలు "జనచైతన్య యాత్ర" పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తున్నాయి. ఈ యాత్రల ద్వారా బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను ఎండగడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. వామపక్షాల ప్రభావాన్ని ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకుపోవడానికి ఉపయోగపడుతున్న ఈ యాత్రకు ప్రజలందరూ పెద్ద ఎత్తున మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తమ్మినేని వీరభద్రంతోపాటు, యాత్రకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జాన్‌వెస్లీ జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ బీజేపీ ఎనిమిదేండ్ల పాలనలో దేశానికి చేసిన దుర్మార్గాలను ఎండగడతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాదం ఎంత ప్రమాదమో తెలియజెప్పాలనే ఉద్దేశంతో ఈ యాత్ర జరుగుతున్నదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రమాదకరమైన సిద్ధాంతాలు, ప్రజల మధ్య పెడుతున్న మత చిచ్చు, ఈ దేశాన్ని మధ్యయుగాల నాటి పురాతన సంస్కృతికి తీసుకుపోవడానికి చేసే దాని ప్రయత్నాలను ప్రజల ముందుంచుతామని వివరించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలో ప్రత్యేకించి ఈ యాత్రను జరిపెందుకు నిర్ణయించామన్నారు. దాదాపు ప్రజా ఉద్యమ అభిమానులు, అభ్యుదయవాదులు, సామాజిక శక్తుల సమావేశం ఇప్పటికే జరిగిందనీ, వారందరూ ఈ యాత్రను బలపరుస్తున్నారనీ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ యాత్రలో పరస్పరం సహకరించుకోవాలంటూ సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల ఉమ్మడి సమావేశం నిర్ణయించిందని వివరించారు.

బిల్లులు ఆమోదించేలా ఆదేశించాలి

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు ఉన్నందున వచ్చే వారంలో విచారణకు తీసుకుంటానని సీజేఐ బదులిచ్చారు. పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున సోమవారం విచారణకు తీసుకోవాలని దవే అభ్యర్థించారు. దవే విజ్ఞప్తికి సీజేఐ సానుకూలంగా స్పందించి వచ్చే సోమవారం విచారణ చేపడతామన్నారు.

అవినీతి ఎమ్మెల్యేకు షాక్

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తన కుమారుడి అరెస్టుతో విరూపాక్షప్ప కేఎస్‌డీఎల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ప్రశాంత్ మడల్ అరెస్టు తర్వాత వారి ఇండ్లు, కార్యాలయాల్లో జరిపిన సోదాల్లో లోకాయుక్త పోలీసులు రూ. 8.23 కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం విదితమే. ఈ ఏడాది మే నెలలో కర్నాటకలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్కాం వ్యవహారం బీజేపీకి ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని రాజకీయ విశ్లేషకులు చెప్పారు.

సిట్ చేతికి పేపర్ లీకేజ్ కేసు

- పేపర్ల లీకేజీ కేసులో దర్యాప్తు వేగవంతం
- నిందితులకు 14రోజుల రిమాండ్ విధింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పేపర్ల లీకేజీ కేసును స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)కు ట్రాన్స్‌ఫర్ చేస్తూ సీపీ సీవీ ఆనంద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆధ్వర్యంలోని సిట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అడిషనల్ సీపీ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేయనున్నారు. ఇందులో భాగంగా బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో నమోదై న కేసుకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సిట్ సేకరించింది. నిందితుల విచారణ సహా టెక్నికల్ ఆధారాలు సేకరించారు.

కాగా, రెండు పేపర్స్ లీక్ అయినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. నిందితుల నుంచి 24 పేజీల అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ) ప్రశ్నాపత్రాలు, 25 పేజీల టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సిస్ ప్రశ్నపత్రాల జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నట్టు కోర్టుకు తెలిపారు. దాంతో ఏఈ పేపర్‌తోపాటు, టీఈబీఓ పేపర్‌కూడా లీక్ అయినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మంగళవారం పోలీసులు 9 మంది నిందితులను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు నిందితులకు కోర్టు 14రోజల రిమాండ్ విధించింది. దాంతో నిందితురాలు రేణుకను చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించిన పోలీసులు, మిగిలిన 8 మందిని చర్లపల్లి జైలుకు తరలించారు.

కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సిట్ చీఫ్, సిటీ అడిషనల్ సీపీ ఏఆర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. లీక్ అయిన పేపర్స్ ఇద్దరికి మాత్రమే అందినట్టు గుర్తించామని తెలిపారు. నిందితుల ఫోన్స్, ల్యాప్‌టాప్స్‌ను ఇప్పటికే ఎఫ్‌ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించామన్నారు. ఎఫ్‌ఎస్ఎల్ రిపోర్టు ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో ఎంతటివారున్నా వదిలే ప్రసక్తిలేదన్నారు. గ్రూప్-1 పేపర్‌లీక్ అయినట్టు తమ దృష్టికి రాలేదని, దానిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ప్రస్తుతం ఏఈ పేపర్ లీకేజీకి సంబంధించిన కేసు దర్యాప్తుపై పూర్తి దృష్టిసారించామని, అన్ని కోణాల్లో విచారిస్తున్నామని అదనపు సీపీ విక్రమ్‌సింగ్ తెలిపారు.

లీకేజీపై 48 గంటల్లో నివేదిక సమర్పించాలి
టీఎస్పీయస్సీకి రాజ్ భవన్ లేఖ

టీయస్పీయస్సీ నిర్వహించిన, నిర్వహించాల్సిన నియామక పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై 48 గంటల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని రాజ్ భవన్ కోరింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఆదేశాల మేరకు రాజ్ భవన్ కార్యాలయం మంగళవారం టీయస్పీఎస్సీ కార్యదర్శికి లేఖ రాసింది. ఈ అంశాన్ని గవర్నర్ తీవ్రంగా పరిగణించినట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. సమగ్ర విచారణకు ఆదేశించి, నివేదిక సమర్పించాలని తెలిపింది. అసలైన అభ్యర్థుల భవిష్యత్తు, ప్రయోజనాలను కాపాడటానికి, ఇలాంటి దురదృష్ట సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలను తీసుకోవాలని లేఖలో సూచించారు. బాధ్యులందరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బండితో బేజారు...

(మొదటిపేజీ తరువాయి)

కనీసం బీజేపీ ఎల్పీ నేతగా ఆ పార్టీ నియమించలేని పరిస్థితి ఉంది. పదవి ఇస్తే సరిపోదు..స్వేచ్ఛ కూడా ఇవ్వాలనే ఆయన మాటకు ఆ పార్టీలో విలువే లేకుండా పోయింది. ఏ హామీ కూడా ఇవ్వకుండా ఇతర పార్టీల నాయకులు బీజేపీలోకి రావడానికి ఆసక్తి చూపడటం లేదు. ఆలూ లేదు..సూలూ లేదు కొడుకుపేరు సోమలింగం అన్న చందంగా పార్టీకి పట్టులేకున్నా సీట్ల కోసం ఇప్పటి నుంచే కొట్లాడుతున్న పరిస్థితి గ్రూపులకు దారితీస్తున్నది. పాత బీజేపీ నాయకులకు, కొత్తగా పార్టీలో చేరిన వారి మధ్య పరిస్థితి ఎడమొహం పెడమొహంలాగానే ఉంది. ఎక్కడా కలిసిపోని పరిస్థితి. నలుగురు ఎంపీలుంటే ఎవరి దారి వారిదే. ముగ్గురు ఎమ్మెల్యేలదీ అదే పరిస్థితి. అసెంబ్లీలో బీజేపీ ఎల్పీ నేత ఎవరనే విషయాన్ని ఇప్పటిదాకా తేల్చలేదంటనే ఆ పార్టీలో వర్గపోరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కవిత అంటేనే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అగ్గిమీద గుగ్గిలం అవుతారు.

ఒంటికాలిమీద లేస్తారు. అలాంటి అరవింద్...కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండించి బాంబు పేల్చారు. ఇంకో అడుగు ముందుకేసి ఆమెకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది వారిద్దరి మధ్య నెలకొన్న భేదాభిప్రాయాలను ఎత్తిచూపుతున్నది. ఈటల రాజేందర్‌కు, బండిసంజయ్‌కి అస్సలే పొసగడం లేదు. పార్టీలో ఈటలను ఒంటరిని చేసేందుకు బండి వెనుక నుంచి ప్రయత్నాలు చేస్తున్నాడనే ప్రచారముంది. ఇది పసిగట్టిన ఈటల రాజేందర్ బండిపై ఆగ్రహంతో ఉన్నారు. వివేక్ తనపై కావాలనే విష ప్రచారం చేస్తున్నారని ఈటల బహిరంగంగానే వ్యాఖ్యానించారు. బండి, కిషన్‌రెడ్డి, తదితర నాయకులతో ఉన్న విభేదాల వల్ల రాజాసింగ్ అయితే పార్టీ ఆఫీసు వైపే సరిగా రావడం లేదు. ఆయన వ్యవహార శైలి చూస్తుంటే ఆయన బీజేపీలో ఉంటాడా? బయటకు పోతాడా? అనే అనుమానం వ్యక్తమవుతున్నదని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు.

దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు

- ధర్నాలో ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



న్యూఢిల్లీ : దేశంలో దళితులు, ఇతర సామాజిక అణచివేతకు గురైన వర్గాలపై దాడులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపు ఇచ్చారు. మంగళవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, డీఎస్ఎంఎం ఢిల్లీ కార్యదర్శి నత్తు ప్రసాద్ ప్రసంగించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో దళితులు, సమాజంలోని ఇతర అట్టడుగు వర్గాలపై పెరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు వంటి అణగారిన వర్గాల కోసం ఉపాధి హామీ, ఇతర బడ్జెట్ కేటాయింపుల రూపంలో ఆర్థిక అన్యాయాలను ఎత్తి చూపారు. ఉమ్మడి పోరాటం ఆవశ్యకతను తెలియజేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగంపై దాడులు పెరిగాయనీ, దీనిని ప్రతిఘటించాలని స్పష్టం చేశారు.

దళితులు, సమాజంలోని ఇతర సామాజికంగా అణగారిన వర్గాలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని అన్నారు. దేశంలోని దళితులు, అణగారిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన అనేక ఇతర డిమాండ్లతో పాటు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ అమలు, కుల గణన, అట్రాసిటీ నిరోధక చట్టాన్ని మెరుగ్గా అమలు చేయడం వంటి డిమాండ్లను ఈ ఆందోళన తీర్మానించింది. దేశంలో దళితులపై పెరుగుతున్న అఘాయిత్యాలు అధికార ఆర్ఎస్ఎస్-బీజేపీ అనుసరిస్తున్న మనువాద రాజకీయాలకు అద్దం పడుతోందన్న వాస్తవాన్ని ఎత్తిచూపుతూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆర్ఎస్ఎస్-బీజేపీల మత, కులతత్వ పాలనను ఓడించేందుకు ఒక సమగ్ర సామాజిక, ఆర్థిక ఎజెండాతో ఐక్య పోరాటానికి పిలుపునిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది.

డిమాండ్ల సాధన కోసం పోరాటం



ముంబయి : మహారాష్ట్రలో రైతులు, గిరిజనులు కదం తొక్కారు. తమ డిమాండ్ల సాధన కోసం ఉత్తర మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా నుంచి రాష్ట్ర రాజధాని ముంబయి వరకు మార్చ్‌ను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వేలాది మంది రైతులు, గిరిజనులు పాల్గొన్నారు. డిమాండ్ల సాధన కోసం నినాదాలు వినిపించారు. ఉల్లి రైతులకు క్వింటాల్‌కు రూ. 600 తక్షణ ఆర్థిక సాయం, 12 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా, రైతు రుణ మాఫీ వంటి డిమాండ్లు ఇందులో ఉన్నాయి. అలాగే, పత్తి, సోయాబీన్ ధరలు పడిపోవడంపై చర్యలు తీసుకోవాలనీ, ఇటీవల అకాల వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి.



ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. నాసిక్ జిల్లాలోని దిండోరి నుంచి ఈ మార్చ్ ప్రారంభమైంది. 200 కిలోమీటర్ల దూరాన్ని ఈ ర్యాలీ కవర్ చేసి ముంబయికి చేరుకుంటుంది.

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ(ఎం) ఎమ్మెల్యే వినోద్ నికోలే రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, నిరసన చేస్తున్న రైతుల తరఫు ప్రతినిధుల మధ్య మంగళవారం జరగాల్సిన సమావేశం రద్దయిందని తెలిపారు. చాలా మంది నిరసనకారులు కాలి నడకన యాత్ర చేస్తున్నారనీ, తీవ్రంగా నమోదవుతున్న ఎండాకాలం పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం.. రైతులతో తక్షణమే చర్చలు జరపాలని ప్రతిపక్ష నేత, ఎన్సీపీ కీలక నాయకుడు అజిత్ పవార్ రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతు ప్రతినిధులతో బుధవారం ప్రభుత్వం సమావేశం జరుపుతుందని ఆ రాష్ట్ర మంత్రి దాదా భూసే చెప్పారు. ఈ చర్చల్లో రైతులు, గిరిజనులు లేవనెత్తిన సమస్యలపై ఏకాభిప్రాయం వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సాగునీటికి సాయం సున్నా

- నిటీఆయోగ్ చెప్పినా మోడీ 'నో'
- కాళేశ్వరం,పాలమూరుకు ఉత్తచెయ్యి
- బీజేపీ రాష్ట్రాలకే వితరణ

(మొదటిపేజీ తరువాయి)

సహాయ నిరాకరణతో అనుకున్న ఫలితాలు సాధించలేకపోయింది. 2014-15 నుంచి 2022-23 దాకా 153508.97 కోట్లు కేటాయించి, రూ.118647.48 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. నిధుల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తెచ్చుకోవాల్సి వస్తున్నది. బడ్జెటేతర రుణాలను సైతం తెస్తున్నది. కాళేశ్వరం కార్పొరేషన్, పాలమూరు ఎత్తిపోతల, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర కార్పొరేషన్ల ద్వారా అప్పులు సమకూర్చుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం 2015-16 సంవత్సరానికి రూ.80,190.46 కోట్లుగా అంచనా వేయగా, 2020-21లో ఈ అంచనాలు రూ.105790.72 కోట్లుగా పెంచారు. దాదాపు రూ. 25000 కోట్లు అధికమైంది. 2020 మార్చి నాటికి కాళేశ్వరం ప్రాజెక్టుకు అయిన ఖర్చు రూ.63,541.70 కోట్లు. ఇందులో బడ్జెట్ నుంచి రూ.23901.66 కోట్లు ఖర్చు చేశారు. మిగతావి కార్పొరేషన్ ద్వారా రూ.39,640.04 కోట్లు రుణాలు తెచ్చుకున్నవే. కాగా ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి మొత్తం బడ్జెట్ నుంచి రూ.59,413.30 కోట్లు ఖర్చు పెట్టాలని భావించారు. అలాగే రూ. 46377.42 కోట్లు రుణాలు తేవాలని భావిస్తున్నది.

అప్పర్‌భద్రకు రూ.5,300 కోట్లు

త్వరలో కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు ప్రత్యేకంగా కేటాయించింది. కాళేశ్వరం లేదా పాలమూరు రంగారెడ్డికి మాత్రం జాతీయ హోదా ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. పైగా అనుమతులు లేని ప్రాజెక్టుల జాబితాలోకి తోసేసింది. అప్పర్‌భద్రకు మాత్రం ఆఘమేఘాల మీద కేంద్ర జలసంఘం ఆమోదం తెలపడం, అంతే వేగంగా జాతీయ హోదా ఇవ్వడం జరిగిపోయాయి. అప్పర్‌భద్ర నుంచి వచ్చే నీటి ప్రవాహంతో శ్రీశైలం మీద ప్రభావం పడుతుందని తెలుగు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. కేంద్రం వివక్షకు ఇంతకుమించిన ఉదాహరణేం కావాలి ?

కెన్-బెట్వాకూ అంతే..

నదుల అనుసంధానంలో భాగంగా చేపట్టిన కెన్-బెట్వా ప్రాజెక్టుకు సైతం కేంద్రం రూ.3,500 కోట్లు కేటాయించింది. దీంతో బీజేపీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో ఆయకట్టుకు నీరందుతుంది. ఈ పథకానికి మొత్తం నిధులు కేంద్రమే ఇస్తుంది. ఐదారేండ్లల్లో రూ.15 వేల కోట్లకుపైగా ఖర్చు చేయనుంది. ప్రధానమంత్రి ప్యాకేజీ కింద మహారాష్ట్రంలోని విదర్భ ప్రాంతంలోని ప్రాజెక్టులకు రూ.400 కోట్లు కేటాయించారు. ఏఐబీపీ కింద 50 ప్రాజెక్టులకు రూ.3,122 కోట్లు బడ్జెట్లో ప్రతిపాదించారు.ఇందులో తెలంగాణకు మాత్రం రిక్తహస్తమే చూపుతున్నారు.

మళ్లీ అప్పులే

యాక్సీలరేటేడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రొగ్రామ్ (ఏఐబీపీ) కింద వచ్చే నిధులకూ కేంద్రం కోత పెట్టింది. గతంలో ఈ పథకానికి రూ. 4000 కోట్లకుపైగా వచ్చేవి. ఇప్పుడు వాటిని రూ. 2000 కోట్లకు కుదించింది. ఏఐబీపీ పథకం కూడా యూపీఏ సర్కారు చేపట్టిన పథకమే కావడం గమనార్హం. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సర్కారుకు సవాల్ కానుంది. మళ్లీ అప్పులు తెచ్చుకోకతప్పదని ఆర్థిక శాఖ అధికారులు అంటున్నారు.

రూ.1.50 లక్షల కోట్లు కావాలే

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి దాదాపు రూ. 1.50 లక్షల కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా. ప్రభుత్వ అంచనా ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు రూ. 80 వేల కోట్లు అవసరం. ఇప్పటివరకు రూ. 40 వేల కోట్లు ఖర్చు చేశారు. మరో రూ. 40 వేల కోట్లు కావాల్సిందే. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌కు కూడా రూ. 80 వేల కోట్లు వ్యయమవుతుంది. ఇప్పటికీ రూ. 20 వేల కోట్లు పెట్టారు. ఇంకా రూ. 60 వేల కోట్లు తప్పనిసరి. సీతారామాసాగర్ ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు కావాలి. ఇకపోతే చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులకు మరో రూ. 4000 కోట్లు అవసరమని అధికారుల చెబుతున్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులకుగాను ప్రతియేటా ఏడు నుంచి తొమ్మిది శాతం మేర వడ్డీ చెల్లిస్తున్నది.

వచ్చే రెండేండ్లల్లో పూర్తికాకపోతే..

ఈ ప్రాజెక్టులు వచ్చే రెండేండ్లల్లో పూర్తి చేయకపోతే ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పడే అవకాశాలు ఉన్నాయని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. నిధులు విడుదల చేసి సకాలంలో పనులు ముగించకపోతే అంచనా వ్యయాలు మరింత పెరగనున్నాయి. ఎస్ఎస్ఆర్ రేట్లూ అధికమవుతాయి. అదనపు ఆర్థిక భారాలను అడ్డుకోగలం.

పోరాటం చేయాల్సిందే

రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, ప్రాజెక్టులకు నిధుల విషయమై పోరాటం చేయాల్సిందే. ఇది పలు రకాలుగా ఉండాలి. ప్రజా ఉద్యమం ఒకటైతే, న్యాయపోరాటం మరోకటి. తెలంగాణ తెచ్చుకుంది నీళ్లు, నిధులు నియామకాల కోసం. ఇప్పుడు నిధులు, నీళ్ల విషయంలో రాజీపడొద్దు. కేంద్రం మెడలు వంచి మరీ సాధించుకోవాలి. అప్పుడే తెలంగాణకు సార్థకత.

బి. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి
రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజినీర్స్ అసోసియేషన్

గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళన చెందొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షలను నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించిన అంశంపై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 3,80,081 మంది దరఖాస్తు చేశారనీ, వారిలో అక్టోబర్ 16న నిర్వహించిన పరీక్షకు 2,85,916 మంది హాజరయ్యారని వివరించారు. ప్రాథమిక కీని విడుదల చేశామనీ, వాటిపై అభ్యంతరాలను స్వీకరించామనీ అన్నారు. వాటిని సబ్జెక్టు నిపుణులకు పంపించి తుది కీని విడుదల చేశామన్నారు. మల్టీ జోన్, కమ్యూనిటీ వారీగా 1:50 నిష్పత్తిలో 25,150 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ గ్రూప్-1 ప్రిలిమ్స్ రాశారనీ, 103 మార్కులొచ్చిన మాట వాస్తవమేననీ వివరించారు. అయితే ఓఎంఆర్‌లో డబుల్ బబ్లింగ్ చేయడంతో అనర్హత పొందారని అన్నారు. అతని తండ్రి చనిపోతే కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చారని వివరించారు. దేశంలోనే తొలిసారిగా గ్రూప్-1 ప్రశ్నాపత్రంలో మల్టిపుల్ జంబ్లింగ్ ప్రశ్నలతోపాటు జవాబులనూ జంబ్లింగ్ చేశామని చెప్పారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేదన్నారు. తన కూతురు గ్రూప్-1 పరీక్ష రాసినట్టు వదంతులు వస్తున్నాయని అన్నారు. తన కుటుంబ సభ్యులెవరూ ఈ పరీక్ష రాయలేదని స్పష్టం చేశారు. అవసరమైతే చైర్మెన్ పదవిని వదులుకుంటాను తప్ప తప్పుడు పనులకు అవకాశమే లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, నెట్‌వర్క్ ఎక్స్‌పర్ట్ రాజశేఖర్‌రెడ్డి కంప్యూటర్‌లోని ఐపీ అడ్రస్ సహాయంతో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రశ్నాపత్రాన్ని హ్యాకింగ్ చేశారని చెప్పారు. ఈనెల 12న ఏఈ పరీక్ష నిర్వహించాల్సి ఉందనీ, అయితే ఈనెల 11న అనుమానంతో బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. రెండు రోజుల్లోనే పోలీసులు విచారణ చేసి ప్రశ్నాపత్రం లీకైనట్టు నిర్ధారణ చేశారని వివరించారు. దీంతో ప్రవీణ్‌ను సస్పెండ్ చేశామనీ, రాజశేఖర్‌రెడ్డిని ఉద్యోగంలోనుంచి తొలగించామని అన్నారు. రూ.పది లక్షలకు ఆ ప్రశ్నాపత్రాన్ని అమ్మినట్టు తేలిందని చెప్పారు. ఇప్పటికే తొమ్మిది మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారని అన్నారు. ఈ లీకేజీ వ్యవహారంపై పోలీసులు విచారణ చేస్తున్నారనీ, ఎన్ని పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకేజీ అయ్యాయో తేలుతుందని వివరించారు. ఆ నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. అయితే ఏఈ పరీక్షను రద్దు చేయాలా?, కొనసాగించాలా? అన్నదానిపై బుధవారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో నిర్వహించబోయే పరీక్షలకు సంబంధించి కొత్త ప్రశ్నాపత్రాలను తయారు చేస్తామని అన్నారు.

17,134 పోస్టులకు 26 నోటిఫికేషన్లు ఇచ్చాం

రాష్ట్రంలో ఈ ఏడాది కాలంలో 17,134 పోస్టుల భర్తీకి 26 నోటిఫికేషన్లను విడుదల చేశామని జనార్ధన్‌రెడ్డి చెప్పారు. ఇందులో ఏడు నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షలను నిర్వహించామన్నారు. ఎనిమిదో పరీక్ష టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్సీస్ పరీక్ష నిర్వహించాల్సి ఉండగా దాన్ని వాయిదా వేశామని వివరించారు. కొన్ని పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్లు జారీ చేస్తామన్నారు. వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్)లో 30 లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారని వివరించారు. 40 శాఖల్లోని వివిధ కేటగిరీకి 23 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. టీఎస్‌పీఎస్సీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 35 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని అన్నారు. ఉద్యోగ నియామక సంస్థలపై అభ్యర్థులు నమ్మకంతో ఉండాలని సూచించారు. పారదర్శకంగా భర్తీ ప్రక్రియను చేపట్టేందుకే ఈ బాధ్యతను స్వీకరించానని చెప్పారు. దురదృష్టకర వాతావరణంలో మాట్లాడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏఈ ప్రశ్నాపత్రం లీకేజీలో ఉన్న ప్రవీణ్ పర్మినెంట్ ఉద్యోగి, రాజశేఖర్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఓ కానిస్టేబుల్, రేణుక భర్త డీఆర్‌డీవోలో టెక్నికల్ అసిస్టెంట్, ఆమె గురుకులంలో టీచర్‌గా పనిచేస్తున్నారని అన్నారు. ఈ ఐదుగురు ఉద్యోగాలను కోల్పోతారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ డబ్బుకు ఆశపడి ఇలా చేయడం బాధాకరమని అన్నారు. సిబ్బందిని కూడా ఇంట్లోవారిలాగా నమ్ముతామనీ, ప్రతి ఒక్కరినీ అనుమానించలేమని చెప్పారు. అయితే నమ్మిన వారే గొంతుకోశారని అన్నారు. ఈ సంఘటన తర్వాత సైబర్ భద్రత మరింత అవసరమని భావిస్తున్నామని వివరించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నివేదిక వచ్చాక పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

- నేటినుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- ఏర్పాట్లన్నీ పూర్తి : ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,65,022 మంది కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. రాష్ట్రంలో 1,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 1,473 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,473 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 26,333 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని చెప్పారు. జిల్లా కలెక్టర్లు చైర్మెన్లుగా జిల్లా హైపవర్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డీఐఈవో నేతృత్వంలో జిల్లా పరీక్షల కమిటీని నియమించామని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండాలని కోరారు. కింద కూర్చుని పరీక్షలు రాయొద్దనీ, అవసరమైన డెస్కులుండేలా చూడాలని సూచించారు. కరెంటు కోతల్లేకుండా చూడాలని విద్యుత్ శాఖను కోరారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులుండాలని ఆర్టీసీ అధికారులకు సూచించామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలుండాలనీ, వాటి పర్యవేక్షణలోనే ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశ్నాపత్రాలను ఇప్పటికే పరీక్షా కేంద్రాలున్న ప్రాంతాలకు తరలించామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో 040-24600110, 040-24655027 నెంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఎనిమిది వరకు ఉద్యోగులు అందుబాటులో ఉంటారని అన్నారు. జిల్లాస్థాయిలోనూ కలెక్టర్లు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. హాల్‌టికెట్లు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం సోమవారం నుంచే కల్పించామన్నారు. కాలేజీ ఇచ్చిన హాల్‌టికెట్లు లేదా డౌన్‌లోడ్ చేసుకున్న వాటిని పరీక్షలకు అనుమతించాలని సూచించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉంటుందని చెప్పారు. 8.45 నుంచి తొమ్మిది గంటల వరకు ఓఎంఆర్ పత్రాలను అందజేస్తామన్నారు.

తొమ్మిది గంటలకే ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు ఇస్తామని అన్నారు. తొమ్మిది గంటల వరకే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తామనీ, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమనీ స్పష్టం చేశారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్లకు అనుమతి లేదన్నారు. ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లు తెచ్చుకోవద్దని కోరారు. ఆన్‌లైన్ మూల్యాంకనానికి సంబంధించి రెండు సంస్థలు బిడ్లను దాఖలు చేశాయని వివరించారు. వాటిపై కసరత్తు చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామనీ, టెలీమానస్ 14416ను ఏర్పాటు చేశామనీ చెప్పారు.



ప్రయివేటీకరణకు స్వస్తి పలకాలి

- ఖాళీలను భర్తీ చేయాలి
- డీఏను విడుదల చేయాలి
- కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల సమాఖ్య ఆందోళన
- ఉద్యోగుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం : ఎలమారం కరీం

న్యూఢిల్లీ : కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని సీపీఐ(ఎం) రాజ్యసభ పక్ష నేత ఎలమారం కరీం అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు స్వస్తి పలకాలనీ, ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలనీ, పద్దెనిమిది నెలలుగా నిలుపుదల చేసిన డీఏ విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల సమాఖ్య మంగళవారం జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ మార్చ్‌ను చేపట్టింది. ఈ మార్చ్‌ను సీపీఐ(ఎం) ఎంపీ ఎలమారం కరీం ప్రారంభించారు. మినిమమ్ గవర్నమెంట్, మ్యాగ్జిమమ్ గవర్నెన్స్ నినాదాన్ని ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటు శక్తులకు అప్పగిస్తున్నదని విమర్శించారు. రైల్వేలు పూర్తి ప్రయివేటీకరణ అంచున ఉన్నాయని అన్నారు. డీఏ పెంచాలని డిమాండ్ చేస్తూ బెంగాల్‌లో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు దిగా రనీ, మహారాష్ట్రలో నిరవధిక సమ్మె ప్రారంభమైందని అన్నారు. కార్మిక సమ స్యలను లేవనెత్తే వేదికైన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఎప్పుడూ జరగదనీ, ప్రధాని మోడీకి కార్మికుడనే పదం కూడా వినిపించటంలేదని అన్నారు. లేబర్ కోడ్‌లతో పారిశ్రామిక రంగంలో కేంద్రం ఇదే విధమైన హానికరమైన విధానాన్ని అనుసరిస్తున్నదని విమర్శించారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు వారి వర్గ రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడాలని అన్నారు. దేశ సంపదకు అసలైన నిర్మాతలైన శ్రామిక సమాజం దేశం కోసం ఐక్యంగా నిలబడాలని ఎలమారం కరీం పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీకుమార్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఎఆర్ సింధు, నేతలు ఆర్. ఎన్ పరేషర్, సుభాష్ లాంబా, శిస్కాంత్ రాయ్, తపన్ బోస్, జనార్దన్ మజ్ముందార్ తదితరులు మాట్లాడారు.

డ్రగ్స్ కేంద్రంగా గుజరాత్

- రూ.5300కోట్ల విలువజేసే డ్రగ్స్ పట్టివేత
- 102మంది అరెస్టు : రాష్ట్ర ప్రభుత్వం



గాంధీనగర్: గత ఏడాదిన్నర కాలం లో రూ.5300 కోట్ల విలువజేసే డ్రగ్స్‌ను గుజరాత్ పోలీసులు సీజ్ చేశారని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో 102మందిని అరెస్టు చేసినట్టు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో చర్చ సందర్భంగా ఈ సమాచారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీని ప్రకారం, ఆగస్టు 2021 నుండి ఫిబ్రవరి 2023 వరకు దాదాపు రూ.5300 కోట్ల విలువజేసే వెయ్యి కిలోల డ్రగ్స్‌ను గుజరాత్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 56మంది విదేశీయులతో సహా 102మంది నిందితులను పట్టుకున్నారు. సముద్ర మార్గం గూండా హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలు దేశంలోకి డంప్ అవుతున్నాయనే అంశాన్ని గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమిత్ చావ్డా, అర్జున్ మోదావాడియా, ప్రవీణ్‌కుమార్, ఉదయ్ కంగద్ సభలో లేవనెత్తారు.

ముంద్రా పోర్ట్ వేదికగా మార్చినవారిపై విచారణ జరపండి : కాంగ్రెస్

అదానీ గ్రూప్ నిర్వహించే ముంద్రా పోర్ట్ నుంచి గతంలో మాదక ద్రవ్యాలు పెద్దమొత్తంలో పట్టుబడ్డాయి. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, డ్రగ్స్ స్మగ్లింగ్‌కు ముంద్రా పోర్ట్‌ను వేదికగా మార్చిన వారి పాత్రపై బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే చావ్డా డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మోదా వాడియా నార్కోటిక్స్ బ్యూరో సమాచారాన్ని ప్రస్తావిస్తూ.. 10శాతం డ్రగ్స్ మాత్రమే పట్టుబడుతోందని, 90శాతం దేశంలోకి ప్రవేశిస్తోందన్నారు. సరైన నిఘా నెట్‌వర్క్ లేకపో వటంతో గుజరాత్ పోలీస్ డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్ట లేకపోతున్నదని మోదా వాడియా విమర్శించారు.

వీ6, వెలుగు పత్రికలపై బీఆర్ఎస్ బహిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను అడుగడుగునా దెబ్బతీస్తూ, భారతీయ జనతా పార్టీకి కొమ్ముకాస్తున్న వీ6 ఛానల్, వెలుగు దినపత్రికలను బహిష్కరించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజాస్వామంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సదరు మీడియా సంస్థలు భారతీయ జనతా పార్టీ జేబు సంస్థలుగా మారి అబద్ధాలు, అసత్యాలు, కట్టుకథలతో బీఆర్ఎస్ పార్టీపై, తెలంగాణ రాష్ట్రంపైన విషం చిమ్మడమే ఏకైక ఎజెండాగా పని చేస్తున్నాయని ఆరోపించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మీడియా సమావేశాలకు వీ6, వెలుగు మీడియా సంస్థలను అనుమతించకూడదని నిర్ణయించింది. దాంతో ఈ సంస్థలు నిర్వహించే చర్చలతో సహా ఎలాంటి కార్యక్రమాల్లోనూ పార్టీ ప్రతినిధులు ఎవరూ పాల్గొనకూడదని నిర్ణయం తీసుకుంది. బీజేపీ గొంతుకగా మారి, విశ్వసనీయత కోల్పోయిన ఈ మీడియా సంస్థల అసలు స్వరూపాన్ని, ఎజెండాను తెలంగాణ ప్రజలు గ్రహించాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.

బహిష్కరణ సరికాదు : టీడబ్ల్యూజేఎఫ్

వీ6 న్యూస్‌ఛానల్, వెలుగు దినపత్రికలను బహిష్కరించాలనే బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాన్ని టీడబ్ల్యూజేఎఫ్ ఖండించింది. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, బి.బసవపున్నయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ నిర్ణయం అప్రజాస్వామికమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను నిరంతరం చైతన్యం చేసిన మీడియాపై బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం, అవహేళన చేయటం సరిగాదని పేర్కొన్నారు. ప్రశ్నను అడ్డుకోవడం ఎవరివల్లా సాధ్యం కాదని స్పష్టం చేశారు.


(ఫైల్)

26న కాందార్‌లోహాలో బీఆర్ఎస్ బహిరంగ సభ

- పాల్గొననున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్రలోని కాందార్‌లోహాలో మార్చి 26న బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నది. ఆ సభలో పెద్ద ఎత్తున చేరికలు ఉండనున్నాయి. మహారాష్ట్ర నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి చెందిన పలువురు సీనియర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరేందుకు ముందుకొచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్‌తో ఎన్సీపీ కిసాన్ సెల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శంకరన్న ధోంగే, మాజీ ఎమ్మెల్యే నాగనాథ్ గిసేవాడ్, ఎన్సీపీ నాందేడ్ జిల్లా అధ్యక్షులు దత్తా పవార్, ఆ పార్టీ యువజన విభాగం కార్యదర్శి శివరాజ్ ధోంగే, అధ్యక్షులు హన్మంత్ కళ్యాంకర్, నాందేడ్ అధ్యక్షుడు శివదాస్ ధర్మపురికర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మనోహర్ పాటిల్ భోసికర్, అధికార ప్రతినిధి డాక్టర్ సునీల్ పాటిల్, లోహ అధ్యక్షులు సుభాష్ వాకోరే, కాందార్ అధ్యక్షులు దత్తా కరమాంగే, జిల్లా పరిషత్ సభ్యులు, అడ్వకేట్ విజయ్ ధోండగే, ప్రవీణ్ జాతేవాడ్, సంతోష్ వార్కాడ్, స్వాప్నిల్ ఖీరే సమావేశమయ్యారు.బీఆర్ఎస్ పార్టీ విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణపై సీఎం కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. భారీ బహిరంగ సభ నేపథ్యంలో పెద్ద ఎత్తున తమ అనుచరులు, కార్యకర్తలతో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే నాందేడ్ ఇన్‌చార్జి జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

దేశానికి బీజేపీ ప్రమాదకరం

రాష్ట్రంలో అధికారం కోసం రాజకీయంగా దిగజారిన కాషాయ పార్టీ: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- మాడుగులపల్లిలో సీపీఐ(ఎం) కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ -వేములపల్లి

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తోందని, దేశానికి ప్రమాదకరంగా మారిందని, రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడానికి రాజకీయ వ్యభిచారానికి సిద్ధమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్మించిన సీపీఐ(ఎం) కార్యాలయ భవనాన్ని మంగళవారం కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డితో కలిసి తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరంగా మారిందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. దేశాన్ని రావణ కాష్టంలా మార్చాలన్న ఉద్దేశంతో కేంద్రం ఉందని.. ఈ ప్రమాదాన్ని కమ్యూనిస్టులు గుర్తించారన్నారు. తెలంగాణలోనూ అధికారం కోసం బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ నాయకులకు బలంగా పనిచేయాలని, వివిధ పార్టీల నాయకులను లొంగదీసుకోవాలని చెప్పారని, వారికి కాంట్రాక్టులు, డబ్బులు వంటి వాటిని ఇస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కార్యక్రమాలతో బీజేపీ రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతోందన్నారు. బీజేపీ సిద్ధాంతం ప్రకారం దేశంలో హిందువులు మాత్రమే ఉండాలని, మిగిలిన వారు రెండో తరగతి పౌరులుగా గుర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీని ప్రశ్నిస్తున్నారని తప్పు చేయకున్నా తప్పు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే కవితపై దాడి చేస్తున్నారన్నారు.







తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేసిందన్నారు. బీజేపీని గద్దెదించాలని బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నం చేస్తుండటం వల్లే కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. రాబోయే కాలంలో బీజేపీ ప్రభుత్వం గుట్టు, బండారం బయట పెట్టడానికి సీపీఐ(ఎం) 33 జిల్లాల్లో 15 రోజులపాటు జన చైతన్య యాత్ర నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండా ఉద్యమ శక్తిగా ప్రాముఖ్యమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. సీపీఐ(ఎం) కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా పోరాటాలకు నిలయంగా నిలవాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సక్రమంగా జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సీపీఐ(ఎం) పాత్ర ఎంత అవసర ముందో మునుగోడు ఎన్నికలు తెలిపాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, గోవర్ధన, నాయకులు గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5 చలో ఢిల్లీకి తరలిరండి

- కార్మికవర్గానికి సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ హేమలత పిలుపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ హేమలత పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నదనీ, అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసి లాంటి అనేక సంస్థల ద్వారా లబ్ది చేకూరుస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్లకు పన్నులు తగ్గించి సామాన్యులపై గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచి భారాలు మోపడం దుర్మార్గమన్నారు. పంటకు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ చేయకపోవడంతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లతో పూర్తిగా హరిస్తోందన్నారు. విద్యుత్ సవరణ చట్టం వల్ల సామాన్యులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు లక్షల కోట్ల రూపాయల ఆస్తులను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరిట కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య తదితరులు ప్రసంగించారు. భూపాల్, జె.వెంకటేశ్, జయలక్ష్మి, పద్మశ్రీ, ఎస్.రమ, టి.వీరారెడ్డి, సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

త్రిపుర కార్మికోద్యమానికి సంఘీభావం

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తరువాత వామపక్షాల, కార్మిక, ప్రజా సంఘాల కార్యకర్తలపై దాడులు చేస్తూ కార్యాలయాలను ధ్వంసం చేయడాన్ని సీఐటీయూ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. త్రిపుర కార్మికోద్యమానికి సంఘీభావం తెలిపింది. రాష్ట్ర కమిటీ తరఫున రూ.2 లక్షలు సంఘీభావ నిధిని అఖిల భారత అధ్యక్షులు కె. హేమలత గారికి అందజేసింది.

కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎల్బీస్టేడియం ప్రాంగణంలో నటరాజ్ అకాడమీ, మాంగళ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కేసీఆర్ ఉండగా, ప్రతి రోజూ కళా పండుగే' అనే నినాదంతో జానపద కళాకారుల తలపెట్టిన మహార్యాలీని వినోద్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను, కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదరిస్తున్నదన్నారు. జానపద కళలు కనుమరుగు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. యాదగిరిగుట్ట, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, కొమురవెల్లి వంటి ప్రధాన ఆలయాల్లో సాయంత్రం పూట భక్తుల కోసం కళా రూపాలను ప్రదర్శించేందుకు జానపద కళాకారులకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, నిర్వాహకులు బత్తిని కీర్తి లతాగౌడ్, గిరి, శరత్‌చంద్ర, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో మందుల దందా

- వెంటనే విచారణ జరిపించాలి: ఆరోగ్యశ్రీ సీఈఓకు సీపీఐ(ఎం) నగర కమిటీ మెమోరాండం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో మందుల దందాపై విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆరోగ్యశ్రీ సీఈఓకు మెయిల్ ద్వారా మెమోరాండం పంపించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ వెల్లడించిన అంశాలు ఇలా ఉన్నాయి..

- ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలో పేషెంట్లకు అవసరం లేకపోయినా 15 నుంచి 20 రకాల మెడిసిన్స్ 30, 60, 90 క్వాంటిటీలో ప్రిస్క్రిప్షన్ రాయిస్తూ సరఫరా చేస్తున్నారు. నిజంగా పేషెంట్లు ఈ మందులను వాడితే అనారోగ్యానికి గురవుతారు. కానీ, ప్రిస్క్రిప్షన్లలో రాసే మందులను అక్కడ పనిచేసే కొందరు బయటి దుకాణాల్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.
- ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీల లాభాల కోసం అధిక మొత్తంలో మెడిసిన్స్ ఇండెంట్ పెట్టి తెప్పిస్తున్నారు. వాటిని పేషెంట్ల పేరుతో పెద్ద మొత్తంలో రాయించి బయట అమ్ముకుంటున్నారు.
- ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వెల్‌నెస్ కేంద్రాల్లోని ఫార్మాసిస్టులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏ మందులు ఎంత మొత్తంలో ఇండెంట్ పెట్టాలో ఆదేశాలు జారీచేస్తున్నారు. వెల్‌నెస్ కేంద్రాల్లో జేఈఓ, హెచ్‌ఆర్‌ల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తోంది. తాము చెప్పినట్టు ఫార్మాసిస్టులు ఇండెంట్‌లు పెట్టకపోతే హెచ్‌ఆర్, జేఈఓలు నేరుగా ఇండెంట్‌లు పెట్టి తెప్పించుకుంటున్నారు.
- ఇన్‌చార్జీల నిర్లక్ష్యం కారణంగా డయాలసిస్ పేషెంట్ల కోసం ఇటీవల ప్రత్యేకంగా ఇండెంట్లు పెట్టి తెప్పించిన రూ.3లక్షల విలువైన మెడిసిన్స్ కాలం చెల్లిపోయాయి.
- డాక్టర్ల దగ్గర అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వ్యక్తులు పేషెంట్లకు వివిధ టెస్టుల కోసం ప్రయివేటు ఆస్పత్రులకు పంపిస్తూ నజరానాలు పొందుతున్నారు.
- ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రానికి ప్రతి రోజూ 300 మంది పేషెంట్లు వస్తుంటారు. 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇన్‌చార్జీలు, డాక్టర్లు, అందరూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే. ఒక్క ప్రభుత్వ డాక్టర్‌నూ నియమించకపోవడం చాలా బాధాకరం. బాధ్యతలేని ఇన్‌చార్జీల కారణంగా వెల్‌నెస్ కేంద్రాలు నియంత్రణ కోల్పోతున్నాయి.
- ఈ కేంద్రంలో వయసుపైబడిన డాక్టర్లు ఎక్కువ మంది ఉన్నారు. వీరు ట్రీట్‌మెంట్ చేయలేకపోతున్నారు. యువ వైద్యులను నియమించాలి. అవసరానికి మించి డెంటల్ డాక్టర్లు ఉన్నారు. వీరికి ఇతర బాధ్యతలు అప్పగించి అవసరమైన స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలి.
- టెస్టుల కోసం ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలోనే 'తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్' ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ డాక్టర్లను వెల్‌నెస్ కేంద్రానికి ఇన్‌చార్జీలుగా నియమించాలి. మందుల దందా చేస్తున్న ఇన్‌చార్జీలను తక్షణమే తొలగించాలి.

ఇండ్ల హామీని నిలబెట్టుకోండి..

- లేదంటే ఆక్రమించిన స్థలాల్లో నిర్మాణం చేపడతాం
- రియల్టర్లను వదిలి పేదలపై ప్రతాపమా?: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు చేసిన వాగ్దానం మేరకు అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని, లేకపోతే పోరాటాల ద్వారా ఆక్రమించుకున్న స్థలాల్లోనే ఇండ్ల నిర్మాణం చేపడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి. సాగర్ హెచ్చరించారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్టర్లు ఆక్రమించుకుంటే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారిక యంత్రాంగం.. పేదలు తల దాచుకునేందుకు గుప్పెడు జాగా అడిగితే పూర్తి నిర్బంధం ప్రదర్శిస్తోందని విమర్శించారు. నెహ్రూనగర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న పేదలకు భరోసా కల్పించారు. ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని దీమానిచ్చారు.

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్ గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను సాగర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, గృహలక్ష్మి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ అధికారులు పేదల గుడిసెల జోలికి రావొద్దని హెచ్చరించారు. దమ్ముంటే ప్రభుత్వ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వాటిని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చినట్టుగా పేదల ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం చేయాలని కోరారు. ఇక జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు తాళాలు వేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే అర్హులైన పేదలకు ఆ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

నగరాల్లో ఇండ్ల స్థలాలు కేటాయించడంపై నిషేధం విధిస్తూ తెచ్చిన ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. సర్కారు ఓ వైపు బహుళ జాతి కంపెనీలకు ప్రభుత్వమే భూములను సేకరించి భూబ్యాంక్ ఏర్పాటు చేస్తోందని, మరోవైపు పేదలకు ఇవ్వాలంటే భూములు లేవని చెబుతోందని వాపోయారు.

కోనేరు రంగారావు కమిటీ.. పెత్తందారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను బయటికి తీస్తే ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమిని ఇవ్వొచ్చని నివేదించిందని, కానీ ఆ నివేదికను బయటకు రాకుండా సర్కారు తొక్కి పెట్టిందని ఆరోపించారు. దీన్ని బట్టి సర్కారుకు పేదలపై ఉన్న ప్రేమను అర్థం చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, గుడిసె వాసులు పాల్గొన్నారు.

పుస్తకం మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దుతుంది



- వ్యక్తి మస్తిష్కాన్ని కదిలించే శక్తి పుస్తకానికే ఉంది : నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి
- నవతెలంగాణ పుస్తక ప్రదర్శన ప్రారంభం

నవతెలంగాణ - నల్లగొండ

కంప్యూటర్ మనిషిని యంత్రంగా మారిస్తే, పుస్తకం మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దుతుందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. పుస్తకాలు మస్తిష్కానికి వ్యాయామం లాంటివన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ముందు ఏర్పాటు చేసిన నవతెలంగాణ పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుస్తక ప్రపంచాన్ని ఎంత విస్తరిస్తే అన్ని జ్ఞాన సమాజాలు నిర్మితమవుతాయన్నారు. సమస్యల్లో, దుఃఖ సమయాల్లో జీవన గమ్యం కోసం తపించే వ్యక్తులకు పుస్తకాలు లైట్ హౌస్‌లా మంచి దారి చూపిస్తాయన్నారు. పుస్తకాలు ఆత్మశక్తిని ప్రసాదిస్తాయన్నారు. చరిత్ర గతిని మార్చిన పుస్తకాలే తెలంగాణ సమాజాన్ని మార్చగలిగాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాసిన 'తెలంగాణలో ఏం జరుగుతుంది' అన్న పుస్తకం రాష్ట్రంలో గొప్ప కదలిక తీసుకొచ్చిందన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు, ప్రజలకు తెలంగాణ సాహిత్యం దిశ నిర్దేశం చేసింది పుస్తకాలే అన్నారు. 14 ఏండ్ల తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఉన్న శక్తి, అక్షర శక్తి, పుస్తక శక్తి మాత్రమేనని నమ్మేవాడినని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, నాయకులు పంకజ్ యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్, గోగు శ్రీనివాస్, నవతెలంగాణ బుక్‌హౌస్ మేనేజర్ కృష్ణారెడ్డి, నవతెలంగాణ బుక్‌హౌస్ ఇన్‌చార్జి రఘువరణ్, నల్లగొండ డెస్క్ ఇన్‌చార్జి మేకల వరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమి కొడతాం

- ఏప్రిల్ 14 నుంచి 'బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో' పాదయాత్ర
- ఈ నెల 25 నుంచి వరంగల్‌లో ప్రజాపోరు యాత్ర: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-హనుమకొండ

దేశంలో అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఏదో ఒక రోజు జైలుకెళ్లడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ తొమ్మిదేండ్ల పాలనలో దేశంలో సుమారు రూ.150 లక్షల కోట్ల అవినీతి జరిగిందన్నారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన మతతత్వ, అవినీతికర పార్టీ బీజేపీ అని, విజయ్ మాల్యా, లలిత్ మోడీ నుంచి మొదలుకొని ఆదానీ వరకు లక్షల కోట్లు కొల్లగొట్టిన వారేనని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో చిన్న చిన్న కుంభకోణాలకే ప్రభుత్వాలు కూలిపోయాయని, నేడు లక్షల కోట్ల అవినీతి జరిగినా పట్టింపు లేదన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకు రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేశారని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎన్నికలు జరుగనున్న డిల్లీ, తెలంగాణ రాష్ట్రాలపై దృష్టి సారించి సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఢిల్లీ మద్యం కుంభకోణంలో బినామీల పాత్ర ఉందంటూ డిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా, ఎమ్మెల్సీ కవితను విచారిస్తున్నారని అన్నారు. అందుకే 'బీజేపీ కో హటావో..దేశ్ కో బచావో' పేరుతో ఏప్రిల్ 14 నుంచి మే 18 వరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఇంటింటికీ పాదయాత్ర చేపట్టినట్టు తెలిపారు. అలాగే జూన్ 1 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి జూలై మొదటి వారంలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రం నుంచి బీజేపీని తరిమి కొట్టడమే తమ లక్ష్యమని, ఆ పార్టీని రానున్న ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితం చేస్తామన్నారు. సీపీఐ, సీపీఐ(ఎం) కలిసే ఎన్నికల్లో ముందుకు సాగుతాయని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 5 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీపీఐ ప్రజాపోరు యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. పాదయాత్రను 25న బయ్యారంలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభిస్తారని, ఏప్రిల్ 5న హనుమకొండలో పాదయాత్ర ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డి. రాజా హాజరవుతారని తెలిపారు. విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, బి. విజయ సారథి, సిహెచ్ రాజారెడ్డి, కె. రాజ్ కుమార్, తోట మల్లికార్జున రావు, నాయకులు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, మండ సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి నోటీసులు

- బుధవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలి

రాష్ట్ర మహిళా కమిషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సోమవారం నోటీసులు జారీ చేసింది. మార్చి 15న ఉదయం 11 గంటలకు కమిషన్ ఎదుట హాజరుకావాలని సంజయ్‌కి సూచించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకున్న మహిళా కమిషన్ ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. ఆయన చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. మహిళా కమిషన్ ముందు హాజరుకాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఉన్న నేపథ్యంలో 15న విచారణకు హాజరుకాలేనని బండి సంజయ్‌కుమార్ మహిళా కమిషన్‌కు లేఖ రాశారు. ఈ నెల 18న సమయమిస్తే ఆరోజు విచారణకు హాజరవుతానని తెలిపారు.

కాళేశ్వరం రీ డిజైన్ రద్దు చేస్తాం

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మిస్తాం : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి
- పనులు పరిశీలించి భూ నిర్వాసితులతో మాట్లాడిన రేవంత్



నవతెలంగాణ-మోపాల్

సీఎం కేసీఆర్ కేవలం ధనార్జన కోసం మంచిప్ప రిజర్వాయర్‌ను రీ డిజైన్ చేయిస్తున్నారని, ఆయకట్టు విస్తీర్ణం పెరగకున్నా ముంపు పెంచాడని, దాంతో ఊర్లకు ఊర్లే ముంపునకు గురవుతున్నాయని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇంత జరుగుతున్నా స్థానిక రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ముంపు బాధితుల గోడు ఇప్పటి వరకు వినలేదని, బాధితులను పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాగానే రీ డిజైన్ పనులు నిలిపివేసి పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రారంభించిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర మంగళవారం నిజామాబాద్ జిల్లా మంచిప్ప మీదుగా డిచ్‌పల్లి వరకు సాగింది. ముందుగా మంచిప్ప మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఇందరూర్ తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యం చేస్తున్న మాపల్లె వాసులను అభినందించారు. అనంతరం కాళేశ్వరం ప్యాకేజీ 21 పనుల్లో భాగంగా మంచిప్ప రిజర్వాయర్‌ను పరిశీలించారు. ముంపు బాధిత కమిటీ నాయకులతో, బాధితులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల పూర్వాపరాలను వివరించారు. 'తెలంగాణలో ఎత్తైన ప్రాంతాలు ఉన్నాయని, కరువు ప్రాంతాలకు ప్రాజెక్టుల ద్వారానే సాగునీరు అందించగలమనే ఉద్దేశ్యంతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం ప్రారంభించారని తెలిపారు. రూ.38 వేల కోట్లతో 14 లక్షల ఎకరాలకు నీరు అందించాలని ఉద్దేశంతో పనులు చేపట్టారన్నారు. అందులో భాగంగానే ఈ కొండం చెరువు (మంచిప్ప రిజర్వాయర్) 0.84 టీఎంసీల కెపాసిటీతో 21వ ప్యాకేజీ పనులను రూ.1200 కోట్ల అంచనాతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పనులు ప్రారంభించి దాదాపు రూ.900 కోట్లు ఖర్చుపెట్టి 70 నుంచి 80 శాతం పనులను పూర్తి చేశామన్నారు. 1,83,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా పనులు చేపట్టామని, కెపాసిటీ పెంచేందుకు ప్రయత్నిస్తే ఇక్కడున్న దళిత, గిరిజనులు, బీసీలు వారి భూములు కోల్పోతారని, తండాలు ముంపునకు గురవుతాయని గ్రామాలను కూడా తరలించాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో అదే కెపాసిటీతో పనులు చేపట్టినట్టు తెలిపారు. కానీ సీఎం కేసీఆర్ కేవలం ధనార్జన కోసమే ఈ ప్రాజెక్టు రీ డిజైన్ చేపడుతున్నారని ఆరోపించారు. రీ డిజైన్‌తో ముంపు పెంచిన సాగు విస్తీర్ణం మాత్రం అంతంత మాత్రంగానే పెంచారని ఆరోపించారు. ఇంకో ఆరు నెలల్లో ఎలక్షన్ల కోసం ఓట్ల అడగడానికి స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వస్తే.. మంచిప్ప గ్రామంలోకి రానివ్వద్దని, తమ గ్రామానికి వస్తే వాతలు పెట్టాలని సూచించారు.

సొంత నియోజకవర్గంలో, ప్రజల భూములు పోతుంటే ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నాడని, కనీసం వాళ్ళని పరామర్శించే నైతిక విలువ కూడా లేదని అన్నారు. ముంపు బాధితులపై నమోదు చేసిన కేసులను వచ్చే సంవత్సరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎత్తివేసి, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, నాయకులు ఇరవత్రి అనిల్, నగేష్ రెడ్డి, గంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి కే సూర్య రెడ్డి, శేఖర్ గౌడ్, మోపాల్ మండల అధ్యక్షుడు బూస్నీ రవి, తదితరులు పాల్గొన్నారు.

తుల్జా భవాని మాతృ ఉత్సవాలకు పి.కార్తిక్ రెడ్డికి ఆహ్వానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలోనీ తుల్జాభవాని మాత 11వ వార్షికోత్సవం ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పట్లోళ్ల కార్తిక్‌ను తుల్జా భవాని దేవాలయ చైర్మెన్ సందీప్ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ జహంగీర్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

చైతన్యపురి డివిజన్ నీటి సమస్యను పరిష్కరించాలి

రంగా నర్సింహగుప్త



నవతెలంగాణ-ఎల్బీనగర్
ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్‌లోని డ్రైనేజీ లైన్స్ సమస్యను పరిష్కరించాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త మంగళవారం వాటర్ వర్క్స్ ఎండి దానకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. చైతన్యపురి డివిజన్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు. పలు చోట్ల డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు అన్నారు. వేసవి కాలంలో లో ప్రేషర్ సమస్యను పరిష్కరించాలని ఎండి దానకిషోర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే జైలుకే

ఏసీపీ జి.శంకర్‌రాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో
మైనర్లకు వాహనాలివ్వొద్దని, వాహనాలిచ్చినవారు సైతం జైలుకెళ్లే ప్రమాదముందని, ప్రతి వాహనదారులు లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలపై ఇతరులకు సైతం అవగాహన కల్పించాలని ఏసీపీ జి.శంకర్‌రాజు తెలిపారు. మంగళవారం రామ్‌నగర్‌లోని సన్‌డిగ్రీ కాలేజీలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన రోడ్ సేఫ్టీతోపాటు (గుర్తులు) చిహ్నాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడమే కాకుండా ఇతరులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించేవిధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కూడళ్లవద్ద సిగ్నల్స్ జంప్ చేయొద్ద న్నారు. స్టాప్ లైన్‌కు ముందే వాహ నాలను ఆపాలని, ఫ్రీ లెఫ్ట్‌ను ఆక్రమించొద్దన్నారు. ఏసీపీని కాలేజీ యాజ మాన్యం ఘనంగా సన్మానిం చింది. ఈ కార్యక్రమంలో టీటీఐ బేగంపేట్ సిబ్బంది పద్మావతి, కృష్ణా, మాజీద్, కాలేజీ డీన్ సత్యప్రభు, ప్రిన్సిపాల్ రవికుమార్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో
టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్‌లు మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, ఎల్లప్పుడూ ఉద్యోగుల శ్రేయస్సు కోరే మనసున్న మహారాజు అని కొనియాడారు. ఆయన అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేండ్లు సుఖ సంతోషములతో, ఆయురారోగ్యాలు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు బి.శంకర్, సెంట్రల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వేసవి సెలవులకు ఊర్లకు వెళ్తున్నారా? జాగ్రత్తలు పాటించండి

స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి
వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ



నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు వేసవి సెలవులకు ఊర్లకు వెళుతుంటే తగిన జాగ్రత్తలు తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని వనస్థలిపురం సీఐ కె.సత్యనారాయణ తెలియజేశారు. మంగళవారం నవ తెలంగాణ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు ఊర్లు వెళుతున్నవారు పక్కింటి వాళ్లకు సమాచారం అందించడంతోపాటు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అదేవిధంగా ఇంటి మెయిన్ డోర్‌కు తాళాన్ని తిప్పి వేసి కెట్టన్ అమర్చుకోవాలి అన్నారు. ప్రతి ఇంట్లోనూ, బయట సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. వేసవికాలం ఎక్కువ శాతం మేడపైన నిద్రించడానికి వెళ్తుంటారని.. అలాంటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎక్కువ శాతం నగలు, నగదును ఇంటిలో లేనప్పుడు బ్యాంకు లాకర్‌లో గాని, తమ వెంట తీసుకు వెళ్ళటం ఎంతో మంచిదన్నారు.

మహిళలు నగలు ధరించి బయటికి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ కే.సత్యనారాయణ కోరారు. బయటికి వచ్చినప్పుడు పైట చెంగును మెడ చుట్టూరు కప్పి ప్రయాణం చేయాలన్నారు. ఎవరైనా తనను ఫాలో చేస్తున్నట్టు గమనిస్తే వెంటనే 9490617179, 9705799888 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. బయటకు వచ్చినప్పుడు మెడలో నగలను ఎంత తక్కువ వేసుకుంటే అంతమంచిదన్నారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

జలమండలి జీఎంతో కలిసి కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బోడుప్పల్
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లో మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారంనాడు జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డితో కలిసి కాలనీల్లో పర్యటించారు. అనంతరం కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో మంచినీటి సరఫరాలో తీవ్రమైన ఇబ్బందులు వస్తున్నాయని సదరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకునేలా కాలనీల్లో పర్యటించామని తెలిపారు. జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపి రోజు తప్పించి రోజు మంచినీటి సరఫరా అయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి బోడుప్పల్ డివిజన్ మేనేజర్ మమత, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు సురేందర్ రెడ్డి, అలీ, రాజ్‌కుమార్, ప్రవీణ్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నామాల రవి, నాగరాజు, సుదర్శన్, రాజేందర్, సర్వోత్తం రెడ్డి, బాల్‌రాజ్, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



నవతెలంగాణ - సరూర్‌నగర్
చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధి లోని విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న గ్రీన్‌హిల్స్ కాలనీ ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం లో అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నిస్తుండడంతో గమనించిన స్థాని కులు కేకలు వేయడంతో గుర్తుతెలి యని దుండగులు పరారయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడం తో, సంఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీఎం హోమ్ మెట్రో స్టేషన్ పక్కనే ఉండడం, నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతం కావడం గమనార్హం.

ఆన్‌లైన్ షాపర్లను జాగృతం చేసేందుకు ఐఐపీఏతో అమెజాన్ ఒప్పందం

నవతెలంగాణ - హైదరాబాద్
ఆన్‌లైన్ షాపర్లకు జాగృతి, సాధికారతను కల్పించేందుకు సంయుక్తంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్(ఐఐపీఏ), అమెజాన్ ఇండియాలు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశాయి. సురక్షిత షాపింగ్ పద్ధతులపై అవగాహన కల్పించడం, ఆన్‌లైన్‌లో వంచకుల నుంచి వినియోగదారులను రక్షించడం ద్వారా వారి భద్రతను మెరుగుపరచడమే ఒప్పందం యొక్క లక్ష్యంగా ఇరుసంస్థలు ప్రకటించాయి. ప్రతిపాదిత ప్రాజెక్ట్ ఆన్‌లైన్ వినియోగదారులను రక్షించేందుకు, ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్లను మరింత సురక్షితమైనదిగా చేసేందుకు అదనపు పరిష్కారాలను కనుగొనేందుకు, ఒత్తిడి సమస్యలను గుర్తించేందుకు ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, సంయుక్త పరిశోధనలు ఇందులో భాగంగా ఉంటాయి. ఈ సందర్భంగా అమెజాన్ ఇండియా పబ్లిక్ పాలసీ ఉపాధ్యక్షుడు చేతన్ కృష్ణస్వామి మాట్లాడుతూ అమెజాన్ సెంటర్ ఆఫ్ కన్స్యూమర్ స్టడీస్ తరపున ఐఐపీఏతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంగా ఉందన్నారు. సురక్షితమైన షాపింగ్ వాతావరణాన్ని సృష్టించడం అనేది మా మార్కెట్ ప్లేస్‌లో వినియోగదారుని నమ్మకాన్ని గెలుచుకుని, దాన్ని నిలుపుకోవడం చాలా కీలకమైన అంశమన్నారు.

ఫై-జిటల్ ఎక్సలెన్స్ సాధించినందుకు 13 మంది రిటైలర్లకు సన్మానం

నవతెలంగాణ - హైదరాబాద్
కేంద్రం చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణే ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ప్రారంభించిన ఫోరమ్ ఫర్ ఇంటర్నెట్ రిటైలర్స్, సెల్లర్స్ అండ్ ట్రేడర్స్, మొదటి సారిగా విజయపథంలో కొనసాగుతున్న సెల్లర్స్‌లో విజేతలుగా నిలిచిన వారికి అవార్డులు ప్రకటించింది. ఈ సమావేశంలో ఇండియా ఎస్ఎంఇ ఫోరమ్ అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ.."విలక్షణమైన పరిష్కారాలతో వినియోగదారులకు షాపింగ్ అనుభవాన్ని విప్లవాత్మకంగా మార్చిన ఈ అసాధారణమైన రిటైలర్‌లను గౌరవించడం మాకు ఆనందంగా ఉంది. ముందుకు కొనసాగే వారి ప్రయాణంలో, వారికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందించాలని మేము కోరుకుంటున్నాము. వారు తమ రంగాలలో లక్షలాది మంది ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆశిస్తున్నాము" అని తెలిపారు.

మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



నవతెలంగాణ - మీర్‌పేట్
మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా చివరి రోజు మీర్‌పేట్ బుర్జు నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. నేడు

- మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్

ప్రభుత్వాలు కల్పిస్తున్న రిజర్వేషన్‌లతో మహిళలు రాజకీయంగా కీలక పదవులలో ఉన్నారని తెలిపారు. మహిళలు అంటే అబల కాదు సబల, ఆది శక్తి అన్నారు. మహిళలు తలచుకుంటే చేయని పని అంటూ లేదని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తున్నారు అంటే అందులో పురుషుల సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయని పురుషులను గౌరవిస్తూ మరెన్నో విజయాలు సాధించాలని తెలియజేశారు. అనంతరం వారం రోజులుగా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, మేనేజర్ వెంకట్ రెడ్డి, ఆర్‌ఓ అంజన్ రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, ఆర్పీలు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లోకి రావాలి

మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్
ఎల్బీనగర్ నియోజకవర్గంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమ నిర్వహణకు మల్ రెడ్డి రాంరెడ్డి పూర్తి సహాయ సహాయకారాలు అందించారని మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళలు మరింత చురుకైనా పాత్ర పోషించాలని కోరారు. మహిళలు తమ హక్కుల సాధన కోసం మహిళలు ముందుకు రావాలి అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారితతోనే సమానవత్వం సాధ్యం అవుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ తీసుకొచ్చిందని గుర్తు చేశారు. చట్ట సభల్లోనూ మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యత లేకుండా పోయిందని మల్ రెడ్డి రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు .మహిళల పట్ల బీఆర్ఎస్ సర్కార్ వివక్ష ప్రదర్శిస్తుందని విమర్శించారు. మహిళలకు రాజకీయ రంగంలో అధిక ప్రాధాన్యతనిచ్చింది కాంగ్రెస్సేనని తెలిపారు. మహిళల వంటింటి కష్టాలను తీర్చేందుకు 500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తాము అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని రాం రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వకపోతే సహించం

సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు కొర్ర మోతిలాల్ నాయక్



నవతెలంగాణ-సంతోష్‌నగర్
గ్రీన్ పార్క్ కాలనీ చంపాపేట్ హైదరాబాద్ సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ సమావేశంలో మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు, ఏప్రిల్‌లో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులు ఫీజు చెల్లించలేదనో, అటెండెన్స్ తక్కువ ఉందని, తల్లిదండ్రులకు భయపెడుతూ కార్పొరేటర్ విద్యాసంస్థలు కుంటి సాకుతో హాల్‌టికెట్ ఆపి మానసిక ఆవేదనకు గురిచేస్తే సహించబోమని హెచ్చరించారు.

రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యార్థులు పూర్తిస్థాయి ఫీజు చెల్లించలేదని కారణంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేస్తున్నారని, ప్రభుత్వ విద్యాధికారులు ఒక దృష్టి పెట్టాలని, కోరుతూ ఇది మంచి పద్ధతి కాదని, బేషరతుగా అందరికీ హాల్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాతిపదికన ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు అన్ని కళాశాలలకు తక్షణమే హాల్ టికెట్ ఇవ్వాలని సర్క్యులర్‌గా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. టీఎస్పీఎస్సీలో 5న జరిగిన రెండు పరీక్ష పేపర్లు ముందే లీక్ కావడం బాధాకరమని, అధికారుల నిర్లక్ష్యం వల్లే పరీక్ష పత్రాలు లీక్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ సివిల్) పరీక్ష పేపర్లు లీక్ అయినట్లు పోలీసులు తెలిపారని, దీనికి కారకులైన ప్రవీణ్ కుమార్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకున్నప్పటికీ తదుపరి విచారణ కొనసాగించాలని అన్నారు. పేపర్ లీక్ కావడం వల్ల వేలాదిమంది నిరుద్యోగులకు నష్టం జరిగిందని ఇది పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై, అధికారులపై ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన గతంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. తక్షణమే దీనిపై పూర్తి విచారణ జరిపి అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాంధీ నాయక్. మహిళా విభాగం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సక్రి బాయి. నాయకులు గణేష్ నాయక్. దేవా నాయక్. సరితాబాయి. హనుమంతు నాయక్ లంబాడి సేన అధ్యక్షులు బాలు నాయక్, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు లేనిదే సమాజం లేదు



- రంగారెడ్డి జిల్లా జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి

నవతెలంగాణ - మీర్‌పేట్
మహిళలు లేని సమాజం మనుగడ లేదని రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి అన్నారు. టీకేఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి హాజరై మాట్లాడారు. మేము దేంట్లోనూ తక్కువ కాదంటూ మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారని అన్నారు. మంచి సమాజాన్ని నిర్మాణం చేయాలంటే ప్రధాన పాత్ర మహిళలే పోషించాలని తెలిపారు. తమ తమ ఇంట్లో పిల్లలను ఆడ, మగ అని తేడాలు చూపిస్తున్నందుకే మహిళలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అందుకే ఎవరి ఇంట్లో వాళ్ల పిల్లలకు సమాజం పట్ల బాధ్యత, ఎలా మెలగాలని తెలియజేసినప్పుడే మహిళలపై అఘాయిత్యాలు జరగవని తెలియజేశారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన గుర్తులను నెమరేస్తూ ముందుకుసాగాలని సూచించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీకేఆర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాధవరావు, బుడగం హరితారెడ్డి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వాహనానికి మాస్క్ ధరించిన వ్యక్తి పై కేసు నమోదు



నవతెలంగాణ-హయత్‌నగర్
మోటారు వాహనాల చట్ట ప్రకారం ప్రతి వాహనదారుడు తన వాహనాల నెంబర్ ప్లేట్‌లు స్పష్టంగా కనిపించేలా ఉండాలని, లేనియెడల అట్టి వాహన దారులపై మోసపూరిత కేసులు నమోదు అవుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నా వారిలో మార్పు రావడం లేదని పోలీసులు చెబుతున్నారు. మంగళవారం నాగోల్ బండ్లగూడ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలో మారేకర్ వినయ్ కుమార్ అనే వ్యక్తి తన టీఎస్ 07జీ ఎల్ 6362గల హోండా షైన్ వాహనానికి ఉన్న నెంబర్ ప్లేట్‌కు మాస్క్ ధరించి ఉండగా పట్టుబడడంతో అతనిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి కుమార్ తెలిపారు.

ఘనంగా ఆకుతోటపల్లి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 29 సంవత్సరాల తర్వాత కలసిన విద్యార్థినీ విద్యార్థులు

నవతెలంగాణ-బడంగ్‌పేట్
రంగారెడ్డి జిల్లా ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన 1994-95 పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సుల్తాన్‌పూర్‌లోని హాల్‌లో 29సంవత్సరాల తర్వాత కలసిన పూర్వవిద్యార్థులు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, తార్యానాయక్‌లను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. 94-95 బ్యాచ్‌కి సంబంధించిన విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. గ్రూప్ సభ్యుల్లో ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పూర్తి సహకారం చేసేందుకు కలిసికట్టుగా ఉండాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు తమను గుర్తుంచుకొని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు తర్వాత కలుసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఒక్కసారైనా గ్రూప్ సభ్యులందరూ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం చేయాలని సూచించారు. స్కూల్ అభివృద్ధి కూడా తమవంతుగాకృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, లక్ష్మణ్, ప్రమోద్ కుమార్, ఎం.రవి, జంగారావు ఎం.నరసింహ గౌడ్, కొండల్ రెడ్డి, కొండల చారి, ఎ.రవి, జగన్, విజయ్ చందర్, అరుణ్ కుమార్, అశోక్, బుచ్చయ్య, రాములు, వెంకటయ్య, రాధా, సుమిత్ర, శశికళ, సునీత, రాధమ్మ, అలివేలు, ముత్యం, కృష్ణయ్య, శ్రీను, బాల్‌రాజ్, ఈదమయ్య ఉన్నారు.



నేడు ఛలో రాజ్ భవన్

నవతెలంగాణ-బడంగ్‌పేట్
బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను ఆదాని అంబానీలకు దోచిపెడుతున్నదని నిరసనగా ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు 15వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఛలో రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గాంధీభవన్ నుంచి ఛలో రాజ్‌భవన్ యాత్ర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు.



పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిన బూర్గుల



టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ-నాగోల్
నిజాం పాలన నుండి విముక్తి కలిగాక హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. మంగళవారం రామకృష్ణారావు 125వ జయంతిని ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస గుప్తా అతిథిగా పాల్గొని రామకృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యేవరకు రాష్ట్రంలో ఉర్దూ మాధ్యమంలోనే విద్యాబోధన జరిగేదని, ఆ తరుణంలో తెలుగుతోపాటు ఇతర భాషలలో కూడా చదువుకునేలా సంస్కరించిన గొప్ప వ్యక్తి బూర్గుల రామకృష్ణారావు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన తర్వాత ఆయన కేరళ, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పనిచేసి ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. బూర్గుల బహుముఖ ప్రజ్ఞాశాలి అంటూ, అటువంటి మహామహులైన పెద్దలను స్మరించుకుంటే చరిత్రను స్మరించుకున్నట్లేనని ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహిత్యవేత్త అమ్మంగి వేణుగోపాల్ మాట్లాడుతూ బూర్గుల గొప్ప కవి, బహుభాషా పండితుడని కొనియాడారు. పోతన భాగవ తాన్ని ఆయన హిందీలోకి అనువదించారని తెలిపారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నటుడు మోహనకృష్ణ, తెలుగు అధ్యాపకులు జ్యోతితో పాటు పలువురు పాల్గొన్నారు.

బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాప్రా

చక్రిపురం చౌరస్తాలో జీవనోపాధి కోసం మీల్స్ నడిపిస్తున్న పడాల రమేష్- కనకలక్ష్మి దంపతుల షెడ్ ప్రమాదవశాత్తు కాలిపోవడంతో వారికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి చర్లపల్లి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్‌లు రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి కి బాధితులు కతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీతారాం రెడ్డి ,కనకయ్య ,కరణ్ ,ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎస్ కాలనీ సమస్య పరిష్కారానికి కృషి

- బోర్డు మాజీ సభ్యురాలు నళిని వెంకట్రావు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ నాలుగో వార్డ్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని బోర్డు మాజీ సభ్యురాలు నళిని వెంకట్రావు బస్సు హామీ ఇచ్చారు. మంగళవారం కాలనీ వాసుల కోరిక మేరకు ఆమె కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మాజీ సభ్యురాలికి వివరించారు. పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు నాయకులు పనస శ్రీకాంత్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

- హైదరాబాద్ జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వచ్చే నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కీస్ హైస్కూల్ సికింద్రాబాద్‌లో ఉదయం మొదటి సెషన్‌లో ముషీరాబాద్, మారెడుపల్లి, సికింద్రాబాద్ జోన్‌కు చెందిన చీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లకు టెన్త్ పరీక్షల నిర్వహణపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండవ సెషన్‌లో హిమాయత్ నగర్, నాంపల్లి, సైదాబాద్ జోన్‌కు చెందిన సీఎస్, డీఎస్, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణీ, డిప్యూటీ ఈవోలు చిరంజీవి, విజయలక్ష్మి, బాలు నాయక్, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, జిల్లా టాస్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ టెన్త్ పరీక్షలలో విధులు నిర్వహించే సిబ్బంది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని కోరారు. విద్యార్థులకు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్వశ్చన్ పేపర్స్ ఇచ్చేటప్పుడు, ఆన్సర్ పేపర్స్ తీసుకునేటప్పుడు పాటించవలసిన నియమాలను గురించి తెలియపరచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను క్షుణంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది అందరూ సమన్వయంతో వ్యవహరించి పదో తరగతి పరీక్షలను విజయవంతం చేయాలన్నారు.

20 నుంచి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- పార్టీ నాయకులతో మంత్రి సమావేశం



నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 20వ తేదీ నుంచి డివిజన్‌ల వారిగా బి.ఆర్.ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గ కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మంత్రి నివాసంలో ప్రత్యే క సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన మోండా మార్కెట్ డివిజన్, 23న రాంగోపాల్ పేట డివిజన్, 25న బేగంపేట డివిజన్, 27న అమీర్ పేట డివిజన్, 29న సనత్ నగర్ డివిజన్, ఏప్రిల్ 2 వ తేదీన బన్సీలాల్ పేట డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో, సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 100 మంది చొప్పున ఒకొక్కరికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని, 2వ విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 1100 మందికి దళిత బంధు ఆర్థిక సహాయం అందించనున్నట్టు చెప్పారు. అదేవిధంగా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనే వారికి గృహలక్ష్మి కార్యక్రమం కింద రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే విధంగా ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు వివరించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు రానున్నా యని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయల అనేక అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను మన బస్తీ -మన బడి కార్యక్రమం క్రింద పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తు న్నట్టు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలలోకి విస్తతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. డివిజన్‌లలో నిర్వహించే ఆత్మీయ సమావేశాలకు పార్టీకి చెందిన అన్ని స్థాయిలలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే విధంగా చూడాలని చెప్పారు. ఆయా డివిజన్ లలో నిర్వహించే సమావేశాల సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని వివరిం చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెం ట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, కురుమ హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమారు గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ రాజు, పలువురు పార్టీ ముఖ్య నాయకులు, మాజీ డివిజన్ అద్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ

- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ లోని 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీకి చెందిన అండాలమ్మ అనారోగ్యానికి గురై సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజురైన రూ.20వేల చెక్కును మంగళవారం కార్పొరేటర్ నిహారికగౌడ్ సమక్షంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని, ప్రతీ పల్లెకు, పట్టణానికి వైద్యాన్ని దగ్గర చేసిన ఘనత సీఎం కేసీఆరే దక్కుతుందని అన్నారు. వైద్య రంగంలో తెలంగాణే దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. పేదలకు రూపాయి ఖర్చులేకుంగా నాణ్యమైన వైద్యం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రమేషాచారి, డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, మహిళా నాయకురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.



వీధి కుక్కలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ కూరగాయల మార్కెట్ నందు వీధి కుక్కలపై అవగాహన సదస్సు మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు వాటి వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. గుంపులుగా ఉన్న కుక్కల వైపు పిల్లలు, విద్యార్థులు పోకుండా జాగ్రత్త వహించాలని, వాటికి ఆహార పదార్థాలు వేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా కుక్కలు గుంపులుగా ఉన్నప్పుడు పిల్లలు రాళ్లు వేయకుండా జాగ్రత్తగా ఉంచాలని, ఒకవేళ కుక్క కరిస్తే ఫస్ట్ ఎయిడ్ చేసుకొని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. ఎస్ఎస్ నాగరాజు, జవాన్ రాజన్, ఎస్ఎఫ్ఏ లక్ష్మి మార్కెట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గుప్త, ఇతర వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డా. వెంకటేష్ చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పరీక్ష ప్రశ్నాపత్రం లీకైన వ్యవహారంలో కచ్చితంగా ప్రభుత్వ పెద్దల హస్తం ఉండి ఉంటుందని, ఈ విషయంపై సర్కారు ఎందుకు మాట్లాడడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్ ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఇలా జరగడానికి వీల్లేదని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిందితుల వెనకాల ఎవరున్నా కఠినంగా శిక్షించాలని, గతంలో జరిగిన గ్రూప్-2 పరీక్షల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లోనూ పేపర్ లీకైనట్టు అనుమానం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ కారకుడైన ప్రవీణ్‌కు గ్రూప్-1లో 150కి గాను 103 మార్కులు రావడంతో అనుమానం కలుగుతుందని, రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలపై నమ్మకం పోతుందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలోనూ అవినీతి జరగడం అన్యాయమన్నారు. పోలీసు నియామకాల్లో నియామక బోర్డు ఏకపక్ష నిర్ణయాల వల్ల చాలా మంది అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. వందలాది మంది పేద విద్యార్థులు అప్పులు చేసి వేలల్లో ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకొని కష్టపడి, నిజాయితీగా పరీక్షలు రాశారని.. వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కె.అరుణ క్వీన్, డాక్టర్ సాంబశివ గౌడ్ పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్ మార్గాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తున్న ప్రపంచం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు
- పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన మార్గాన్ని ప్రపంచం యావత్తు ఆచరించడానికి ప్రయత్నిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు తెలిపారు. సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కార్ల్ మార్క్స్ 140వ వర్ధంతి సభ ఈసీఐఎల్‌లోని కమలానగర్ ఆఫీ సులో మంగళవారం నిర్వహించారు. ఈ సభకు పార్టీ సీని యర్ నాయకులు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. సభ ప్రారంభ సూచికగా కార్ల్ మార్క్స్ చిత్రపటానికి ముఖ్య అతిథి డీజీ నరసింహారావు, పార్టీ హైదరాబాద్ మాజీ కార్య దర్శి పీఎస్ఎన్‌మూర్తి, పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం డీజీ నరసింహారావు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానానికి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అన్ని వర్గాల నుంచి ముందుకు వస్తున్నారని చెప్పారు. 1990 తర్వాత సోవియట్ యూనియన్‌లో సోషలిజాన్ని సామ్రాజ్యవాద శక్తులు కూల్చివేసినప్పటికీ ప్రపంచంలో సోషలిజాన్ని గర్వంగా చైనా, వియత్నాం, క్యూబా లాంటి దేశాలు నిలబెడుతున్నా యన్నారు. చివరికి అమెరికాలో కూడా సోషలిజం పట్ల 40 శాతం మంది ప్రజలు సానుకూలత చూపారు అనేది ఒక రిపోర్టు అన్నారు. పీఎస్ఎన్‌మూర్తి మాట్లాడుతూ కార్ల మార్క్స్ చనిపోయి 140 సంవత్సరాలు పూర్తయినా నేటికీ ఆయన రచనలు సిద్ధాంతాలు ప్రజలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయన్నారు. నేటికీ పెట్టుబడిదారీ విధానానికి సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కార్ల మార్క్స్ పేర్కొన్న సోషలిజం ఒక్కటే సమాధానమని చెప్పారు. ఆయనకు నిజమైన నివాళి అంటే సోషలిజం స్థాపనకు కషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమ టి రవి మాట్లాడుతూ బీబీసీ వార్తా సంస్థ రిపోర్టులో గత 1000 సంవత్సరాలలో అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తుల జాబితాలో కార్ల్ మార్క్స్ ముందున్నారని చెప్పారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మాట్లాడుతూ మార్క్స్ చెప్పిన రీతిలో నిత్యం అధ్యయనం చేస్తూ పోరాటాలలో ముందుం డాలని చెప్పారు. వెంకట్ వందన సమర్పణతో సభ ముగి సింది. సభలో ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఫిజికల్లీ చాలెంజ్డ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, నాయకులు శ్రీమన్నారాయణ, పి.బి చారి ప్రసాద్ బాబు, ఏకేడీ చారి, శివరామకష్ణ, చిత్తరంజన్ దాస్, బసవ పున్నయ్య వెంకటేశ్వరరావు, శోభ, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ రాజ్యం వచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి'

నవతెలంగాణ- నేరేడ్‌మెట్/ మల్కాజిగిరి



ఇందిరమ్మ రాజ్యం వచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని మౌలాలి డివిజన్‌లో నిర్వహించిన హత్ సే హత్ జోడో యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మౌలాలి ఎక్స్ రోడ్, జెడ్ టీ సి, హనుమాన్ నగర్ లో ఆయన గడప గడప తిరిగి ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తొమ్మిదేండ్ల బిజెపి, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే అన్నారు. రోజు రోజుకు ధరలు పెరుగుతుండడంతో ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోడీ ఇద్దరూ దొందు దొందేనన్నట్టుగా ప్రజలపై పెను భారాలు మోపి గుదిబండగా మారారనని, వీరిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన ప్రజలంద రికి ఇండ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు, ఇందిర మ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ రూ.500 లకే అందిస్తామని, రాగానే ప్రతీ రైతుకు ఏకకాలంలో రెండు లక్షలు రుణమాఫీ చేస్తుందన్నారు. మళ్లీ తమకు అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలకు ఇందిరమ్మ సంక్షేమ పాలనను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుత్తి రామచందర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి యాదవ్, వంశీ ముదిరాజ్, వినోద్ యాదవ్, వి శ్రీనివాస్ గౌడ్, సంతోష్ ముదిరాజ్ సానాది శంకర్, మహేం దర్ గౌడ్, హమీద్ భాయ్, అరుణ్ కుమార్, కిరణ్, హైదర్ బాయ్, రైముద్దీన్, శ్యామ్, సత్యనారాయణ,ఆలీ జాన్, అల్ మదర్, సలీం, బాకర్, రవి, జయరాం, నాగరాజ్ గౌడ్, చక్రం శ్రీను, ముక్తర్, మజీద్, చంద్రకళ, భాగ్యరాణి, అన్నమ్మ, ఆషారాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు

బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీ

నవతెలంగాణ-కాప్రా

బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ ఈసీఎల్ బ్రాంచ్‌లో ఫేర్‌వెల్ పార్టీ జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ చైర్మెన్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి హాజరయ్యారు. స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, స్కూల్ టీచర్స్ శైలజ , వసంత ,శ్రీనివాస్, రేఖ, షాహీన్ పద్మ పాల్గొన్నారు.



అఫ్జల్‌గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ఎదుట విద్యార్థుల ఆందోళన

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



టీఎస్‌పీఎస్సీ ఏఈ పేపర్ లీకేజీ పై అఫ్జల్ గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ఎదుట విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ టీఎస్ పీఎస్సీ గతంలో నిర్వహించిన అన్ని పరీక్షలపై అనుమానంగా ఉందన్నారు. వాటిపై పీఆర్‌ఓ 42 సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అవకతవకలు జరిగినా పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మళ్ళీ ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇకముందు జరిగే పరీక్షలు పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'టీఎస్పీఎస్సీలో పరీక్ష పత్రాల లీకేజీపై హైకోర్ట్ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

టీఎస్పీఎస్సీలో పరీక్ష పత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షల్లో ఏఈ పరీక్ష ప్రశ్న పత్రం లీకేజీ జరగడం అంటే టీఎస్పీఎస్సీ అధికారులు పరీక్షల నిర్వహణలో తమ బాధ్యతలను ఎంత అలసత్వం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్ధమవుతుందన్నారు. ఏఈ పరీక్ష పేపర్ లీకేజీతో పాటు మరి కొన్ని పరీక్షల పేపర్లు లీకేజీ అయినట్లు వస్తున్న వార్తలపై హైకోర్ట్ సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ ప్రకటనల కోసం వేచి చూస్తూ కోచింగ్ సెంటర్లకు రూ.లక్షలు చెల్లించి పరీక్షలకు సన్నద్ధమైతుంటే కొందరు పరీక్ష పత్రాలను లీకేజీ చేసి లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించడం చేతకాని స్థితిలో టీఎస్పీఎస్సీ ఉందనీ, లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ అధికారులు, టీఎస్పీఎస్సీ చైర్మన్, సభ్యులు రాజీనామా చేయాలనీ, అన్ని పరీక్షలపై విచారణ జరిపించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి..
- నగరంలో మొత్తం 233 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 1,71,923 మంది విద్యార్థులు
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ సెంటర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి పరీక్షలు ప్రారంభమై.. వచ్చే నెల 4వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ జిల్లాలోని 30 పోలీసు స్టేషన్ల పరిధిలో 233 సెంటర్ల ద్వారా 84,223 మంది విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9గంటలకు పరీక్షలు ప్రారంభమై మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరగనుంది. హైదరాబాద్ జిల్లా డీఐఈవో డి.ఒడ్డెన్న ఆధ్వర్యంలో పరీక్షల ఏర్పాటు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికే పోలీసు, ఆర్టీసీ, వైద్య, పోస్టల్ అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణకు గాను నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్, అయిదు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, హైపవర్ కమిటీలు ఏర్పాటు చేసినట్టు డీఐఈవో తెలిపారు. కాగా విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షల కేంద్రాలకు చేరుకోవాలనీ, ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించారని ఆయన చెప్పారు. సెంటర్ లోకేటర్ యాప్ ఆధారంగా సెంటర్లకు సులువుగా చేరుకోవచ్చనీ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి గట్టి నిఘా ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు ఏమాత్రం ఆస్కారం లేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్‌లు, ఓఆర్ఎస్‌తో పాటు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన తాగునీరు సరఫరా, ఫర్నీచర్, శానిటేషన్‌తోపాటు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోగా.. పరీక్ష కేంద్రాలకు వెళ్లే రూట్లలో ఆర్టీసీ అదనంగా ప్రత్యేక బస్సులు నడపనుంది. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరగనున్నాయి. 8.30 నుంచి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతిస్తారు. 9గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉదయం 8.30గంటల కల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి చేరుకోవాలి. పరీక్షకు వచ్చేముందు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేయాలి. భయపడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఏకాగ్రతతో చదువుకుని సమాధానాలు చక్కగా రాయాలి. హాల్‌టికెట్, పెన్, ప్యాడ్ వంటివి ముందుగానే సర్దిపెట్టుకోవాలి. సందేహాల నివృత్తికి మినీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశాం.

డి.ఒడ్డెన్న, ఇంటర్ విద్యాధికారి, హైదరాబాద్ జిల్లా

మినీ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో మినీ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సమస్యలు, సందేహాల నివృత్తి కోసం ఓ అధికారితో పాటు సిబ్బందిని కంట్రోల్ రూమ్‌లో నియమించారు. ల్యాండ్ లైన్ నంబర్ 040-29700934కు సంప్రదించవచ్చని డీఐఈవో సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సిలింగ్ కోసం 'టెలీ మానస' హెల్ప్‌లైన్ నంబర్ 14416ను ఏర్పాటు చేశారు.

పెయింటింగ్‌తో అవినభావ సంబంధం

సాలార్జంగ్ మ్యూజియం ఆర్ట్ ఆఫ్ ది హార్ట్ ఎగ్జిబిషన్‌లో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



నవతెలంగాణ-హైదరాబాద్

పెయింటింగ్‌తో అవినాభావ సంబంధం ముడిపడి ఉందని శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ కళాశాల ఫౌండర్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సాలార్జంగ్ మ్యూజియంలో మహిళలు చిత్రీకరించిన ఆర్ట్ ఆఫ్ ద హార్ట్ ఎగ్జిబిషన్‌ను బ్లాక్‌లో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య హాజరై మ్యూజియం డైరెక్టర్ నాగేందర్ రెడ్డితో కలిసి దీపారాధన చేసి ఆరంభించారు. మహిళలు వేసిన పెయింటింగ్ చిత్రాల ప్రదర్శనను తిలకించారు. వారు వేసిన చిత్రాల భావాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెయింటింగ్ వేయడం ఒకటైతే వాటిని డిజైనింగ్ చేయడం ప్రధానమన్నారు. ప్రత్యేకంగా ఉమెన్స్ వేసిన పెయింటింగ్ చిత్రాలకు ప్రదర్శనకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెయింటింగ్ ఎగ్జిబిషన్ కి రావడమే ఓ తల్లి గారి ఇంటికి వచ్చిన అనుభూతి కలిగిందని గుర్తు చేశారు. సాలార్జంగ్ మ్యూజియంతోనే చాలా అనుబంధం ఉందన్నారు. హాట్ ఎక్సిబిషన్ పోస్టర్స్ పెయింటింగ్ కాంపిటీషన్ వంటి వాటిని ఎక్కడినుంచి నేర్చుకున్నామన్నారు. కళాశాలలో అడ్మిషన్ అయిన తర్వాత పెయింటింగ్ ప్రాక్టీస్ కోసం ఇంటిదగ్గర కుదరక మ్యూజియంలోకి వచ్చి ప్రాక్టీస్ చేసే వారమన్నారు. ఇక్కడ ఎవరు కదల్చబడరు విగ్రహాలే కాబట్టి తిలకిస్తూ చిత్రీకరించి పెయింటింగ్ చేసేవారని గత భావాలను గుర్తు చేసుకున్నారు. తన కళాశాలలోని పెయింటింగ్ భావాలను ఆ ప్రయాణమును జ్ఞాపకం చేశారు. ఇక్కడ సుమారు మహిళలు 140 చిత్రాలను చిత్రీకరించాలని గుర్తు చేశారు పెయింటింగ్ చిత్రాలు వేసేటప్పుడు కళాకారునిగా మొదటినే వాటి భావాలను కదలికలను వారిలో మెదులుతాయని వాటిని ఆధారంగా చేసుకుని చిత్రీకరిస్తారు అన్నారు. చిత్రాల భావాలు ఏ భావంతో చేశామని డిజైన్ వాటి కదలికలు చూసినప్పుడు చూసే ప్రాస్పెక్టర్ కి కూడా అదే భావం కలిగినప్పుడే ఆ చిత్రానికి సార్ధకత ఉంటుందన్నారు. మా జనరేషన్లో మహిళలకు ఏది చేయాలన్న ఆలోచించేవారని ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. గతంలో పెయింటింగ్ చిత్రాలు ఇంటికే పరిమితం అయ్యే ఎవరైనా చూసినప్పుడు ఇది మా పాప వేసిందని గుర్తు చేసుకునేవారు కానీ ప్రస్తుతం ఎగ్జిబిషన్లో ప్రదర్శించే నేడు ఉందన్నారు. పెయింటింగ్ చిత్రాలను ఇంట్లో పెట్టడం ఎంత ప్రధానమో వాటిని మ్యూజియంలో ప్రదర్శించడం అత్యంత ప్రధానం అన్నారు. ఆడపిల్లల పెయింటింగ్ కోసం సాలార్జంలో ఒక గ్యాలరీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని డైరెక్టర్ నాగేందర్ రెడ్డి ని కోరారు. ప్రస్తుతం టెక్నాలజీ డిజిటల్ వచ్చినప్పటికీ మన అనుభూతితో వేసిన చిత్రాల కదలికలే ఓ ప్రత్యేకతను చాటుకుంటాయని బాగుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ కవిత దర్యాన్ని రావు, ఇంటెక్ అనురాధ రెడ్డి, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు రమణారెడ్డి, అనిత, మ్యూజియం కీపర్లు నరేందర్, డాక్టర్ కుసుం, చింతమల శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-అంబర్‌పేట

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ మంగళవారం విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయాన్ని ముట్టడించారు. దాంతో పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి బేగం బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్, రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ఆర్య, వీజేఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శేఖర్ యాదవ్, నాయకులు దినేష్, కల్యాణ్, అర్జున్, తేజ, మధులు ఉన్నారు. ఈ సందర్భంగా సర్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ కనుసన్నల్లో టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రామ చంద్రన్‌లు అక్రమాలకు పాల్పడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్‌సీ అక్రమాలకు అడ్డాగా, మారిందని, అమ్ముకునే స్థాయికి టీఎస్‌పీఎస్‌సీని కేసీఆర్ ప్రభుత్వం దిగజార్చిందన్నారు. ఈ లీకేజీల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. అసమర్ధ జనార్ధన రెడ్డిని చైర్మెన్ పదవి నుంచి తొలగించాలన్నారు. ఈ పేపర్ లీకేజీ ఘటన మీద సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం ఇచ్చిన అన్ని నోటిఫికేషన్ల పైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీజేఎస్ నాయకులు దినేష్, కల్యాణ్ తేజ, అభి, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదానీ ఏరోస్పేస్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



శంషాబాద్‌లోని ఆదానీ ఏరోస్పేస్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదానీ తన అక్రమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటానికి అనేక అక్రమాలకు పాల్పడి, డొల్ల కంపెనీలు స్థాపించి తన వ్యాపార షేర్లను అనూహ్యంగా పెంచి షేర్ మార్కెట్ దారులను, ప్రజలను మోసం చేశారన్నారు. బ్యాంకులను మోసం చేసి విపరీతంగా అప్పులు తీసుకుని, బ్యాంకు ఖాతాదారులైన 40 కోట్ల ప్రజలకు ద్రోహం చేశారనీ, ఎల్ఐసిని మోసం చేసి ప్రజల డబ్బును అక్రమంగా దోచుకున్నారని మండిపడ్డారు. అనేక అక్రమాలతో పాటు ప్రజా ద్రోహానికి పాల్పడి, తన స్వార్ధ వ్యాపార ప్రయోజనాల కోసం విదేశాలలో డొల్ల కంపెనీలు పెట్టి ప్రపంచం ముందు భారతదేశ పరువు, ప్రతిష్టలను మంటగలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆదానీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఏరోస్పేస్ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని, ఆదానికి తగిన బుద్ధి చెప్పాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి దేశద్రోహికి సహకరిస్తే శంషాబాద్ లోని ఏరోస్పేస్ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రజా ఉద్యమం ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఇంత తతంగం జరిగినా మోడీ, ఆదానీ విషయంలో నోరు విప్పకపోవటం విడ్డూరంగా ఉందనీ, వెంటనే పార్లమెంటులో ఆదానీ అక్రమాలపై చర్చించి అతని వ్యవహారంపై విచారించి నిగ్గుతేల్చటానికి పార్లమెంటు కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం : ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి విద్యార్థి దశ ఎంతో కీలకమని ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. అబిడ్స్ నందిని హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం బిర్లా సైన్స్ సెంటర్ బాస్కర ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అభ్యసించిన విద్యను సామాజిక అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. దేశ అభివృద్ధి పట్ల విద్యార్థులకు అకుంటిత దీక్ష ఉండాలన్నారు. విద్యార్థులు సమాజ హితమైన విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రతిక్ జైన్, నందిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సెక్రెటరీ సుతారి నర్సింహులు, ప్రిన్సిపాల్ ఎస్.విజయలక్ష్మీ, డైరెక్టర్స్ ప్రతిభ, ప్రద్యుమ్న, ప్రహర్ష, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జిఎస్.గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు కృషి : ఎమ్మెల్యే కాలేరు

నవతెలంగాణ-అంబర్‌పేట



పార్కుల సుందరీకరణకు కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. మంగళవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ పార్కులో రూ.50 లక్షల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే కార్పొరేటర్ బి పద్మావెంకట్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో ప్రత్యేక సమవేశం నిర్వహించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పార్కు అభివృద్ధితో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించనున్నామన్నారు. ఇక్కడ ఓపెన్ జిమ్, పిల్లలకు క్రీడా సాధనాలు, మంచి లైటింగ్, పూల మొక్కలు, నీడ నిచ్చే చెట్లు, వాకింగ్ ట్రాక్, కూర్చోవడానికి బెంచీలు మొదలు తాగు నీరు, మరుగుదొడ్లు మొదలైన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు కోరినట్లు ఎక్కడెక్కడి నుండో వచ్చిన వాహనాలను పార్కు చుట్టూ పార్కింగ్ చేస్తున్న కారణంగా కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలనీ, పోలీస్ పెట్రోలింగ్ పెంచి ప్రజలకు మరింత మెరుగైన రక్షణ కల్పించాలని ఎస్ఐ శైలజకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చందు, కంచె మహేష్, మిరియాల రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, తార్నాక డివిజన్‌లోని విజయ డైరీ కార్మికులకు డైరీ కోటర్స్‌లో విజయ డెయిరీ చైర్మన్ సోమ భారత్, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కార్మికుల క్షేమం గురించి చాలా ఆలోచిస్తున్నారన్నారు. ప్రతి కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మనేజర్, జనరల్ మేనేజర్, డెయిరీ కార్మికులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-అంబర్ పేట

పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని ఎస్టీపీలో గల నాలా పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ సంబంధిత సిబ్బందితో మాట్లాడుతూ నాలా పనులను కొనసాగిస్తూనే, పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పూడికతీత పనుల్లో అలసత్వం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కండిషన్స్ అప్లై బుక్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

"నగరీకరణ జరిగిన సమాజంలో కుల వివక్షత, అంతరానితనాలు ఎన్ని రూపాల్లో విస్తరిస్తున్నాయో ఆధునిక దళిత కథ వ్యక్తీకరిస్తుందని" ప్రముఖ విమర్శకులు ఏ.కె ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆర్ట్స్ కాలేజ్ వేదికగా, ప్రొ.కాశీం అధ్యక్షతన, పసునూరి రవీందర్ రాసిన "కండిషన్స్ అప్లయ్" కథ సంపుటి పరిచయ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రధాన వక్తగా విచ్చేసిన ఏ.కె. ప్రభాకర్ మాట్లాడుతూ అసమానలతో కూడిన సమాజంలో అడుగడుగునా కండిషన్స్ అప్లయ్ అవుతుంటాయన్నారు. ఆంగ్ల శీర్షికలు సామాజికత వివక్షతను నేరుగా అర్థం చేస్తున్నాయనీ, వీటిని రవీందర్ సమగ్రంగా అర్థం చేసుకున్నారని తెలిపారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రొ.కాశీం మాట్లాడుతూ రవీందర్ కథల్లో మనందరి జీవితాన్ని చూసుకోవచ్చు అన్నారు. రచనల్లో వ్యక్తమైన జీవితానికి, మన జీవితాలకు సమన్వయం కలగించడమే రచయిత సాధించే విజయమన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రొ.సూర్య ధనంజయ మాట్లాడుతూ రవీందర్ కథల్లో ఆర్తి, ఆర్ద్రత, దళిత జీవితం తాలూకు సంఘర్షణ చోటుచేసుకున్నాయని చెప్పారు. పుస్తక ప్రచురణకర్త ఒమ్మి రమేష్ బాబు మాట్లాడుతూ వర్తమానంలోని వాస్తవ సంఘటనలను కథలుగా మలుస్తూ, తానే ఒక పాత్రధారునిగా వ్యక్తమైన రవీందర్ కథలను ప్రచురించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షులు ప్రొ. సాగి కమలాకర శర్మ , డాక్టర్ ఎస్. రఘు, డాక్టర్ విజయలక్ష్మి , వివిధ శాఖల పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు, సాహితీకారులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ వ్యాప్తంగా క్రీడా పోటీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ వ్యాప్తంగా అన్ని జోన్లు, సర్కిళ్లలో మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులు, మహిళా పారిశుధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎన్.జి.ఓ లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఖైరతాబాద్ జోన్‌కు సంబంధించిన క్రీడలు విక్టోరియా ప్లే గ్రౌండ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ విజయలక్ష్మి, స్పోర్ట్స్ డైరెక్టర్ భాష పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కూకట్ పల్లి జోన్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో జోనల్ కమిషనర్ మమత పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చందానగర్, ఎల్బీనగర్ జోన్, చార్మినార్ జోన్, సికింద్రాబాద్‌లలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ఓయూ

రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలపై బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో నలకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కళాశాలల్లో అవగాహనా సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి టీటీఐ సీఐ నాగరాజు, నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు అనుమతించకూడదని సూచించారు. ఈ విషయంలో వాహనం ఇచ్చినవారు సైతం శిక్షార్హులవుతారని తెలిపారు. వాహనాలు నడిపేందుకు అమలులో పెట్టిన నిబంధనలు ప్రాణ సంరక్షణ కోసమేనన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటపుడు సిగ్నల్స్ రూల్స్ పాటించాలన్నారు. అతివేగంతో నడపడం ఎప్పుడూ ప్రమాదకరమేనని అభిప్రాయపడ్డారు. వాహనం నడిపేవారు తమ దృష్టి, మనసు పూర్తిగా రోడ్డుమీదే లగ్నం చేయాలని సూచించారు. రహదారులపై క్రమశిక్షణతో వ్యవహరించాలనీ, ప్రతిఒక్కరూ తమ రక్షణతో పాటు ఇతరుల రక్షణకు వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవి, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే జైలుకు పంపుతాం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ లోని సారథి సొసైటీ లో గల ప్రభుత్వ స్థలమును కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి, రాత్రి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అందులో భాగంగా 15 రోజుల క్రితం 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రెడీమేడ్ సిమెంట్ దిమ్మెలను వేసి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే కూల్చేశారు. అదే స్థలంలో తిరిగి శని ఆదివారాలు అక్రమ నిర్మాణం చేపట్టారు. స్థానికుల ద్వారా, మీడియా ద్వారా అక్రమ నిర్మాణం పై ఖైరతాబాద్ తహసీల్దార్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన ఖైరతాబాద్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది స్పెషల్ ఆర్ఐ కిరణ్‌రాజ్, ఆర్ఐ సందీప్, సిబ్బందితో కలిసి మంగళవారం సారథి సొసైటీలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని జేసీబీతో పూర్తిగా నేలమట్టం చేశారు. ఆ సమ యంలో స్థలం ఆక్రమించిన వారెవరూ అక్కడకు రాలేదు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులు మాట్లాడు తూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే పోలీసులకు ఫిర్యాదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

టీబీ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



75వ ఆజాదీ కా అమృత్ మహెూత్సవ్, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో డాక్టర్లు 'హెల్త్ మేళా' పేరుతో టీబీ, కుష్టు వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ రీజినల్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డి, టీబీ హెల్త్ విజిటర్ కె.రమేష్, హెల్త్ సూపర్ వైజర్ నర్సుభాయి, ఏఎన్ఎం సుహాసిని, పద్మ, ఆశావర్కర్లు మాధవి, అమరావతి, నాయకులు అమర్ నాథ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ సామల హేమ సమీక్ష



నవతెలంగాణ-ఓయూ

శ్రీనివాస్‌నగర్ వాటర్ వర్క్స్ ఆఫీస్‌లో కార్పొరేటర్ సామల హేమ మంగళవారం వాటర్ వర్క్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండకాలన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రయినేజీ ఓవర్ ఫ్లో, కాలుష్యపు నీరు, మంచి నీరు ప్రెషర్ తక్కువగా రావడం లాంటివి రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిపేర్ లో ఉన్న నీటి బోర్‌లను వెంటనే రిపేర్ చేయాలనీ, రంజాన్ మాసం సందర్భంగా మైనారిటీ సోదరులకు మంచి నీటి కొరత లేకుండా చూడాలని హేమ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీఎం రమణ రెడ్డి, డీజీఎం కృష్ణ, మేనేజర్ నవ్య అన్విత్, బోర్వెల్ మేనేజర్ వరుణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ జట్టుకు ప్రవలిక ఎంపిక

నవతెలంగాణ-ఓయూ



కొరియాలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి జరిగే ఆసియా కప్ మహిళా సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు సికింద్రాబాద్‌లోని సితాఫలమండికి చెందిన చేపుర్వ ప్రవలిక ఎంపికైంది. భారత్ దేశ జట్టులో స్థానం సాధించిన ఆమెను డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ మంగళవారం సికింద్రాబాద్‌లోని తన నివాసంలో అభినందించారు. ఔత్సాహిక క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందనీ, తన వ్యక్తిగతంగా కూడా సికింద్రాబాద్ నుంచి వివిధ క్రీడాంశాల్లో పాల్గొనే వారిని ప్రోత్సహిస్తామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొరియాలో పోటీల్లో పాల్గొనే భారత జాతీయ జట్టుకు తెలంగాణ పక్షాన ఏకైక క్రీడాకారిని ప్రవలిక మహారాష్ట్రలోని యావత్ మాల్‌లో ఇండియన్ కోచింగ్ శిబిరంలో పాల్గొనేందుకు తరలి వెళ్లనుంది. కొరియాలో ఆసియా కప్‌లో మన జట్టు రాణించాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

విద్యార్థులకు ప్యాడ్స్ అందజేత

నవతెలంగాణ-బంజారాహిల్స్

పది, ఇంటర్మీడియట్ పరీక్షలను పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రాజ్ నగర్లో శిక్ష అకాడమీలో స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి 120 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులతో పాటు ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్ష అకాడమీ డైరెక్టర్ విష్ణు గౌడ్, జాయింట్ డైరెక్టర్ మహేష్ గౌడ్, అధ్యాపకులు అనికేత్ అరుణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు చిరు గౌడ్, సాయి, సంతోష్, సతీష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



పెయింటర్ అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం చెన్నారెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ పెయింటర్‌గా పనిచేస్తున్న 41 ఏండ్ల ముక్తార్ అహ్మద్ ఈ నెల 8న మద్యం సేవించిన సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులను, తెలిసినవారినీ విచారించినా, పరిసర ప్రాంతాలలో వెదికినా అతని ఆచూకీ లభించలేదు. ఈ మేరకు అన్న ఖదీర్ అహ్మద్ మంగళవారం బాలానగర్ పోలీసులకు పిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు చింతలపల్లి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వత్సలా దేవి



నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజలకు అందుబాటులో ఉండి మూడు చింతలపల్లి మండల అభివృద్ధి కి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ కేవల్ వత్సలా దేవి తెలిపారు. జీహెచ్ఎంసీ నుంచి బదిలీపై మూడు చింతలపల్లి వచ్చిన వారు మంగళ వారం మండల పరిషత్ ఎంపీడీఓగా పదవి బాధ్యతలు చేపట్టారు. కాగా ఇన్‌చార్జి ఎంపీడీఓ రవి ఛార్జ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

వేసవిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు

- మే నెలాఖరుకు అదనంగా 42 ఎంజీడీల నీరు
- ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రజలకు 50 ఎంజీడీలు కేటాయింపు
- వేసవి కార్యాచరణ ప్రకటించిన జలమండలి ఎండీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో మంచినీటి సరఫరాకు ఎటువంటి ఢోకా లేదని, అవసరం మేరకు తాగునీరు అందుబాటులో ఉందని జలమండలి ఎండీ దానకిషోర్ తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, రెవెన్యూ, ట్రాన్స మిషన్, ఓ అండ్ ఎం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి ప్రస్తుతం రోజూ 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుందని, మరో 42 మిలియన్ గ్యాలన్ల సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. నగరంతో పాటు ఓఆర్ఆర్ లోపలి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ వేసవి మే నెలాఖరు నాటికి మొత్తం 42 ఎంజీడీల నీరు అదనంగా సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో నగర పరధిలో 22 ఎంజీడీలు, ఓఆర్ఆర్ లోపలి గ్రామాలకు 20 ఎంజీడీల నీరు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ఈ నెలలో అదనంగా 22 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఇందులో ఇప్పటికే 14 ఎంజీడీలు ఇస్తుండగా నెలాఖరుకు మరో 8 ఎంజీడీల నీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్‌లో 12, మేలో 8 ఎంజీడీల నీరు అదనంగా సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు.

ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2 కి 50 ఎంజీడీల నీరు

ఈ జూన్ నాటికి ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు ఇప్పటికే 20 ఎంజీడీల నీరు ఇస్తుండగా.. అవసరాన్ని బట్టి మరో 30 ఎంజీడీల నీరు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి ఈ ప్రాంత ప్రజలకు మొత్తం 50 ఎంజీడీల నీరు సరఫరా అవుతుందని పేర్కొన్నారు.

బోర్ వెల్ మరమ్మతులు:

ఆయా ప్రాంతాల్లో ఉన్న బోర్ వెల్స్ సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్) కింద మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ట్యాంకర్లు, ట్రిప్పులు

అవసరమైన చోట్ల అదనంగా ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎండీ ఆమోదం తెలిపారు. నగర వ్యాప్తంగా ప్రస్తుతం 74 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. అదనంగా మరో 3 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా అవసరం మేరకు ట్యాంకర్లు, ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో డిమాండును బట్టి నీటి సరఫరా సమయాన్ని పెంచాలన్నారు. ఫిల్లింగ్ స్టేషన్లలో కరెంటు కోతలు, మోటారు రిపేర్లు, తదితర సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై తగిన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. అలాగే కలుషిత జలాల సరఫరా కావటం వల్ల నీరు వృథాగా పోతున్న ప్రాంతాలను గుర్తించి, సమస్యను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ లీకేజీలు, సీవరేజి ఓవర్ ఫ్లో లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. అలాగే మ్యాన్ హెూళ్ల నుంచి తీసిన సిల్ట్ ను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఎక్కడైనా మ్యాన్ హెూళ్లు ధ్వంసమైతే వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని, మ్యాన్ హెూళ్ల కవర్లు కనిపించని స్థితిలో ఉన్నా.. వెంటనే కొత్త మూతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రంజాన్ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

రంజాన్ మాసం దృష్ట్యా అవసరమైన చోట్ల మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడా సీవరేజి ఓవర్ ఫ్లో వంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. దీని కోసం డివిజన్‌కొక మినీ జెట్టింగ్ మిషన్‌ను కేటాయిస్తున్నట్టు తెలిపారు. సీవరేజి పనులు జరిగినప్పుడు వెలికి తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమీక్షలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్ -2 స్వామి, ఓ అండ్ ఎం, ట్రాన్స్ మిషన్ సీజీఎంలు, జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు

భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

- సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-జగదిరిగుట్ట.

భవన నిర్మాణ కార్మికులందరూ ప్రభుత్వ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పొందాలని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ. ఉమా మహేష్ తెలిపారు. మంగళ వారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జగద్గిరి గుట్ట శాఖ ఆధ్వర్యంలో గుట్ట చివరి బస్టాప్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం శాఖ ఏఐటీయూసీ నాయకులు సామెల్, ముసలయ్య ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ మండల కార్యదర్శి ఈ ఉమా మహేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు ఉజ్జిని హరినాథ్‌లు పాల్గొని గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులందరికి సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని, కావున కార్మికులు వాటిని పొందాలన్నారు. అలాగే కార్మికులంతా సమైక్యంగా ఉండి పోరాటం చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడి దారులకు లక్షల కోట్ల ప్రజా సంపదను మాఫీ చేస్తున్నాయి కానీ కార్మికులు దాచుకున్న డబ్బులను కార్మికులకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పి కార్మిక రాజ్యం కోరుకునే వామపక్షాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చర్లపల్లి రాములు, వంగాల శ్రీనివాస్, సాయిలు, సోమయ్య, బాలు, బుచ్చిరాములు, శ్రీనివాసరావు, రాజేశ్వరి, సత్యవతి,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్ఎస్‌కు అధికారం ఇవ్వండి

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ భరత్ నగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మంగళవారం సమావేశమై అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భరత్ నగర్ కాలనీలో అనేక మౌలిక సదుపాయాలతో పాటు పార్కులను అభివద్ధి చేసినందుకు ఎమ్మెల్యే మాధవరం కష్ణారావుకు, కార్పొరేటర్ సతీష్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్క్ లో సీనియర్ సిటిజన్స్ కోసం నూతన బోర్ వేయాలని సభ్యులు కోరడంతో అతి త్వరలో వేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అభివృద్ధిని, సంక్షేమ ఫలాలను చూసి రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ను ఎమ్మెల్యేగా గెలిపించి హ్యాట్రిక్ సాధించే దిశగా కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ ను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి నేత, ప్రధాన కార్యదర్శి మాణిక్ రెడ్డి, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సురేష్ నాయుడు, సాయి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ పనులను దశలవారీగా పూర్తి చేస్తా'



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తారని కార్పొరేటర్ రావులశేషగిరి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధి కైలాస్ హిల్స్ కాలనీలో రోడ్లు, డ్రయినేజీలు ఇతర సమస్యలపై స్థానికులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా డివిజన్‌ను ప్రజల సహాయ సహకారాలతో గ్రేటర్ లోనే ఆదర్శ డివిజన్‌గా అభివద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, సంపత్ కుమార్, సత్యనారాయణ, సుబ్బారావు, సత్యనారాయణ రావు, బి రమణ, సిహెచ్ సురేష్, సిద్దిరాంరెడ్డి, రవీంద్రారెడ్డి, భాస్కర్, నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్, నరసింహారెడ్డి పాల్గొన్నారు

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ కూకట్ పల్లిలోని అమోర్ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బర్న్ యూనిట్ (వార్డ్) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కాలిన గాయాలతో బాధపడేవారికి ఆధునికమైన నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కూకట్ పల్లి ప్రజలకు అందుబాటులో బర్న్ సంబంధించిన వార్డ్ ఏర్పాటు చేయడంపై ఆయన అమోర్ హాస్పిటల్ వారిని అభినందించారు.

మాజీ మంత్రికి ఎమ్మెల్యే నివాళ్లు

కూకట్ పల్లి : మాజీ మంత్రి విజయ రామారావు మృతి చాలా బాధాకారం అనికూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. విజయరామారావు మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి వారి పార్థివ దేహానికి ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయ రామారావు ఒక మంత్రిగా, సీబీఐ డైరెక్టర్ గా పనిచేసినా అందరినీ ఆప్యాయతగా పలుకరించే వ్యక్తి అన్నా రు. రాజకీ యంగా తన ఎదుగదలకు



ప్రోత్సాహం ఇచ్చిన వ్యక్తి విజయరామారావు అని చెప్పారు. ఆయనతో ఉన్న అనుబం ధాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, శ్యామల రాజు, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రాజేష్, పాల్గొన్నారు.



మెగా సైన్స్ ఫేర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్ ప్రాంతంలో గల సెయింట్ ఐజక్ అడ్వెంట్ హై స్కూల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 'టింకరింగ్ సైన్స్ ల్యాబ్ ,మెగా సైన్స్ ఫేర్'ను మంగళవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టింకరింగ్ ల్యాబ్ ప్రారంభించి 60 ఏండ్లకుపైగా ఉన్న వంద మంది వద్దులకు స్కూల్ యాజమాన్యం సౌజన్యంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా బెడ్ షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ఆయన అభినందనలు తెలిపారు. స్కూల్ ఫౌండర్ డైరెక్టర్ ఐజక్ లాజం, ప్రిన్సిపల్ శ్యామల రావు , డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వశంకరయ్య స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే
జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదు

- బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి

నవతెలంగాణ-బాలానగర్

మద్యం సేవించి వాహనాలు నడిపుతూ పట్టుబడిన 829 మందిపై కూకట్ పల్లి 13వ మెట్రోపాలిటన్ అడిషనల్ మేజి స్ట్రేట్ ఎ. ప్రవీణ్ విచారణ జరిపారు. జనవరి నుంచి మార్చి 10 వరకు దాదాపు మొత్తం 829 మంది వ్యక్తులలో 669 మంది వ్యక్తులకు జరిమానాలు విధించగా మరో 160 మంది వ్యక్తులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్టు బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించిన వారి నేరారోపణలను అనుసరించి, అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులపై చార్జ్ షీట్లను ఇన్‌స్పెక్టర్ కోర్టు ఎదుట సమర్పించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఒకసారి మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ దోషిగా నిర్ధారించబడిన వారు, ప్రభుత్వ ఉద్యోగాలకు, కొత్త పాస్ పోర్టు, వీసా క్లియరెన్స్ లను పొందడం కూడా కష్టతరమవుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆర్ఆర్ఆర్ చిత్ర బృందానికి విద్యార్థుల అభినందనలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు రావడం పట్ల వివేకానంద విద్యా మందిర్



హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయుల బందం హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమకు గర్వకారణం అన్నారు. ఆ సంతోషాన్ని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ విద్యార్థులు డాన్స్‌తో ఆర్ఆర్ఆర్ బృందానికి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

హైదర్‌నగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ కాలనీలో పలు సమస్యలు, చేపట్టవలసిన వలు అభివద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది, జలమండలి అధికారులు , కాలనీ వాసులతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని డ్రయినేజీ సమస్యపై జలమండలి అధికారులతో పరిశీలించామన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్ వైజర్ నరేంద్ర, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సంగమేశ్వర రావు, శివ రెడ్డి, రావూరి శ్రీనివాస్, రమేష్, సుబ్బారా యుడు, సత్యనా రాయణ, మధు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మేడ్చల్



బైక్ పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని డబిల్‌పూర్ గ్రామానికి చెందిన సంగవుల రమేష్ (55) మంగళవారం ఉదయం తన బైక్‌పై మేడ్చల్ వైపు వస్తుండగా అత్వెల్లి దీవాన్ ఫంక్షన్ హాల్ వద్దకు రాగానే వెనుక నుండి లారీ ఢీ కొట్టింది. దాంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎంఎల్ఆర్ఐటీఎంలో ముగిసిన వెలారస్ 2కే23 ఫెస్ట్



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని మర్రి మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు టెక్నికల్ వెలారస్ 2కె23 పేరుతో నిర్వహించిన జరిగిన జాతీయస్థాయి ఫెస్ట్ మంగళ వారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, కళాశాల ఫౌండర్ సెక్రెటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్ శ్రేయ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేటిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ హర్షబ్ మాలిక్‌లు పాల్గొన్నారు. ముఖ్య అతిథి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి జాతీయ సాంకేతిక విజ్ఞాన సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాల నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. అలాగే అగ్రికల్చర్ ఎక్విప్మెంట్ పైన అవగాహన సదస్సు నిర్వహించి వాటి ఉపయోగం, పనితరం ఏ విధంగా ఉంటుందో ప్రాక్టికల్‌గా విద్యార్థులకు చూపించడం జరిగిందని తెలిపారు. ఈ రెండు రోజుల ఫెస్ట్ లో ముఖ్యంగా రోబోటిక్స్ ప్రదర్శనలు, వాటి మీద అవగాహన, రోబోల తయారీని ప్రదర్శించారన్నారు. విద్యార్థులు వివిధ రకాల సాంకేతిక ఆవిష్కరణలు ప్రదర్శించడంతోపాటు ముఖ్యంగా కోడింగ్ డీకోడింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిం కాంటెస్ట్, ఎలక్ట్రిక్ బ్యాటరీ వెహికల్ తయారీ ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చైర్మెన్ ఆఫ్ టెక్నికల్ ఫెస్ట్ డాక్టర్ వినోద్, డాక్టర్ బాచు శ్రీనివాస్, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ వీరయ్య, ఈవెంట్ కోఆర్డినేటర్ విజయసింహ, హేమలత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ ఉంటే చాలు..





ప్రతిష్టాత్మక ఆస్కార్‌లతో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' షార్ట్ ఫిల్మ్ దర్శకురాలు కార్తికి గోన్‌సాల్వెస్ నిర్మాత గునీత్ మోగ్నా

రెండు ఆస్కార్‌లను సొంతం చేసుకుని మన చిత్రాలు యావత్ భారతీయ ప్రజానీకాన్ని గర్వపడేలా చేశాయి. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు..నాటు..' పాటకు ఆస్కార్ రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇది తమకి వచ్చిన అవార్డేనని సంబురాలు చేసుకున్నారు.

ఇక ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఆస్కార్‌ని కైవసం చేసుకుని అందర్నీ ఆశ్చర్యపరిచింది. అయితే అసలు విషయం ఇక్కడే ఉంది. ఆస్కార్ నామినేషన్లలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఉన్నప్పటికీ దీనికి సంబంధించిన దర్శక, నిర్మాతలెవరో కూడా చాలా మందికి తెలీయదు. కానీ, ఆస్కార్‌కి 'ఆర్‌ఆర్‌ఆర్' అప్లై చేసిన దగ్గర్నుంచి రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఎవరనేది యావత్ ప్రపంచానికి తెలిసింది. పలు ఆస్కార్ అవార్డులను టార్గెట్‌గా చేసి రంగంలోకి దిగినప్పటికీ నామినేషన్లలో కేవలం 'నాటు..నాటు' పాటకే చోటు దక్కడంతో ఒకింత నిరాశకి గురైనా, ప్రమోషన్ల పర్వాన్ని మరింత ఉధృతం చేసింది. దీంతో 'నాటు నాటు..' పాట హాలీవుడ్ థియేటర్లలో ప్రేక్షకుల్ని సైతం స్టెప్పులు వేయించింది. ఆఖరికి ఆస్కార్ వేదికని సైతం ఓ ఊపు ఊపేసింది. ఈ ప్రచార పర్వం కారణంగా ఓవర్సీస్‌ల్లో కూడా సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్, నృత్య దర్శకుడు ప్రేమ్ రక్షిత్ గురించి అందరికీ తెలిసింది. మొత్తమ్మీద భారీ ప్రమోషన్ల హంగామా చేసి 'ఆర్‌ఆర్‌ఆర్' నాటు పాట ఆస్కార్‌ని కైవసం చేసుకుంటే, ఎలాంటి చడీ చప్పుడు లేకుండా షార్ట్ ఫిల్మ్‌లోని కంటెంట్‌తో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఆస్కార్‌ని దక్కించుకుంది. అంతేకాదు ప్రతిభ ఉంటే చాలు.. మన గురించి మరీ డప్పు కొట్టుకోనక్కర్లేదని, ప్రమోషన్ల కోసం డబ్బులు వెదజల్లక్కర్లేదని కూడా కుండబద్ధలు కొట్టినట్టు చెప్పింది.

ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' అని అనౌన్స్ చేసిన తర్వాత ఇద్దరు మహిళలు వేదికపైకి వచ్చి ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారాలను అందుకున్నారు. వీళ్ళిద్దరిలో ఒకరు దర్శకురాలు కాగా, మరొకరు నిర్మాత. అవార్డు అందుకున్న తర్వాత వీళ్ళు ఎవరని గూగుల్‌లో సెర్చ్ చేసిన వాళ్ళ లెక్క సెకను సెకన్‌కి పెరిగిపోయింది. ఈ షార్ట్ ఫిల్మ్‌ని దర్శకురాలు కార్తికి గోన్‌సాల్వెస్ దర్శకత్వంలో నిర్మాత గునీత్ మోగ్నా నిర్మించారు. దర్శకురాలికి ఇదే తొలి షార్ట్ ఫిల్మ్ కాగా గునీత్ మోగ్నా ఇప్పటికే పలు చిత్రాలను నిర్మించారు. ఇంతకీ వీళ్ళు ఈ షార్ట్ ఫిల్మ్‌కి ఎంచుకున్న కాన్సెప్ట్ ఏంటో తెలుసుకుని చాలా మంది ఆశ్చర్యపోయారు. రెండు అనాథ ఏనుగు పిల్లలను ఆదరించిన ఓ పేద నిరుపేద జంట కథ ఇది. ప్రకృతికి, మనిషికి, జంతువుల మధ్య ఎలాంటి బంధం ఉంటుందనే కంటెంట్‌తో షార్ట్ ఫిల్మ్ తీసి, భారీ పోటీని సైతం తట్టుకుని ప్రతిష్టాత్మక ఆస్కార్‌ని దక్కించుకోవడమంటే ఆషామాషీ కాదు. అలాంటిది ఈ మహిళా దర్శక, నిర్మాతలు సాధ్యమే అని ఆస్కార్ వేదిక సాక్షిగా నిరూపించారు. అంతే కాదు ఎప్పటికైనా, ఎక్కడైనా సరే కంటెంటే కింగ్ అని సాలిడ్‌గానూ చెప్పారు. ఆస్కార్‌ను అందుకున్న తర్వాత ఈ షార్ట్ ఫిల్మ్‌లోని అనాథ ఏనుగు పిల్లలను చూసేందుకు దేశ, విదేశాలను నుంచి టూరిస్టులు తమిళనాడులోని కృష్ణగిరి ఆరణ్యానికి తరలి రావడం విశేషం.

ఎందుకు మౌనంగా ఉన్నాయి?

ఆస్కార్ వంటి ప్రతిష్టాత్మక అవార్డుని తెలుగు సినిమా పాట కైవసం చేసుకున్నప్పటికీ మన దేశంలోని ఇతర సినీ పరిశ్రమలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?, ముఖ్యంగా బాలీవుడ్ ఎందుకు గప్‌చుప్‌గా ఉంది. సోషల్ మీడియా వేదికగా ఎందుకు అభినందనలు తెలుపలేదు?, ఎవరో ఒకరిద్దరు ప్రముఖులు తప్ప వీటి గురించి సామాజిక మాధ్యమాల్లో ట్వీట్లు ఎందుకు చేయలేదు. వాళ్ళు జెలసీగా ఫీలయ్యారా లేక పెద్ద లాబియింగ్ వల్లే వచ్చిందనే భావనతో ఉన్నారా అనేది తెలియాల్సి ఉంది. ఇతర సినీ పరిశ్రమలే కాదు మన తెలుగునాట కూడా గాయనీగాయకులు, సంగీత దర్శకులు, గీత రచయితలు ఊహించిన స్థాయిలో అభినందనలు చెప్పకపోవడాన్ని ఎలా స్వీకరించాలి? అనేది కూడా సమాధానం లేని ప్రశ్నగానే మిగలడం బాధాకరం.



డి.వి.వి.దానయ్య

ఆ విజ్ఞత ఎందుకు కొరవడింది?

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని దాదాపు 600 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అలాంటి నిర్మాతని విస్మరించి రాజమౌళి టీమ్ ఆస్కార్ ప్రమోషన్ల పర్వాన్ని నిర్వహించింది. అంతేకాదు ఆస్కార్ వేదికపై ఆయన ఊసే లేకుండా రాజమౌళి, రాజమౌళి కొడుకు కార్తీకేయ గురించి కీరవాణి ఆకాశానికెత్తేశాడు. ఇక హీరోలు మాత్రం తక్కువ అన్నట్టు.. వీళ్ళు కూడా పెయిడ్ పబ్లిసిటీ ప్రమోషన్లలో రాజమౌళి గొప్పతనం గురించి, కీరవాణి సామర్థ్యం గురించి చెప్పిందే చెప్పారు తప్ప.. అసలు ఇంత భారీ ప్రాజెక్ట్‌కి కారణమైన నిర్మాత గురించి చెప్పకపోవడం గమనార్హం. దీంతో పాపం.. దానయ్య అంటూ సోషల్ మీడియాలో ఆయనపై సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే సమయంలో ఎందుకు వీళ్ళు నిర్మాత గురించి చెప్పలేదనే కోణాన్ని పరిశీలిస్తే, ఆస్కార్ ప్రమోషన్ల కోసం భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుందని రాజమౌళి బృందం దానయ్యకి చెబితే, నా వల్ల కాదు.. అని ఆయన ఇచ్చిన సమాధానమే ఆయన పేరుని ఎవైడ్ చేయటానికి కారణమని తెలిసింది. అయితే ఇదే ఆస్కార్ వేదికపై ఆస్కార్ అందుకున్న ప్రతి విజేత తమ నిర్మాత గురించి సగర్వంగా చెప్పుకున్నారు. దీనికి కూడా ప్రత్యక్ష ఉదాహరణ తనని, తన కథని నిర్మాత నమ్మబట్టే ఈ వేదికపై ప్రతిష్టాత్మక ఆస్కార్‌ని అందుకున్నానని నిర్మాత గునీత్ మోగ్నా గురించి దర్శకురాలు కార్తికి గోన్‌సాల్వెస్ గొప్పగా చెప్పింది. ఈపాటి విజ్ఞత కీరవాణికి ఎందుకు కొరవడింది?



రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్

స్వామి కార్యం.. స్వకార్యం

ఆస్కార్ అవార్డుల వేదికను దర్శకుడు రాజమౌళి, హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్ అండర్‌కరెంట్‌గా హాలీవుడ్‌లో పాగా వేయటానికి బాగా ఉపయోగించుకున్నారని కొంత మంది అంటుంటే, హాలీవుడ్ సంస్థలు మన సినిమాల్లో పెట్టుబడులు పెట్టడానికి వీళ్లొక మార్గాన్ని సెట్ చేశారని మరికొంత మంది చెబుతున్నారు. పైగా వీళ్ళ వల్లే తెలుగు సినిమా స్థాయి గురించి మరోమారు అంతర్జాతీయంగా ఓ వెలుగు వెలుగుతోందని మరికొంత మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా రాజమౌళి తీరే కాదు హీరోలు రామ్‌చరణ్, ఎన్టీఆర్ తీరు కూడా స్వామి కార్యం.. స్వకార్యం అన్న చందానా విస్తృత ప్రచార పర్వం తేటతెల్లం చేసిందనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి.

ఎవరీ కార్తికేయ..?



కార్తికేయ

ఆస్కార్ వేదికపై అవార్డుని అందుకున్న తరుణంలో తన ఆనందాన్ని పాట రూపంలో వ్యక్తం చేశారు కీరవాణి. అందులో భాగంగా రాజమౌళితోపాటు కార్తికేయ గురించి కూడా చెప్పారు. దీంతో ఎవరీ కార్తికేయ అని అందరిలో ఆసక్తి రేకెత్తింది. రాజమౌళి ఆస్కార్ కలని సాకారం చేసింది ఆయన తనయుడు కార్తికేయ అని తెలిసింది. అసలు ఆస్కార్ ప్రాసెస్ ఏంటి?, ఎలా అప్లై చేయాలి?, అవార్డు రావాలంటే ఎలాంటి స్ట్రాటజీని ఫాలో అవ్వాలి?, ఓవర్సీస్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాని ఎలా వాడుకోవాలి?, యు ట్యూబర్స్‌తో ఎలా 'నాటు' పాట కవర్‌సాంగ్స్ చేయించాలి?, మన హీరోలతో ఎలాంటి ప్రచారం చేయించాలి?, ఎవరి పార్టీలకు చిత్ర బృందం అటెండ్ అవ్వాలి?, గోల్డెన్ గ్లోబ్, హాలీవుడ్ ఫిల్మ్ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల పరిస్థితి ఏంటి? ఇవి దక్కించుకుంటే ఆస్కార్‌ని పొందటానికి ఎంత శాతం ఉపయోగపడుతుంది?, ఇలా ఆస్కార్‌కి అప్లై చేసిన దగ్గర్నుంచి ఆస్కార్‌ని అందుకునేంత వరకు కార్తికేయ స్కెచ్ చాలా కీలకంగా పని చేసింది. దీని కోసం ఎంత డబ్బు, సమయం వెచ్చించాలో కూడా తనే నిర్ణయించాడు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గానూ చేశారు.



పంచ్ పడుద్ది!

74 దేశాలు, 350కి పైగా మేటి బాక్సర్లతో.. బాక్సింగ్ మహా సమరానికి రంగం సిద్ధమైంది. మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్స్‌కు న్యూఢిల్లీలోని ఇంధిరాగాంధీ ఇండోర్ స్టేడియం ముస్తాబైంది. ముచ్చటగా మూడో సారి ఏబీఏ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వబోతున్న భారత్.. ఆతిథ్య దేశం ఈ సారి పసిడి పతకాలపై పంచ్ విసిరేందుకు రెడీ అవుతోంది. తెలంగాణ సూపర్‌స్టార్, యంగ్ బాక్సర్ నిఖత్ జరీన్, ఒలింపిక్ పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా పసిడి ఆశలకు సారథ్యం వహించనున్నారు. మార్చి 15-26 వరకు మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ జరుగనున్నాయి.

నేటి నుంచి మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్

- పసిడి రేసులో నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహైన్
- భారత్ నుంచి పోటీలో 12 మంది బాక్సర్లు





నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఓ వైపు బహిష్కరణలు, మరోవైపు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఒత్తిడి.. ఈ రెండింట నడుమ పారిస్ 2024 ఒలింపిక్స్‌కు అర్హత టోర్నీగా పరిగణిస్తారా? లేదా? అనే సందిగ్ధం ఎటూ తేలకుండానే 2023 ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌కు రంగం సిద్ధమైంది. నేడు న్యూఢిల్లీలోని ఇంధిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ ఆరంభం కానున్నాయి. 2001లో ఆరంభమైన ఐబీఏ (ఏఐబీఏ) మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌కు ఆతిథ్యం ఇవ్వటం భారత్ కు ఇది మూడోసారి. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌కు వేదికగా నిలిచే అవకాశం మరో దేశానికి మూడుసార్లు దక్కలేదు. టోర్నీ చరిత్రలో ఇదో రికార్డు!.

మనోళ్లు 12 మంది

మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో 12 విభాగాల్లో పసిడి పతకాలు అందుబాటులో ఉన్నాయి. ఆతిథ్య భారత్ 12 విభాగాల్లోనూ బాక్సర్లను బరిలోకి దింపుతోంది. ఒలింపిక్ మెడలిస్ట్, రెండు సార్లు వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్‌తో పాటు వరల్డ్, కామన్‌వెల్త్ చాంపియన్ నిఖత్ జరీన్ ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. యూత్ వరల్డ్ చాంపియన్ నీతూ (48 కేజీలు) తొలిసారి సీనియర్ విభాగంలో బరిలోకి దిగుతోంది. సాక్షి చౌదరి (52 కేజీలు), ప్రీతీ (54 కేజీలు), మనీశ (57 కేజీలు), జేస్మేన్ లాంబోరియ (60 కేజీలు), సాక్షి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియ (66 కేజీలు), సనంచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), సవీటి బూర (81 కేజీలు), నుపుర్ షేరన్ (81 ప్లస్ కేజీలు) భారత్ తరఫున ఆడనున్నారు. తెలంగాణ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్ 50 కేజీల విభాగంలో పంచ్ విసరనుంది.

నిఖత్, లవ్లీనాకు కొత్తగా!

సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహైన్ పసిడి ఫేవరేట్లుగా నిలిచారు. ఈవెంట్ జరుగుతున్న స్టేడియంలో నిఖత్ జరీన్, లవ్లీనా కటౌట్లు సందడి చేస్తున్నాయి. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి నెగ్గిన నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్‌లో పతకం దక్కించుకున్న లవ్లీనా బొర్గొహైన్‌లు ఈ ఏడాది కొత్త విభాగాల్లో పోటీ పడుతున్నారు. లవ్లీనా బొర్గొహైన్ ఒలింపిక్స్‌లో 66 కేజీల విభాగంలో పోటీపడింది. కానీ పారిస్ 2024 ఒలింపిక్స్‌లో మహిళల 69 కేజీల విభాగం తొలగించారు. ఇదే సమయంలో నిఖత్ జరీన్ పోటీపడే 52 కేజీల విభాగం సైతం ఒలింపిక్స్‌లో లేదు. నిఖత్ జరీన్ అందుకోసమే 50 కేజీల విభాగంలో పోటీపడుతుండగా.. లవ్లీనా బొర్గొహైన్ 75 కేజీల విభాగంలో పంచ్ విసరనుంది. కామన్‌వెల్త్ క్రీడల్లో నిఖత్ జరీన్ 50 కేజీల విభాగంలోనే పసిడి సొంతం చేసుకుంది. కానీ కామన్‌వెల్త్ పోటీ, వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీ పూర్తి భిన్నం. రెండు కేజీలు బరువు తగ్గిన నిఖత్ జరీన్ పారిస్‌లో ఒలింపిక్ పతకమే లక్ష్యంగా చెమటోడ్చుతోంది. మరోవైపు లవ్లీనా కాస్త బరువు పెరిగి 75 కేజీల విభాగంలో పోటీపడేందుకు సై అంటోంది. వెయిట్ విభాగాల్లో మార్పుతో టెక్నికల్, ట్యాక్టికల్‌గా నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గొహైన్‌లు పలు మార్పులు చేసుకోవాల్సి ఉంది. నిఖత్ జరీన్ పోటీపడే 50 కేజీల విభాగంలో బాక్సర్లు మెరుపు వేగంతో స్పందిస్తారు. కామన్‌వెల్త్ క్రీడల్లో నిఖత్ జరీన్ 50 కేజీల విభాగంలో అత్యంత బలమైన పంచ్‌లతో పాటు అత్యం వేగంగా ప్రత్యర్థులపై పంచ్‌లు సంధించిన బాక్సర్‌గా నిలిచింది. కామన్‌వెల్త్, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లలో నాకౌట్ విజయాలతో పసిడి సాధించిన నిఖత్ జరీన్.. సొంతగడ్డపై అదే ప్రదర్శన పునరావృతం చేసేందుకు ఎదురు చూస్తోంది.

రూ.20 కోట్ల ప్రైజ్‌మనీ

ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ చరిత్రలోనే అత్యధిక నగదు బహుమతి ఈ ఏడాది అందించనున్నారు. 12 విభాగాల్లో విజేతలకు రూ.20 కోట్ల నగదు బహుమతి ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏబీఏ, బిఎఫ్ఐ ప్రకటించాయి. పసిడి విజేతలకు రూ.10 కోట్లను ఇవ్వనుండా.. రజత, కాంస్య పతక విజేతలకు రూ. 5 కోట్ల చొప్పున అందించనున్నారు. 12 విభాగాల్లో బంగారు పతకం సాధించిన బాక్సర్ రూ.82 లక్షలు (1 లక్ష డాలర్లు), సిల్వర్ నెగ్గిన బాక్సర్ రూ.41 లక్షలు (50 వేల డాలర్లు), కాంస్య నెగ్గిన బాక్సర్ రూ.20 లక్షలు (25 వేల డాలర్లు) సొంతం చేసుకోనుంది. 2001లో ఏబీఏ మహిళల ప్రపంచ చాంపియన్‌షిప్ ఆరంభమైన నాటి నుంచి ఇదే అత్యధిక నగదు బహుమానం.

బహిష్కరణ మరక

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో నెలకొన్న వివాదం, గత ఏడాది ఐబీఏ అధ్యక్ష ఎన్నికల ఫలితంగా ప్రపంచ బాక్సింగ్ సమాఖ్యలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి!. రష్యా ప్రతినిధి ఉమర్ క్రెమ్లెవ్ అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) అధ్యక్షుడిగా గత ఏడాది ఎన్నికయ్యారు. తాజా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రష్యా, బెలారస్ బాక్సర్లు తమ జాతీయ ఫెడరేషన్ తరఫున బరిలోకి దిగుతున్నారు. దీంతో టోర్నీలో రష్యా జాతీయ పతాకం, జాతీయ గీతం వినిపిస్తాయి. దీనికి నిరసన వ్యక్తం చేస్తూ.. అమెరికా ఆధ్వర్యంలో పలు దేశాలు ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను బహిష్కరించాయి. నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, ఐర్లాండ్, గ్రేట్ బ్రిటన్, కెనడా, స్వీడెన్, చెక్ రిపబ్లిక్, న్యూజిలాండ్, అమెరికాలు టోర్నీని బహిష్కరించిన జాబితాలో ఉన్నాయి. నెదర్లాండ్స్ వేదికగా సమాంతర ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌ను నిర్వహించేందుకు సైతం ఈ దేశాలు సిద్ధమవుతున్నట్టు న్యూజిలాండ్ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అన్నాడు. 74 దేశాల నుంచి 350కి పైగా బాక్సర్లు న్యూఢిల్లీ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పంచ్ విసరనున్నారు.

ఐఓసీ పరిశీలకుల రాక

ఐబీఏ, ఐఓసీ వివాదం కొనసాగుతుండగా.. మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) పరిశీలకుల బృందాన్ని పంపనుంది. ఈ మేరకు భారత బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. వరల్డ్ చాంపియన్‌షిప్ జరిగే మార్చి 15–26 వరకు న్యూఢిల్లీలోనే ఉండనున్న ఐఓసీ పరిశీలకుల బృందం.. టెక్నికల్, న్యాయ నిర్ణేతలు, రిఫరీలు, ఇతర అంశాలను సునిశిత పరిశీలన చేయనుంది. ఐఓసీ పరిశీలకుల రాకను ఐబీఏ ఆఫీస్ బేరర్లు స్వాగతించారు.

ఐఓసీతో పేచీ

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం వివాదం కొనసాగుతూనే ఉంది. 2016 రియో ఒలింపిక్స్‌లో బాక్సింగ్ బౌట్లను రిఫరీలు, న్యాయనిర్ణేతలు అవినీతి, ప్రలోభాలకు లోబడి నిర్ణయించారని ఐఓసీ స్వతంత్ర నివేదికలో నిగ్గు తేల్చింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీల నిర్వహణ బాధ్యతలను అంతర్జాతీయ బాక్సింగ్ సంఘాన్ని (ఐబీఏ)ను తప్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. రిఫరీలు, న్యాయ నిర్ణేతలు, పాయింట్ల కేటాయింపు, సమీక్ష పద్ధతులు సహా అంశాల్లో వ్యవస్థాగత లోపాలను సరిదిద్దుకునేందుకు ఐబీఏకు ఐఓసీ పలు సూచనలు చేసింది. కానీ ఐబీఏ అవేవీ పట్టించుకోలేదు. దీంతో 2024 పారిస్ ఒలింపిక్స్‌లో సైతం బాక్సింగ్ పోటీలను నిర్వహణను స్వయంగా ఐఓసీ అధికారులే పర్యవేక్షించనున్నారు.

అర్హతపై పీటముడి

అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)పై ఐఓసీ నిషేధం కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో పారిస్ 2024 ఒలింపిక్స్ అర్హత ప్రక్రియపై ఇటీవల ఐబీఏ విడుదల చేసిన షెడ్యూల్‌ను ఐఓసీ తిరస్కరించింది. ఐబీఏ ప్రకారం మహిళల, పురుషుల ప్రపంచ చాంపియన్‌షిప్స్ పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించే టోర్నీలు. కానీ ఐఓసీ ఆసియా క్రీడలు, ఐదు కాంటినెంటల్ టోర్నీలు సహా రెండు ఓపెన్ క్వాలిఫయింగ్ ఈవెంట్లతో పారిస్ ఒలింపిక్ బెర్తులు తేల్చుతామని ప్రకటించింది. ఇటు ఐబీఏ, అటు ఐఓసీ ఒలింపిక్ అర్హత ప్రక్రియపై భిన్న ప్రకటనలు చేయటంతో బాక్సర్లు సందిగ్ధంలో పడ్డారు. ప్రతిష్టాత్మక ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను ఒలింపిక్ అర్హత టోర్నీగా చేయకుంటే బాక్సర్లకు తీరని అన్యాయం జరుగుతుందని ఐబీఏ వాదిస్తోంది.

ఆటలు

నందినికి రజత పతకం



హైదరాబాద్: ఆల్ ఇండి యా ఇంటర్ యూని వర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉస్మా నియా విశ్వవిద్యా లయం విద్యార్థి అగసర నందిని రజత పతకంతో మెరి సింది. మంగళ వారం జరిగిన మహిళల 100మీటర్ల హర్డిల్స్ రేసును నందిని 13.5769 సెకన టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటికే పలు అంతర్జాతీయ టోర్నీల్లో మెరిసిన ఈ ఎస్సీ గురుకుల విద్యార్థి 0.0006సెకన్ల తేడాతో స్వర్ణ పతకాన్ని చేజార్చుకుంది.

ముగిసిన భారత్ పోరు



సింగపూర్ : సింగపూర్ స్మాష్ టేబుల టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరు ముగిసింది. బుధవారం భారత ప్యాడ్లర్ మనిక బత్రా మహిళల, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఓటమితో టోర్నీలో భారత ఆటగాళ్ల సవాల్ ముగిసి నట్టయింది. సాథియన్ గుణశేఖరన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ పోరులో దిగిన మనిక జోడి 2-3(9-11, 9-11, 11-8, 11-5, 11-7)తో నాలుగో సీడ్ జోడి, జపాన్‌కు చెందిన హినా హయత-తొమొకజు హరి మొటొ చేతిలో ఓడిపోయింది. ఈ టోర్నీలో భారత జోడి ఆరో సీడ్‌గా బరిలోకి దిగింది. మహిళల డబుల్స్‌లో మనిక బత్ర-అర్చన కామత్ జోడి చైనాకు చెందిన మెంగ్ చెన్-యిది వాంగ్ చేతిలో 2-3(2-11, 6-11, 15-13, 12-10, 6-11)తో ఓడిపోయారు.

కేన్, సౌథీకి లైన్ క్లియర్

వెల్లింగ్టన్ : కేన్ విలియమ్సన్‌తోపాటు నలుగురు ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడేందుకు క్రికెట్ న్యూజిలాండ్ అనుమతించింది. శ్రీలంక తో సిరీస్ నుంచి వారికి మినహాయిం పునిస్తూ నిర్ణయం తీసుకుంది. కేన్ విలియమ్సన్ (గుజరాత్ టైటాన్స్), టిమ్ సౌథీ(కోల్‌కతా నైట్‌రైడర్స్), డెవాన్ కాన్వే(చెన్నై సూపర్‌కింగ్స్), మిచెల్ శాంట్నర్(చెన్నై సూపర్ కింగ్స్) ఐపీఎల్‌లో ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఫిన్ అలెన్, ఫెర్గూసన్, గ్లెన్ ఫిలిప్స్‌కు తొలి వన్డే అనంతరం ఐపీఎల్‌లో పాల్గొనేందుకు అను మతి లభించింది. న్యూజి లాండ్-శ్రీలంక మధ్య ఈనెల 25న తొలి వన్డే జరుగ నుండగా, ఐపీఎల్ మార్చి 31న ఆరంభం కానున్నది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



భారత మార్కెట్లలో కుదుపు

- అమెరికన్ బ్యాంక్‌ల సెగ
- సెన్సెక్స్ 2500 పాయింట్ల పతనం
- అదాని స్టాక్స్ విలవిల

ముంబయి : అమెరికన్ బ్యాంక్‌ల సంక్షోభం భారత స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. వరుస నష్టాలతో సెన్సెక్స్, నిఫ్టీలు ఐదు మాసాల కనిష్టానికి పడిపోయాయి. సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌ల దివాళాతో వరుసగా నాలుగు సెషన్లలో బిఎస్ఇ సెన్సెక్స్ 2500 పాయింట్లు లేదా 4 శాతం పతనమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ సూచీ 719 పాయింట్లు కోల్పోయింది. కాగా.. మంగళవారం సెషన్‌లో సెన్సెక్స్ 338 పాయింట్లు పతనమై 57,721కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 111 పాయింట్లు నష్టపోయి 17,043 వద్ద ముగిసింది. ఐటి, లోహ, బ్యాంకింగ్ షేర్లు అధికంగా ఒత్తిడికి గురైయ్యాయి. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ స్టాక్, ఐటి రంగాలు 1.65 శాతం చొప్పున నష్టపోయాయి. ఒక్క పూటలో మదుపర్ల సంపద రూ.2 లక్షల కోట్లు ఆవిరయ్యింది. అదాని గ్రూపు షేర్లు అన్నీ నష్టాలు చవి చూశాయి. అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ ఏకంగా 7.25 శాతం కోల్పోయింది. అదాని పోర్ట్స్ 3.93 శాతం, అదాని పవర్ 4.99 శాతం, అదాని ట్రాన్స్‌మిషన్ 5 శాతం, అదాని టోటల్ గ్యాస్ 5 శాతం, అదాని విల్మర్ 4.96 శాతం చొప్పున కుప్పకూలి లోహర్ సర్క్యూట్‌ను తాకాయి. సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా అధికంగా 3 శాతం పడిపోయింది. టిసిఎస్, బజాజ్ ఫైనాన్స్, కొటాక్ బ్యాంక్, విప్రో, టెక్ మహీంద్రా, ఆసియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, ఐటిసి షేర్లు 1-2 శాతం మేర అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 0.44 శాతం పడిపోయి రూ.82.49కి దిగజారింది. గడిచిన వారం రోజుల్లోనే సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీశాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లపై ఒత్తిడి నెలకొంది. ఆసియన్ మార్కెట్లు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

అమెరికన్ బ్యాంక్‌ల పరపతిపై మూడీస్ దృష్టి

- రేటింగ్‌ను తగ్గించే అవకాశం

వాషింగ్టన్ : అమెరికాలో వారం రోజుల్లో మూడు బ్యాంక్ లు మూత పడటంతో ఇంటర్నే షనల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ మిగితా బ్యాంక్‌ల పరపతిపై దృష్టి పెట్టింది. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ సహా మరో ఐదు విత్త సంస్థల పరపతిని సమీక్షించనున్నట్లు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ వెల్లడించింది. వెస్టర్న్ అలయన్స్ బాన్‌కార్ప్, ఇంట్రస్ట్ ఫైనాన్సీయల్ కార్ప్, యుఎంబి ఫైనాన్సీయల్ కార్ప్, జియాన్స్ బాన్‌కార్ప్, కొమెరికా ఐఎన్‌సి విత్త సంస్థల రేటింగ్‌ను సమీక్షిస్తోంది. సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీయడంతో మిగితా రుణ సంస్థల ఆస్తులు, నష్టాలను అంచనా వేయాలని భావిస్తోంది. ఎస్‌విబి బ్యాంక్ డిపాజిటర్లకు అమెరికన్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అక్కడి ఇతర బ్యాంక్‌ల షేర్లు నష్టాలను చవి చూస్తున్నాయి. సోమవారం సెషన్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా పని చేస్తోన్న ఫస్ట్ రిపబ్లిక్ షేర్ 62 శాతం పడిపోయింది. ఫోనిక్స్ కేంద్రంగా ఉన్న వెస్టర్న్ అలయన్స్ 47 శాతం, డల్లాస్ కేంద్రంగా పని చేసే కొమెరికా షేర్ 28 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మూడీస్ ఆయా బ్యాంక్‌ల పరపతిని సమీక్షించాలని యోచిస్తోంది.

మెటాలో మరో 10వేల మంది ఇంటికి

వాషింగ్టన్ : ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా మరో 10,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనుంది. నాలుగు నెలల క్రితం 11వేల మంది సిబ్బందికి ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. ఈ సంఖ్య మొత్తం ఉద్యోగుల్లో 13 శాతానికి సమానం. తాజాగా రెండో రౌండ్‌లోనూ 10వేల మందిని తొలగించాలని నిర్ణయించామని.. అదే విధంగా కొత్తగా 5వేల మందిని భర్తీ చేయాలనుకున్న నిర్ణయాన్ని నిలిపివేస్తామని మెటా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) మార్క్ జూకర్‌బర్గ్ తెలిపారు. తమ ఆర్థిక పరపతిని పెంచుకోవడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీర్ఘకాల లక్ష్యంలో భాగంగా ఉద్వాసనలు జరుగుతున్నాయన్నారు. తొలగింపులు తప్పా సంస్థకు మరో మార్గం లేదన్నారు. టెక్ కంపెనీల్లో ఉద్యోగాలు గాల్లో దీపంలా మారాయి. ట్విట్టర్ సగం మంది ఉద్యోగులను తొలగించగా... తాజాగా మెటా, సేల్స్‌ఫోర్స్‌ల్లోని వేల మంది సిబ్బందికి ఆ కంపెనీలు ఉద్వాసన పలుకుతున్నాయి. 2004లో ఫేస్‌బుక్ ప్రారంభమైన తర్వాత వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. ప్రకటనల ఆదాయం తగ్గుముఖం పట్టడం, అమెరికా సహా ప్రపంచ దేశాల్లో నెలకొన్న మాంద్యం భయాల నేపథ్యంలో మెటా కోతలకు దిగుతోంది. ఈ గ్రూపు పరిధిలో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి దిగ్గజ సోషల్ మీడియా వేదికలు ఉన్నాయి. 2022 నుంచి టెక్ పరిశ్రమలో 2,80,000 ఉద్యోగాలు ఊడయని పలు రిపోర్టులు చెబుతున్నాయి. ఇందులో 40 శాతం ఉద్వాసనలు ఈ ఏడాదిలోనే జరిగాయి.

అసుస్ నుంచి ఎఎండి రైజెన్ 7000 సిరీస్ ల్యాప్‌టాప్‌లు



న్యూఢిల్లీ : అసుస్ తన కన్స్యూమర్ నోట్‌బుక్ శ్రేణీని ఎఎండి రైజెన్ 7000 సిరీస్‌తో విస్తరించినట్లు తెలిపింది. యువత, వ్యాపారవేత్తల కోసం విడుదల చేసిన ఈ నూతన శ్రేణీ ల్యాప్‌టాప్‌లలో జెన్‌బుక్ 14 ఒఎల్ఇడితో పాటుగా వివోబుక్ సిరీస్, తాజా వివోబుక్ గో శ్రేణి ఉత్పత్తులు కూడా ఉన్నాయని పేర్కొంది. నూతన జెన్‌బుక్ 14 ఒఎల్ఇడి ప్రారంభ ధరను రూ.89,990గా, వివోబుక్ గో 14 ధర రూ.42,990గా, వివోబుక్ గో 15 ఒఎల్ఇడి ధర రూ.50,990గా, వివోబుక్ 15 ఎక్స్ ఒఎల్ఇడి ప్రారంభ ధర రూ.66,990గా నిర్ణయించింది.

ఒప్పో నుంచి ఫైండ్ ఎఫ్2 ఫ్లిప్



న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో కొత్తగా భారత మార్కెట్లోకి ఫైండ్ ఎఫ్2 ఫ్లిప్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ ధరను రూ.89,999 గా నిర్ణయించింది. ఇది మార్చి 17 అర్థరాత్రి 12 గంటల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. క్యాష్ బ్యాక్, ప్రోత్సాహకాల ద్వారా రూ.79,999 కే ఈ ఫోన్‌ను పొందవచ్చని పేర్కొంది. దీని బరువు కేవలం 191 గ్రాములుగా ఉందని, తెరిచినప్పుడు 7.45 మిల్లీమీటర్ల స్లిమ్‌గా ఉంటుందని తెలిపింది. 50 ఎంపి సోని ఐఎంఎక్స్ 890 ప్రైమరీ సెన్సార్ ఆల్-పిక్సెల్ ఓమ్ని డైరెక్షన్‌లో ఇంటెలిజెంట్ ఫోకసింగ్‌తో ఫోటోలు ఆకతి, డైనమిక్, వివరణాత్మకంగా కనిపిస్తాయని తెలిపింది. సెల్ఫీల కోసం 32 ఎంపి కెమెరాను అమర్చింది.

'ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు చేపట్టాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు చేపట్టాలని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. పూర్తి వివరాలతో కూడిన పత్రాలను కాలేజీలు పొందుపరచడం లేదంటూ ఏఐసీటీఈ స్పష్టంగా ప్రకటించిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం (2023-24)లో వాటిని తప్పనిసరిగా ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరిందని పేర్కొన్నారు. అలా చేసిన కాలేజీల వివరాలనే పరిశీలిస్తామని ప్రకటించిందని తెలిపారు. వాస్తవానికి కొన్నేండ్లుగా సరైన పత్రాలు లేకుండా ఎలా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. ప్రత్యక్ష తనిఖీలు చేయకుండా, కనీసం కొత్త కోర్సుల అనుమతుల సమయంలో కూడా తనిఖీలు చేయకుండా అనుమతులిచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ఏఐసీటీఈ అధికారులు స్పందించి పారదర్శకంగా తగిన విచారణ, తనిఖీలు చేపట్టాలని కోరారు.

వేగంగా ఉద్యోగ నియామకాలు

- ఆగస్టులోగా వైద్యశాఖలో, సెప్టెంబర్‌లోగా గురుకుల పాఠశాలల్లో...
- 20 వేల పోస్టుల భర్తీ చేయాలి : సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ శాఖల ఉద్యోగ నియామకాల పురోగతిని తెలిపేందుకు ప్రత్యేకంగా డాష్ బోర్డును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. నియామకాలపై మంగళవారం హైదరాబాద్‌లోని బి.ఆర్.కే.భవన్‌లో ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ కార్యదర్శులు టికే శ్రీదేవి, రోనాల్డ్ రోస్, హెచ్ఆర్ఎం అండ్ సర్వీసెస్ సీనియర్ కన్సల్టెంట్ శివశంకర్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్, తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వీ.వీ.శ్రీనివాస రావు, యూనివర్సిటీ కామన్ బోర్డు చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ, ఇప్పటి వరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 17,285 ఉద్యోగాలకు సంబంధించి 17 నోటిఫికేషన్లు విడుదలైనట్టు తెలిపారు. మెడికల్, హెల్త్ సర్వీస్ బోర్డు ద్వారా ఆగస్టులోగా దాదాపు పది వేల వివిధ స్థాయిల్లోని ఉద్యోగ ఖాళీలను నింపనున్నట్టు తెలిపారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా మొత్తం పది వేల పోస్టులకు సెప్టెంబర్ లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు శాంతి కుమారి స్పష్టం చేశారు.

ఉద్యోగాల నియామకాల ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకుని సర్వీసు అంశాలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల అంశాల్లో కొన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించి ఆయా ఉద్యోగ ఖాళీలను నోటిఫై చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. కొన్ని నోటిఫికేషన్లకు ప్రాథమిక పరీక్షలు కూడా పూర్తి చేశామని అధికారులు ఈ సందర్భంగా సీఎస్‌కు వివరించారు. గ్రూప్ 2 ,3 ,4 నోటిఫికేషన్లకు సంబంధించి జూలైలోగా రాత పరీక్షలు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. నవంబర్ వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ కానున్న అన్ని నోటిఫికేషన్లకు సంబంధించి రాత పరీక్షలు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 17,516 పోస్టులకు నోటిఫికేషన్ జారి చేయగా ఇప్పటికే ప్రాథమిక పరీక్షలు పూర్తి చేశామనీ, ఏప్రిల్‌లో రాత పరీక్షలు పూర్తి చేసి, సెప్టెంబర్ లోగా నియామకాలు చేపడతామని చెప్పారు.

పల్లెప్రగతితో మెరుగైన గ్రామీణ జీవన ప్రమాణాలు

రాష్ట్రంలో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం సమీక్షించారు. పల్లె ప్రగతి, జాతీయ ఉపాధి హామీ పథకం, గామీణ సడక్ యోజన, స్వయం సహాయక బృందాల పనితీరు తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్ హనుమంత రావు, తదితర ఉన్నతాధికారులు హాజరైన ఈ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోనే అన్ని గ్రామ పంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పల్లె ప్రగతి, హరిత హారం లాంటి రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక కార్యక్రమాల వల్లనే వంద శాతం గ్రామాలు ఓడీఎఫ్‌గా మారాయన్నారు. ఇంజనీర్-ఇన్-చీఫ్ సంజీవరావు, స్పెషల్ కమిషనర్, ఆర్డీవీఎస్వీఎన్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవరించిన చైర్మెన్, కార్యదర్శిని తొలగించాలని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పరీక్ష కూడా లీకైనట్టుగా వార్తలొస్తున్నాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నియామకాల్లేక ఎన్నో ఏండ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఇలాంటి చర్యలతో తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి, విలువైన సమయం కేటాయించి లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నారని వివరించారు. టీఎస్‌పీఎస్సీలో ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన చైర్మెన్ బి జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌తోపాటు సభ్యుల పాత్రపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చైర్మెన్‌ను తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

అన్ని పరీక్షలపై విచారణ చేయాలి : ఏఐఎస్ఎఫ్

టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ని పరీక్షలపై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ అధికారులు చెలగాటమాడుతున్నారని విమర్శించారు. లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ చైర్మెన్, సభ్యులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులతో చెలగాటం : పీడీఎస్‌యూ

పరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి విజయ్‌ఖన్నా ఇడంపాక విమర్శించారు. ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నోట్ల రద్దుపై పీఎం క్షమాపణ చెప్పాలి

- 54 శాతానికి పెరిగిన నకిలీ కరెన్సీ
- దేశానికి రూ.ఐదు లక్షల కోట్ల నష్టం :మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నోట్ల రద్దు నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రజలకు చెప్పిన ప్రయోజనాలు నెరవేరలేదనీ, అందువల్ల ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, కృష్ణమోహన్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు దండే విఠల్, దేశపతి శ్రీనివాస్ లతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్ద నోట్ల రద్దుతో నకిలి కరెన్సీ అరికట్టకపోగా 54 శాతానికి పెరిగిందనీ, డిజిటల్ కరెన్సీ లక్ష్యం మాటేమో గానీ అంతకు ముందున్న జీడీపీలో 11 శాతాన్ని మించి 13 శాతం కరెన్సీ వాడకం పెరిగిందని విమర్శించారు. నోట్ల రద్దు అట్టర్ ఫ్లాఫ్ షో అనే విషయం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో చేసిన ప్రకటనతో స్పష్టమైందన్నారు. నల్లధనం పెరిగిందనీ, 592 కేసుల్లో రూ.40 వేల కోట్లు పట్టుకున్నారని గుర్తుచేశారు. నోట్లు మార్చుకోవడానికి క్యూలైన్లలో నిలబడి 108 మంది మరణిస్తే, 62 లక్షల మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. కొత్త నోట్ల ముద్రణకు రూ.21 వేలు కోట్లు ఖర్చు పెట్టారనీ, ఆ మొత్తంతో ఒక ప్రాజెక్టు పూర్తయ్యేదని మంత్రి వివరించారు. నోట్ల రద్దు తో 50 రోజుల్లో అంతా బాగుంటుందంటూ బీజేపీ భరోసా ఇచ్చిందనీ, అది జరిగి ఇప్పటికి రెండువేల రోజులైందని గుర్తుచేశారు. మోడీ హయంలో రూ. కోటి ఏడు లక్షల కోట్ల అప్పు తెచ్చారనీ, స్విస్ బ్యాంకుల్లో నల్ల ధనం పెరిగిందని చెప్పారు. విదేశీ మారక నిల్వలు, రూపాయి విలువ రోజు రోజుకు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నోట్ల రద్దుపై శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మతపిచ్చి పెంచడంలో బీజేపీ విజయం సాధించిందని విమర్శించారు. బీజేపీ హఠావో... దేశ్ కో బచావో అనేది తమ నినాదమని స్పష్టం చేశారు.

కేసీఆర్‌ది లీకేజీ..ప్యాకేజీ..డ్యామేజీ

- పేపర్ లీక్‌చేసిన ప్రవీణ్‌కు గ్రూప్-1లో అత్యధిక మార్కులు
- టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేయాల్సిందే : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్‌దీ ప్యాకేజీ, లీకేజీ, నిరుద్యోగులకు డ్యామేజీ చేకూర్చే సర్కార్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల ప్రశ్నపత్రాలన్నీ లీక్ అవుతున్నాయనీ, వాటిని వెంటనే రద్దు చేసి సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్‌ను లీక్ చేసిన ప్రవీణ్‌కు గ్రూప్-1లో అత్యధిక మార్కులు వచ్చాయని తెలిపారు. ప్రవీణ్ రాసిన కేంద్రంలో పరీక్షను మధ్యాహ్నం నిర్వహించారని పేర్కొన్నారు. రాబోయే రెండు నెలల్లో జరుగబోయే పరీక్షలకు సంబంధించిన పరీక్షపత్రాలన్నీ కేసీఆర్ టీమ్‌కు లీక్ అయ్యాయని ఆరోపించారు. గతంలో సింగరేణి పరీక్షా పత్రం లీకైందని గుర్తుచేశారు. ఈ రకంగా రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీలో కాన్ఫిడెన్షియల్ డిపార్ట్‌మెంట్ చైర్మెన్ పరిధిలో ఉంటుందని తెలిపారు. ఆయనకు తెలియకుండా పేపర్ లీక్ కావడం అసాధ్యమని పేర్కొన్నారు. అసలు సెక్షన్ ఆఫీస్ సిస్టమ్‌లో ప్రశ్నపత్రాల డేటాను ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. లీకేజీలపై న్యాయ విచారణ జరపాల్సిందేనని పట్టుబట్టారు. లేదంటే నిరుద్యోగులతో టీఎస్‌పీఎస్‌సీ, ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గిరిజన పారిశ్రామికవేత్తలకు సహకారం

- డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజనులను పారిశ్రామికవేత్తలను చేసేందుకు వీలుగా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ, ట్రైకార్ ఆధ్వర్యంలో అమలవుతున్న సీఎం ఎస్టీ ఎంటర్ ప్రెనర్ షిప్, ఇన్నోవేషన్ పథకంలో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి 50 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్వీఐ శిక్షణా సంస్థలో వారికి ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మెన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, ఎస్వీఐ జీఎం మంజు శర్మ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో అదే సీను

- ఉభయ సభలు వాయిదా
- ఆస్కార్ విజేతలకు అభినందనలు



న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో రెండో రోజు మంగళవారం కూడా అదే సీను కొనసాగింది. ఉభయ సభలు ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే.. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార బీజేపీ ఎంపీలు డిమాండ్ చేస్తూ తమ స్థానాల్లో నిల్చోని నినాదాలు హోరెత్తించారు. అయితే ప్రతిపక్ష ఎంపీలు ప్రధాని మోడీ గతంలో ఇతర దేశాల్లో చేసిన వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులను చేబూని నినాదాలు మారుమోగాయి. దీంతో సభలో తీవ్రమైన గందరగోళం నెలకొంది. వెంటనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలోనూ పరిస్థితి మారలేదు. దాంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలో ఆస్కార్ విజేతలకు అభినందనలు

ఆర్ఆర్ఆర్ సినిమాలో 'నాటు నాటు' సాంగ్‌కు, ద ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీకి ఆస్కార్ అవార్డులు రావడంపై రాజ్యసభ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆస్కార్ విజేతలకు అన్ని పార్టీల సభ్యులు అభినందనలు తెలిపారు. రాజ్యసభ ప్రారంభం కాగానే ఆస్కార్ గ్రహీతలకు అభినందనలు తెలుపుతూ అన్ని పార్టీల నేతలు మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ చిత్ర బృందం, ద ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ బృందంపై ప్రశంసలు కురిపించారు. అనంతరం సభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ రాహుల్ గాంధీ అంశాన్ని ప్రస్తావించారు. బీజేపీ ఎంపీలు తమ స్థానాల్లో లేచి నినాదాలు చేశారు. దీనికి కౌంటర్‌గా ప్రతిపక్ష ఎంపీలు కూడా లేచి నినాదాలు చేశారు. పీయూష్ గోయల్‌పై కాంగ్రెస్ ఎంపీ శక్తిసింహ గోహిల్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. లోక్‌సభ సభ్యుని గురించి సత్యదూరమైన విషయాలను రాజ్యసభలో ప్రస్తావించడం సభా హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా కించపరిచే వ్యాఖ్యలు చేశారని అన్నారు. అంతకు ముందు పార్లమెంట్ గేటు నెంబర్ 1 వద్ద కాంగ్రెస్, ఆప్, బీఆర్ఎస్ ఎంపీలు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య మహిళ ప్రారంభం

- మొదటిరోజు 4,793 మందికి స్క్రీనింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి రోజు 4,793 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 975 మందికి అవసరమైన మందులు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు కరీంనగర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లో 100 కేంద్రాల్లో వైద్య సేవలు మొదలయ్యాయి. దశల వారీగా 1200 కేంద్రాలకు విస్తరించనున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకే వైద్య సేవలు అందిస్తారు. మొత్తం 8 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత తొలి మంగళవారం కావడంతో 100 కేంద్రాల్లో స్క్రీనింగ్ నిర్వహించారు.

'ఉపాధి'ని నీరుగార్చే పనిలో కేంద్రం : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే పనిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్ రెడ్డి, మాలోత్ కవిత అడిగిన ప్రశ్నలకి కేంద్రమంత్రి చెప్పిన సమాధానంపై ఎర్రబెల్లి తీవ్రంగా స్పందించారు. పేదల పట్ల కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరి ఏంటో మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. పేదలను కొట్టి పెద్దలకు పంచే పద్ధతిని అవలంబిస్తున్నదని విమర్శించారు. గడిచిన రెండేండ్లలో కేంద్రం బడ్జెట్లోనే ఉపాధి హామీకి 55 వేల కోట్ల రూపాయల కోతను విధించడం దారుణమని పేర్కొన్నారు. దీంతో ఉపాధి హామీ చట్టం కింద పేదలకు లభించే పని దినాలు తగ్గిపోతున్నాయని వాపోయారు. మెటీరియల్ కాంపోనెంట్ కూడా తరిగిపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఉపాధి హామీని రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలోనూ అనేక ఆంక్షలు పెట్టిందని విమర్శించారు.

మహిళా బిల్లుపై నేడు ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో మహిళా బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం జరుగనున్నది. మధ్యాహ్నం 3 గంటలకు 'లే మెరిడియన్ హోటల్'లో ఈ సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సమావేశానికి ప్రతిపక్ష పార్టీల నేతలు, పౌర సమాజం, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరవుతారు. మహిళా బిల్లుపై కవిత ఆధ్వర్యంలో ఇటీవల జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో పంచాయతీ భవనాల్లేవ్..

- తెలంగాణలో 7,986 గ్రామాలు, ఏపీలో 2,163 ప్రాంతాల్లో...

న్యూఢిల్లీ : తెలంగాణలో 7,986 గ్రామాల్లో,ఆంధ్రప్రదేశ్‌లో 2,163 గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాలు, ఏపీలో 3,308, తెలంగాణలో 8,333 పంచాయతీలకు కంప్యూటర్ సౌకర్యం లేదని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) మధురై జోనల్ కార్యాలయాన్ని విశాఖపట్నం తరలించేందుకు ఆమోదం తెలిపినట్లు, హైదరాబాద్‌లోని సబ్ జోనల్ కార్యాలయాన్ని జోనల్ కార్యాలయం స్థాయికి పెంచినట్టు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

మతోన్మాద బీజేపీని ప్రతిఘటించండి

17న మానుకోటలో భారీ బహిరంగ సభ

- సభ విజయవంతానికి సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం : కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య వెల్లడి



నవతెలంగాణ-మహబూబాబాద్

మతోన్మాద బీజేపీ ఫాసిస్టు కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 17 నుంచి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని, 17న మానుకోటలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొమ్మిదేండ్లుగా దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీ అయిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బయ్యారం ఉక్కు ఖనిజంలో నాణ్యత లేదని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే దళిత, గిరిజన ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని అన్నారు. పూర్తిగా గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో కనీసం గిరిజన యూనివర్సిటీ కూడా నోచుకోలేదని అన్నారు. 2014లో రూ.1700 కోట్లు ఉన్న అదానీ ఆదాయం ఇప్పుడు రూ.16లక్షల కోట్లకు పెరగడానికి మోడీ కార్పొరేట్ విధానాలే కారణమని తెలిపారు. ఆదానీ మూలంగా ఎస్‌బీఐ, ఎల్ఐసీ లాంటి ప్రభుత్వ సంస్థలు మునిగిపోయే పరిస్థితికి వచ్చిందని ఆరోపించారు. దేశంలో ధరల పెరుగుదల, గ్యాస్, పెట్రోల్ ధరలు, నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశానంటు తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల తగ్గించి మధ్యతరగతి ఉద్యోగుల ఆదాయ పన్నును పెంచారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ 9 ఏండ్లలో 1800 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు సంస్థల్లో ఉన్న బ్లాక్ మనీని తీసుకుని వచ్చి ప్రతి ఒక్క నిరుపేద బ్యాంక్ అకౌంట్‌లో రూ.15 లక్షలు ఇస్తానని చెప్పి రూ.15 కూడా వేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారం కోసం బీజేపీ నేతలు గోతి కాడి నక్కలాగా కూర్చున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే దేశ సంపద రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మతోన్మాద శక్తులైన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా ప్రజలను చైతన్యం చేయడం కోసం సీపీఐ(ఎం) నిర్వహించే జన చైతన్య ప్రజా యాత్ర ఈనెల 17న వరంగల్‌లో ప్రారం భమవుతుందని తెలిపారు. 17న ఉదయం 10 గంటలకు వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని తెలిపారు.

అదేరోజు వెయ్యి ద్విచక్ర వాహనాలతో మానుకోటకు జాత చేరుకుంటుందని, సాయంత్రం 5 గంటలకు తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారని తెలిపారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి లక్ష్యంగా సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతున్నదని తెలిపారు బీజేపీని కట్టడి చేసి ప్రజల్లో ఒంటరి చేసి ఓడించడమే లక్ష్యంగా ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. విలేకరుల సమావేశంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్నపు సోమయ్య ఆకుల రాజు, గునగంటి రాజన్న పాల్గొన్నారు.